

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 2-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 297

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి రా.6:54 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: మృగశిర రా.8:04 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: తె.3:33-4:59, దుర్ముహూర్తం: ఉ.9:01-9:45, మ.12:41-1:25, అమృతఘడియలు: మ.12:16-1:41, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:49, సూర్యాస్తమయం: 5:48 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్విట్జర్లాండ్ బార్‌లో

అగ్ని ప్రమాదం

40 మంది మృతి

115 మందికిపైగా గాయాలు

కొత్త సంవత్సరం వేళ విషాదం

2



9

నేటి నుంచి 12 వరకు

పుస్తక మహోత్సవం



12

పక్కాగా పులుల లెక్క!

రేపటి నుంచే నల్లమలలో గణన ప్రక్రియ

నాలుగేళ్లకు ఓసారి దేశవ్యాప్తంగా లెక్కింపు

'టైగర్ రిజర్వు'లోనూ సిద్ధమైన అటవీ శాఖ



14

బుల్లెట్‌ను చూపుతున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి

గాలి జనార్దన్‌రెడ్డిపై హత్యాయత్నం!

బళ్లారిలో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి సన్నిహితుడి కాల్పులు

గన్‌మన్ తుపాకీ లాక్కుని 2 రౌండ్లు కాల్చిన సతీశ్‌రెడ్డి

తప్పించుకున్న మాజీ మంత్రి

ఇరు వర్గాల పరస్పర కాల్పులు

ఒకరి మృతి.. సతీశ్‌కు గాయాలు

ఇక సిగ'రేట్'

ట్రిపుల్!

2

పాన్ మసాలాల ధరలూ భారీగా పెంపు

పొగాకు ఉత్పత్తులపై 40% జీఎస్టీ, అదనపు సుంకం

బీడీలపై మాత్రం 18% జీఎస్టీ

ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి



9

2025లో హుండీ ఆదాయం

1,383.90 కోట్లు

2.61 కోట్ల మంది భక్తులకు శ్రీవారి దర్శనం

13.52 కోట్ల లడ్డూల విక్రయాలు

'విముక్తి' వీటికేనట...

మాజీ, ప్రస్తుత సైనికోద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములు, 1954కు ముందు అసైన్‌మెంట్ చేసిన భూములు.. ఇంకా ప్రైవేటు పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి ప్రకటించారు.

ఇదీ వాస్తవం

ఈ ఐదు కేటగిరీల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ 2014-19 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వమే ఉత్తర్వులు జారీ చేసింది. మళ్లీ 2022-2024లో గత జగన్ ప్రభుత్వమూ ఇవే ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని ఇప్పుడు కొత్తగా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్టు మంత్రి అనగాని చెప్పడం ఏమిటో? కొత్త ఫైలుపై తొలి సంతకం చేయడం ఏమిటో?

విముక్తి కావాల్సినవి

షరతుగల పట్టా, సర్వీసు ఇనాం, చుక్కల భూములు, రీ సర్వే సమయంలో నిషేధిత జాబితాలో చేర్చిన పట్టా, చుక్కల భూములు... ఇవీ అసలు సమస్య!

ఇదీ జరిగింది

జగన్ ప్రభుత్వ హయాంలో నిషేధిత భూముల విషయంలో అక్రమాలు జరిగాయని, అనేకమందికి అన్యాయం జరిగిందని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని సీఎం చంద్రబాబు పలుమార్లు ఆదేశించారు. మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. పది నెలలవుతున్నా ఎలాంటి పురోగతి లేదు.

పాత మాటే కొత్తగా

రెవెన్యూ మంత్రి తొలి సంతకంలో వింత

నిషేధిత జాబితా భూములపై విచిత్రం

పదేళ్ల కిందటే వాటికి 'నిషేధ' విముక్తి

ఆదేశాలు అమలు చేయని అధికారులు

ఇప్పుడు మళ్లీ విముక్తి అంటూ పాత పాట

కీలకమైన 4 కేటగిరీల భూములపై నాన్చుడు

సీఎం పలుమార్లు ఆదేశాలిచ్చినా అంతే

జగన్ ప్రభుత్వ పాపాలకు ఇప్పుడు రైతులు బలి

గత జగన్ ప్రభుత్వంలో 13 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. ఇందులో 5.75 లక్షల ఎకరాలను అక్రమంగా 22(ఏ) నుంచి తొలగించినట్టు కూటమి ప్రభుత్వం గుర్తించింది. వీటిపై చర్యలు తీసుకోకుండా మొత్తం అసైన్డ్ భూములపై నిషేధం విధించింది. ఇప్పటికీ అక్రమార్కులపై చర్యలు తీసుకోలేదు. బాధిత రైతులకు న్యాయం చేయలేదు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుని ఆదేశాలు జారీ చేసిందంటే కొత్తగా అమల్లోకి వచ్చినట్టే లెక్క. అందులోనూ కొత్త ఏడాది దీనికి సంబంధించిన ఫైలుపై తొలి సంతకం చేశామని మంత్రి చెప్పారంటే 'కొత్త'గా భావించాల్సిందే. అయితే... ఐదు రకాల భూములను నిషేధిత జాబితా 22(ఏ) నుంచి తొలగిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పడం రెవెన్యూ వర్గాలనే విస్మయానికి గురిచేస్తోంది. మాజీ సైనికులు, ప్రస్తుతం సర్వీసులో ఉన్న సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ

మిగతా 13వ పేజీలో...

22(ఏ) నుంచి 5 రకాల

భూముల తొలగింపు

2 నెలల్లో మరో 4 రకాలపై నిర్ణయం

నకిలీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు రద్దు

నేటి నుంచి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ

ఈ ఏడాది భూనామ సంవత్సరం

అక్రమార్కులపై చర్యలు: అనగాని



5 రకాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే ఫైలుపై సంతకం చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

500 కోట్ల కిక్కు

న్యూ ఇయర్‌కు భారీగా తాగేశారు

డిసెంబరు 31-జనవరి 1 మధ్యలో అసాధారణంగా మద్యం విక్రయాలు

6.73 లక్షల కేసుల లిక్కర్, 2.95 లక్షల కేసుల బీర్ అమ్మకాలు

ఫుల్‌గా తాగి ఊగిన మందుబాబులు



నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రంలో మద్యం ఏరులై పారింది. గతానికి భిన్నంగా ఈ ఏడాది రాష్ట్రంలో అసాధారణ స్థాయిలో అమ్మకాలు జరిగాయి. డిసెంబరు 29 నుంచి మూడు రోజుల్లో రూ.543 కోట్ల విలువైన మద్యాన్ని షాపులు, బార్ల లైసెన్సీలు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేశారు. అందులో అత్యధిక భాగం డిసెంబరు 31, జనవరి 1 తేదీల్లో విక్రయించినట్లు ఎక్సైజ్ శాఖ అంచనా వేసింది.

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గతంలో రాష్ట్రంలో న్యూ ఇయర్ వేడుకల సమయంలో రోజుకు రూ.150 కోట్ల లోపే అమ్మకాలు జరిగాయి. కానీ ఈసారి అందుకు భిన్నంగా రోజుకు సగటున రూ.180 కోట్ల మద్యం అమ్మకాలు నమోదు కావడం గమనార్హం. రాష్ట్రంలో ప్రతిరోజూ సగటున రూ.85కోట్ల అమ్మకాలు జరుగుతాయి. నూతన సంవత్సరం సందర్భంగా దీనికి రెట్టింపు కంటే ఎక్కువ అమ్మకాలు జరిగాయి. 6.73 లక్షల కేసుల లిక్కర్, 2.95 లక్షల కేసుల బీర్‌ను

మిగతా 12వ పేజీలో...

ప్రాజెక్టుల సందర్శనకు సీఎం

13

5న పోలవరం.. 7న వెలిగొండ

17న ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి.. స్వయంగా పనుల పరిశీలన

ఆ ప్రాజెక్టుల వివరాలు పంపాలని జల వనరుల శాఖకు సీఎంవో ఆదేశం

అనేక ఏళ్లుగా 'నో'.. యనమల కోసం 'ఎస్'

గేట్లు ఎత్తేశారు!

టీటీడీకి పెనుభారంగా 'స్వీకరణ' ఆలయాలు

వేటినీ తీసుకోరాదని 28 ఏళ్ల కిందటే తీర్మానం

పలుమార్లు అదే తీర్మానం చేసిన పాలక మండలి

పదుల కొద్దీ ప్రతిపాదనలు వచ్చినా నిరాకరణ

యనమల రామకృష్ణుడి స్వగ్రామంలోని గుడికి మాత్రం మినహాయింపు

రెండు నెలల క్రితం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చి.. అంతలోనే అదే తీర్మానాన్ని ఆమోదించిన బోర్డు

'టేకోవర్' ఆలయాలతో టీటీడీకి అనేక ఇబ్బందులు

ఆర్థిక, న్యాయపరమైన వివాదాలతో సతమతం

అందుకే 1997లోనే స్వస్తి చెబుతూ తీర్మానం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎవరో ఒకరు తమ ప్రాంతంలో వైష్ణవాలయం నిర్మిస్తారు. కొన్నాళ్లు బాగానే నిర్వహిస్తారు. తర్వాత... నిర్వహణ భారమవుతుంది. ఆ వెంటనే 'టీటీడీ పరిధిలోకి తీసుకోండి' అని విన్నవించుకుంటారు! మరి టీటీడీ ఏం చేయాలి? అలా.. 'టేకోవర్' చేస్తూ పోతే ఆగేదెప్పుడు? అందుకే... 'ఇకపై ప్రైవేటు ఆలయాలను టీటీడీ స్వీకరించకూడదు' అని 1997లో బోర్డు ఒక తీర్మానం చేసింది. ఆ తర్వాత పలుమార్లు అదే తీర్మానించింది. కానీ... ఇప్పుడు ఒక ఆలయం కోసం ఆ తీర్మానాన్ని పక్కనపెట్టేసింది. అందులోనూ... రెండు నెలల క్రితం 'నో' చెప్పిన ఆలయానికే ఇప్పుడు 'ఎస్' చెప్పింది. అది...

మిగతా 13వ పేజీలో...

తల వదిలేసి తోక పట్టుకున్నారు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును శ్రీశైలానికి తరలించారు



కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్ ఫైర్

జూరాల నుంచే నీళ్లు తీసుకుని ఉంటే ఏపీ లబోదిబోమని ఏడ్చేది


నాడు 299 టీఎంసీలు చాలని మాజీ సీఎం, హరీశ్ సంతకాలు చేశారని ధ్వజం

నేడు కృష్ణా జలాల్లో 555 టీఎంసీలివ్వాలని తాము ట్రిబ్యునల్‌ను కోరుతున్నామని వెల్లడి

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి కాకుండా శ్రీశైలానికి తరలించడానికి క్యాబినెట్ ఆమోదమే లేదు. పేరు మారింది... ఊరు మారింది.. అంచనాలు మారాయి. ఇలా శ్రీశైలానికి మార్చడం వెనుక లోతైన అవినీతి ఉంది' అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణ చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృష్ణా , గోదావరి బేసిన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ భేటీలో రేవంత్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. 'దొరికిన కాడ వదిలేసి.. తలను(జూరాల) వదిలేసి, తోక (శ్రీశైలం) దగ్గరకు

మిగతా 14వ పేజీలో...





పండ్లకు కవర్ల రక్ష!

నాణ్యత, అధిక ధర సాధనే లక్ష్యం

నిరుడు మామిడిలో మంచి ఫలితాలు

అరటి, దానిమ్మకూ తొడుగులు

12

ఈ ఏడాది అన్ని పండ్లకూ కవరింగ్

50 వేల హెక్టార్లలో అమలుకు నిర్ణయం

ఉద్యాన రైతులకు 50% రాయితీ

పిల్లలను పెంచలేక.. ఎవరూ ఆదరించక!

ముగ్గురు బిడ్డలకు విషమిచ్చి చంపిన తండ్రి

12

ఆపై తానూ ఉరివేసుకుని బలవన్మరణం

ఐదు నెలల క్రితం భార్య ఆత్మహత్య

ఉయ్యాలవాడలో పెను విషాదం



నూతన సంవత్సరం సందర్భంగా ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణను గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి.

సిగరెట్లు మరింత ప్రియం



పాన్ మసాలాల ధరలూ భారీగానే.. పొగాకు ఉత్పత్తులపై కేంద్రం వడ్డన

- 40% జీఎస్టీ, అదనపు సుంకం
- బీడీలపై మాత్రం 18 శాతం జీఎస్టీ
- ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, జనవరి 1: సిగరెట్లు తాగేవారికి, పాన్ మసాలాలు వాడే వారికి కేంద్రం గట్టి షాకిచ్చింది. పొగాకు ఉత్పత్తులపై భారీగా పన్నులు పెంచనుంది. ఒక్కో సిగరెట్ ధర దాదాపు 3 నుంచి 4 రెట్లు పెరగనుంది. అలాగే పాన్ మసాలాల ధరలు భారీగానే పెరగనున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి కొత్త పన్నులు వర్తిస్తాయి. పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలాల వాడకాన్ని నియంత్రించే ప్రయత్నంలో భాగంగా వాటిపై పన్నులు పెంచనున్నట్టు కేంద్రం ప్రకటించింది. 'హానికారక వస్తువులు' కోసం ఇటీవల సవరించిన జీఎస్టీ రేటు కంటే పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలాలపై అదనపు చార్జీలు విధిస్తారు. ఇలాంటి వస్తువులపై ప్రస్తుతం విధిస్తున్న పరిహార సెస్ స్థానంలో ఇవి వర్తిస్తాయి. సిగరెట్లపై 40 శాతం జీఎస్టీతో పాటు అదనపు ఎక్సైజ్ సుంకం విధిస్తారు. సిగరెట్ల ధరలో 53 శాతం పన్నుల రూపంలో ప్రభుత్వానికి వెళ్తుంది. కాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశం ప్రకారం 75 శాతం పన్నులు వేయాలి. ఇక పాన్ మసాలాలపై అదనపు ఎక్సైజ్ సుంకం స్థానంలో ఆరోగ్య, జాతీయ భద్రత సెస్ విధిస్తారు. 40 శాతం జీఎస్టీ ఉంటుంది. నమిలే పొగాకు, జర్దా సువాసన గల పొగాకు, గుట్కా ప్యాకింగ్ యంత్రాల (సామర్థ్య నిర్ధారణ, సుంకం వసూలు) నియమాలు-2026ను కేంద్ర ఆర్థిక శాఖ కూడా నోటిఫై చేసింది. కాగా సిగరెట్లతో పోలిస్తే బీడీలపై జీఎస్టీ రేటు తక్కువగా 18 శాతం ఉంటుంది. బీడీ పరిశ్రమలలో అందులోనూ ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే కార్మికుల జీవనోపాధి కాపాడటానికి జీఎస్టీ రేటు తక్కువగా వేసినట్టు సమాచారం.

వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ భగ్గు

- 19 కిలోల సిలిండర్‌పై రూ.111 పెంపు

న్యూఢిల్లీ, జనవరి 1: హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపార సంస్థలు వినియోగించే 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వరంగ చమురు సంస్థలు రూ.111 మేర పెంచాయి. ఇది గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. తాజా పెంపు తర్వాత ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.1,691.50కు, హైదరాబాద్‌లో రూ.1,912కు పెరిగింది. ఇక గృహ అవసరాల కోసం వినియోగించే 14 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరను మాత్రం కంపెనీలు యథాతథంగా ఉంచాయి. కాగా ఏటీఎఫ్ ధరను గురువారం 7.3 శాతం తగ్గించాయి. దీంతో ఢిల్లీలో కిలో లీటరు ఏటీఎఫ్ ధర రూ.7,353.75 తగ్గి రూ.92,323.02కు చేరుకుంది. ఏటీఎఫ్ ధర తగ్గిన నేపథ్యంలో విమాన టికెట్ల ధరలు కూడా దిగిరావడానికి అవకాశం ఏర్పడుతుంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు, మారకం రేటును బట్టి చమురు కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన ఏటీఎఫ్, ఎల్పీజీ ధరలను సవరిస్తున్న విషయం తెలిసిందే.

లోకం తీరు



బంగ్లాదేశ్‌లో మరో హిందువుపై మూకదాడి

- పలుమార్లు పొడిచి, పెట్రోల్ పోసి నిప్పు
- చెరువులో దూకి ప్రాణాలతో బయటపడిన బాధితుడు

ఢాకా, జనవరి 1: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఓ హిందువును పదునైన ఆయుధంతో పలుమార్లు పొడిచి తర్వాత పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. షరియత్‌పూర్ పట్టణంలో బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. షరియత్‌పూర్‌లో ఓ ఫార్మసీ నిర్వాహకుడైన ఖోకన్‌దాస్ (50) తన దుకాణాన్ని మూసేసి ఇంటికి వెళ్తుండగా రాత్రి 9 గంటలప్పుడు దాస్‌పై దుండగులు దాడి చేశారు. పలుమార్లు పొడిచి ఆపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టగా సమీపంలోని చెరువులోకి దూకాడు. రక్షించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. తీవ్రమైన కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న దాస్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ దాడికి పాల్పడిన వారి వివరాలు, కారణం తెలియాల్సి ఉంది. కాగా, బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత కొనసాగుతుండగా.. గత 2 వారాల్లో దేశంలోని హిందువులపై జరిగిన నాలుగో దాడి ఇది. విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ హత్య అనంతరం హింస చెలరేగింది. ఈ క్రమంలో హిందూ వ్యక్తులు దీపూ చంద్రదాస్, అమృత్ మండల్ వేర్వేరు ఘటనల్లో హత్యకు గురికాగా.. మరో ఘటనలో బజేంద్రబిశ్వాస్‌ను అతని సహోద్యోగి తుపాకీతో కాల్చి చంపాడు.

ఫిబ్రవరి 1 నుంచి అన్ని కొత్త కార్లు జీప్‌లు, వ్యాన్ల ఫాస్టాగ్‌లకు కేవైవీ నిలిపివేత

న్యూఢిల్లీ, జనవరి 1: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అన్ని కొత్త కార్లు, జీప్‌లు, వ్యాన్లకు జారీ చేసే ఫాస్టాగ్‌లకు తప్పనిసరి నో యువర్ వెహికిల్ (కేవైవీ) ప్రక్రియను నిలిపివేయాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయించింది. తాజా సంస్కరణతో లక్షలాది మంది వాహనదారులకు ఊరట కలగనుంది. వాహనానికి సంబంధించి అన్ని చెల్లుబాటయ్యే పత్రాలు ఉన్నప్పటికీ కేవైవీ ప్రక్రియలో జాప్యం కారణంగా వాహనదారులు ఇబ్బందిపడుతున్నట్టు గుర్తించి తాజా నిర్ణయం తీసుకున్నారు. ఇక ఇప్పటికే కార్లకు జారీ చేసిన ఫాస్టాగ్‌లకు కేవైవీ అవసరం లేదని ఎన్‌హెచ్‌ఏఐ పేర్కొంది.

రష్యా ఆక్రమిత ఖేర్సన్‌లో డ్రోన్ దాడి.. 24 మంది మృతి

మాస్కో, జనవరి 1: కొత్త సంవత్సర వేడుకల వేళ రష్యా ఆక్రమిత ప్రాంతంలోని ఓ హోటల్, కేఫ్‌పై డ్రోన్ దాడులతో 24 మంది మరణించారు. మరో 50 మందికి గాయాలయ్యాయి. ఖేర్సన్ ప్రాంతంలోని ఖోర్లీ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రజలంతా న్యూ ఇయర్ వేడుకల్లో ఉండగా ఉక్రెయిన్‌కు చెందిన మూడు డ్రోన్లు దాడి చేయడంతో భారీ ప్రాణ నష్టం జరిగిందని గురువారం రష్యా అధికారులు తెలిపారు. శత్రు దేశం ప్రయోగించిన డ్రోన్లను పలు ప్రాంతాల్లో తమ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని చెప్పారు. భద్రతా కారణాలతో పలు విమానాశ్రయాలను మూసివేసినట్లు పేర్కొన్నారు.

న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీ ప్రమాణం

- తొలి భారతీయ ముస్లింగా రికార్డు



న్యూయార్క్, జనవరి 1: ప్రపంచమంతా నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్న కొన్ని క్షణాల్లోనే న్యూయార్క్ నగర మేయర్‌గా భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ జనవరి ఒకటో తేదీన (బుధవారం అర్ధరాత్రి) ప్రమాణ స్వీకారం చేశారు. మాన్‌హట్టన్‌లోని చారిత్రాత్మక సబ్‌వే స్టేషన్‌లో డెమోక్రటిక్ పార్టీకి చెందిన జోహ్రాన్ మమ్దానీతో న్యూయార్క్ అటార్నీ జనరల్ లెతెతీయా జేమ్స్ ప్రమాణం చేయించారు. న్యూయార్క్ నగర మేయర్‌గా ప్రమాణం చేసిన తొలి ముస్లిం కావడం గమనార్హం. భార్య రమా దువాజీ పట్టుకున్న ఖురాన్‌పై ప్రమాణం చేసిన మమ్దానీ.. తన జీవితానికి దక్కిన ఈ గౌరవం ఎంతో ప్రత్యేకమైందన్నారు. మమ్దానీ ఇప్పటి వరకు నివాసం ఉన్న అద్దె ఇంటి నుంచి మేయర్ అధికారిక నివాసానికి మారనున్నారు.

మూడు రోజుల పోలీసు కస్టడీకి జోగి సోదరులు

- ములకలచెరువు నకిలీ మద్యం కేసులో తంబళ్లపల్లె కోర్టు ఉత్తర్వులు

ములకలచెరువు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులైన మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాములను కోర్టు మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇచ్చింది. ఈ మేరకు గురువారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమర్ ఫరూక్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విజయవాడ జైల్లో ఉన్న ఇద్దరినీ శుక్రవారం నుంచి ఆదివారం వరకు విచారించనున్నారు. శుక్రవారం ఉదయం జోగి సోదరులను ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకుని అక్కడే విచారిస్తారు. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఏ32గా ఉన్న రమేశ్, ఏ33గా ఉన్న రామును కస్టడీకి ఇవ్వడంతో పలు కీలక విషయాలు బయటపడే అవకాశం ఉంది.

తెలంగాణ పోలీసుల అదుపులో మావోయిస్టు దేవా?

న్యూఢిల్లీ, జనవరి 1: మావోయిస్టు అగ్రనేత బర్సె దేవా అలియాస్ సుక్కాను తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మావోయిస్టు పార్టీలో కీలక నేత అయిన దేవాపై రూ.50 లక్షల రివార్డు ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తికి చెందిన ఇతడు.. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన అగ్రనేత హిడ్మాతో కలిసి పనిచేసినట్లు తెలిసింది. దేవా అరెస్టును పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు. మరోవైపు దేవాను పోలీసులు పట్టుకున్నారని, అతడిని వెంటనే కోర్టులో హాజరుపర్చాలని పౌరహక్కుల సంఘం నేతలు డిమాండ్ చేశారు.

అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ గుట్టు రట్టు

- ఢిల్లీ వైద్యుడు అరెస్టు.. పరారీలో తమిళనాడు డాక్టర్
- కాంబోడియా, చైనాల్లోనూ కిడ్నీ రాకెట్ లింకులు
- ఒక్కో కిడ్నీకి రూ.80 లక్షలు.. దాతకు ఇచ్చేది 8 లక్షలే

చంద్రపూర్, జనవరి 1: అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ గుట్టును మహారాష్ట్రలోని చంద్రపూర్ పోలీసులు రట్టు చేశారు. ఢిల్లీకి చెందిన వైద్యుడు రవీందర్ పాల్ సింగ్‌ను అరెస్టు చేశారు. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన వైద్యుడు రాజారత్నం గోవిందస్వామి పరారవడంతో అతని కోసం గాలిస్తున్నారు. కాంబోడియా, చైనా దేశాలకూ ఈ కిడ్నీ రాకెట్ విస్తరించినట్టు పోలీసులు గుర్తించారు. చంద్రపూర్ జిల్లా మింథుర్ గ్రామానికి చెందిన బాధితుడు రోషన్ కులే ఫిర్యాదుతో దీనిపై దర్యాప్తునకు మహారాష్ట్ర ప్రభుత్వం చంద్రపూర్ పోలీసులతో సిట్‌ను నియమించింది. రోషన్ కులే అనే రైతు అప్పుల ఊబి నుంచి బయటపడేందుకు కిడ్నీని కాంబోడియాలో అమ్ముకునేలా ఆయనపై నిందితులు ఒత్తిడి తెచ్చినట్టు దర్యాప్తులో సిట్ గుర్తించింది. మనదేశంతోపాటు విదేశాల్లోనూ ఈ ముఠా అక్రమంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించినట్టు గుర్తించామని చంద్రపూర్ ఎస్పీ ఎం.సుదర్శన్ చెప్పారు. తిరుచ్చిలోని స్టార్ కిమ్స్ ఆస్పత్రిలో అనేక కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగినట్టు తెలిపారు. డాక్టర్ రాజారత్నం గోవిందస్వామి ఈ ఆస్పత్రికి మేనేజింగ్ డైరెక్టర్. కాగా ఒక్కో కిడ్నీ మార్పిడికి రూ.50-రూ.80లక్షల వరకు వసూలు చేసినట్టు దర్యాప్తులో గుర్తించారు. డాక్టర్ రవీందర్ తిరుచ్చికి వచ్చి ఆపరేషన్ నిర్వహించినందుకు రూ.10లక్షలు, డాక్టర్ రాజారత్నం చికిత్సతోపాటు తన స్టార్ కిమ్స్ ఆస్పత్రిలో ఆపరేషన్‌కు చేసిన ఏర్పాట్లకు రూ.20 లక్షలు, మధ్యవర్తిగా ఉన్న నకిలీ వైద్యుడు కృష్ణ అలియాస్ రామకృష్ణ సుంచు కిడ్నీ దాతలను గుర్తించి సమన్వయం చేసినందుకు రూ.20 లక్షలు తీసుకుని కిడ్నీ దాతకు రూ.5-8 లక్షల వరకు ఇచ్చేవారు.

స్విట్జర్లాండ్ బార్‌లో భారీ అగ్నిప్రమాదం

40 మంది మృతి.. 115 మందికిపైగా గాయాలు

- కొత్త సంవత్సరం వేళ విషాదం

క్రాన్స్-మోంటానా (స్విట్జర్లాండ్), జనవరి 1: స్విట్జర్లాండ్‌లో నూతన సంవత్సర వేడుకల్లో పెను విషాదం చోటుచేసుకుంది. ఆల్ప్స్ పర్వతాల్లో పర్యాటకులకు స్వర్గధామంలాంటి క్రాన్స్-మోంటానాలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ బార్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 40 మంది వరకు మరణించారు. 115 మందికి పైగా గాయపడ్డారు. రాత్రి 1.30 గంటల సమయంలో ప్రఖ్యాత లీ కాన్‌స్టిలేషన్ బార్‌లో వందలమంది కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆనందంగా వేడుకలు జరుపుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి ముందు భారీ పేలుడు శబ్దం వినిపించిందని స్థానికులు చెబుతుండగా, బార్‌లో ఓ వెయిటర్ షాంపేన్ బాటిల్ మూత భాగంలో స్పార్క్ (మెరుపు లాంటి మంట)ను అంటించుకొని తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు సీలింగ్‌కు మంట అంటుకుందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే, ప్రమాదానికి గల కారణాలను ఇప్పుడే నిర్ధారించలేమని వలైస్ కాంటన్ పోలీస్ కమాండర్ ఫ్రెడరిక్ గిస్లర్ గురువారం తెలిపారు.

అట్టుడుకుతున్న ఇరాన్!

- దేశవ్యాప్తంగా రోడ్లపైకి ఆందోళనకారులు
- భద్రతా బలగాలతో తీవ్ర ఘర్షణలు
- ముగ్గురు మృతి.. సంఖ్య మరింత ఎక్కువగా ఉండే చాన్స్

టెహ్రాన్, జనవరి 1: కరెన్సీ దారుణ పతనం, నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇరాన్‌లో మొదలైన ఆందోళనలు మరింత ఉధృతమవుతున్నాయి. బుధవారం వరకు టెహ్రాన్, ఇతర పట్టణ ప్రాంతాల్లోనే నిరసనలు జరగగా, గురువారం గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాయి. ఆందోళనకారులకు, వారిని నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్న భద్రతా బలగాలకు తీవ్రస్థాయిలో ఘర్షణలు జరుగుతున్నాయి. గురువారం లోర్డెగన్, కుహ్దష్త్, ఇస్ఫహాన్ ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో ముగ్గురు మరణించారు. మృతుల సంఖ్య భారీగానే ఉందని, ఆందోళనల అంశాన్ని ప్రభుత్వం తొక్కిపెడుతోందని స్థానిక మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇక గురువారం నిరసనకారులు ఫసా నగరంలోని గవర్నర్ కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో.. ఒక పోలీసు మృతిచెందగా, మరో ముగ్గురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు.

60 డొల్ల కంపెనీలతో 6,200 కోట్లు మోసం

బ్యాంకులకు కోల్‌కతా వ్యాపారి సంజయ్ సురేఖ కుచ్చుటోపీ

న్యూఢిల్లీ, జనవరి 1: బ్యాంకులను మోసం చేయడానికి 60 డొల్ల కంపెనీలను సృష్టించాడు కోల్‌కతా వ్యాపారి సంజయ్ సురేఖ. తన కార్ల డ్రైవర్లు, ఇంట్లో పనివాళ్లు, ఆఫీస్ బాయ్‌లు, జూనియర్ సిబ్బందిని డైరెక్టర్లుగా పెట్టి, కాగితాలపైనే కల్పిత టర్నోవర్ చూపి బ్యాంకులకు రూ.6,200 కోట్లు కుచ్చుటోపీ పెట్టాడు. అతనికి అప్పులిచ్చిన బ్యాంకుల కన్సార్టియంలోని యూకో బ్యాంక్ అప్పటి సీఎండీ ఎస్కే గోయెల్ సహకారంతో అంత మొత్తం కాజేశాడు. సంజయ్ కంపెనీలన్నింటి మొత్తం విలువ కేవలం రూ.600 కోట్లు మాత్రమేనని, ఇప్పటివరకూ వాటి అమ్మకాల ద్వారా రూ.434 కోట్ల మాత్రమే వచ్చిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు నివేదిక స్పష్టం చేసింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ కేసులో విచారణ జరిపి ఈడీ 2024లో సంజయ్ సురేఖ, అతని సిబ్బందిని అరెస్టు చేసింది. గతఏడాది మే 16న ఢిల్లీలో ఎస్కే గోయెల్ అరెస్టుతో ఈ మోసం వ్యవహారం బట్టబయలైంది. ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన రూ. 106 కోట్లను ఈడీ అటాచ్ చేసింది. ఈడీ దర్యాప్తు నివేదిక తాజా వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల్లో ప్లాంట్‌లు ఉన్న కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (సీ ఎస్‌పీఎల్)ను 2008లో సంజయ్ సురేఖ టేకోవర్ చేశారు. 2007 నుంచి 2010 వరకు యూకో బ్యాంక్ సీఎండీ పనిచేసిన గోయెల్ సహకారంతో సంజయ్ బ్యాంకుల నుంచి వడ్డీ, పెనాల్టీలు లేకుండా రూ. 6,200 కోట్ల రుణం పొందాడు. ఈ డబ్బులో కొంత మొత్తాన్ని క్విడ్ ప్రో కో కింద గోయెల్‌కు బదిలీ చేశాడు.

లగ్జరీ కార్ల కొనుగోలుపై 'లోక్‌పాల్' వెనక్కి!

న్యూఢిల్లీ, జనవరి 1: తన సభ్యుల కోసం ఏడు అత్యంత ఖరీదైన హైఎండ్ బీఎండబ్ల్యూ కార్ల కొనుగోలు నిర్ణయంపై అవినీతి నిరోధక సంస్థ 'లోక్‌పాల్' వెనక్కి తగ్గింది. ఈ వివాదాస్పద ఆర్డర్‌ను రద్దు చేసింది. పౌర సమాజం, ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో లోక్‌పాల్ ఇటీవల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే పాలనాపరమైన కారణాలతో కార్ల కొనుగోలు టెండర్‌ను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. గత నవంబరు 25న లోక్‌పాల్ ధర్మాసనం చేసిన తీర్మానం ఆధారంగా టెండర్లను రద్దు చేసినట్లు తెలిపింది.

వందేభారత్ 'స్లీపర్' రైలు సిద్ధం

- గువాహటి - కోల్‌కతా మధ్య తొలి రైలు
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 1: వందేభారత్ రైలు స్లీపర్ కోచ్‌లో ప్రయాణించాలన్న ప్రయాణికుల కోరిక త్వరలో తీరనుంది. వందే భారత్ స్లీపర్ కోచ్‌లతో కూడిన రైలును ప్రధాని మోదీ చేతుల మీదుగా తర్వలో ప్రారంభించనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ట్రైల్ రన్, ఇతర పరీక్షలు అన్నీ పూర్తయ్యాయని తొలి స్లీపర్ రైలును గువాహటి-కోల్‌కతా మధ్య నడపనున్నామని ఆయన వివరించారు. 'చాన్నాళ్లుగా కొత్త జనరేషన్ వందేభారత్ రైళ్ల కోసం ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉంది. భారతీయ రైల్వేలో వందేభారత్ చైర్ కార్ రైళ్లతో కొత్త శకం ఆరంభమైంది. ఈ రైళ్లను ప్రజలు కూడా బాగా ఆదరిస్తున్నారు. వేలాది కిలోమీటర్ల దూరం ప్రయాణించే వారిని దృష్టిలో పెట్టుకుని స్లీపర్ కోచ్‌లతో కూడిన వందేభారత్ రైళ్లను రూపొందించాం. అధునాతన భద్రతా ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయి స్లీపర్ కోచ్‌లతో ఈ రైళ్లను సిద్ధం చేశాం' అని వైష్ణవ్ ఢిల్లీలో విలేకరులకు వివరించారు. టికెట్ ధరలు కూడా మధ్యతరగతి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయిస్తున్నామని తెలిపారు. గువాహటి-హౌరా మధ్య ప్రయాణానికి 3ఏసీ టికెట్ ధర రూ.2300గా ఉండొచ్చని తెలిపారు. దేశంలో తొలి బుల్లెట్ రైలు ట్రైల్ రన్‌ను 2027 ఆగస్టు 15న నిర్వహిస్తామని వెల్లడించారు. ముందుగా సూరత్-బిలిమోరా మార్గంలో బుల్లెట్ రైలు సిద్ధమవుతుందని ఆయన పేర్కొన్నారు.

బడి నుంచే వృత్తి విద్య



బీపీ పరీక్షిస్తున్న విద్యార్థిని

రాష్ట్రంలో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు వృత్తి విద్య దిశగా అడుగులు వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,599 పాఠశాలల్లో 3.28 లక్షల మంది 9 నుంచి 12 తరగతుల విద్యార్థులు వృత్తి విద్యను అభ్యసిస్తున్నారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులు కూడా ప్రీ-ఒకేషనల్ ఎడ్యుకేషన్ నేర్చుకుంటూ వృత్తి విద్యపై అవగాహన పెంచుకుంటున్నారు. దీంతో ఉన్నత విద్య కు వెళ్లే సమయానికే అదనపు ప్రయోజనం చేకూరనుంది.

- విద్యార్థుల భవితకు సరికొత్త బాటలు!
- 6-12 తరగతుల విద్యార్థులకు పాఠశాలల్లో నైపుణ్య విద్యా శిక్షణ
- 1,599 ఉన్నత స్కూళ్లలో కోర్సులు
- 3.28 లక్షల మందికి భవిష్యత్తుకు ఉపయోగపడేలా పునాది
- వచ్చే ఏడాది టెన్త్‌లో 'వృత్తి' మార్కులు

6-12 తరగతుల విద్యార్థులకు పాఠశాలల్లో నైపుణ్య విద్యా శిక్షణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 6వ తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన వృత్తి విద్యా నైపుణ్యాలు చేరువ అవుతున్నాయి. ఉన్నత విద్యకు చేరుకునే సరికి వారిలో నైపుణ్య స్థాయిలు పెంచడం ద్వారా ఏకోర్సునైనా ఎంచుకునేలా తర్ఫీదు ఇస్తున్నారు. 2016-17లో పాఠశాలల్లో వృత్తి విద్యను ప్రారంభించినప్పుడు 8 వేల మంది విద్యార్థులు మాత్రమే వృత్తి విద్యా కోర్సులు చదివారు. అది ఇప్పుడు 3,28,255కు చేరింది. 164 మోడల్ స్కూల్స్, 30 రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ పాఠశాలలు, 189 సాంఘిక, 26 గిరిజన, 20 బీసీ సంక్షేమ పాఠశాలలు, 352 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, 670 ఎంపీ, జడ్పీ పాఠశాలలు, 36 మున్సిపల్ పాఠశాలలు, 95 ప్రభుత్వ పాఠశాలలు, 17 ఆశ్రమ పాఠశాలల్లో ఒకేషనల్ కోర్సులు అమలు చేస్తున్నారు. ఇక, రాబోయే రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6,500 ఉన్నత పాఠశాలల్లో కూడా వృత్తి విద్యా కోర్సులు అమలుచేయాలని సమగ్రశిక్షా శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

పుస్తకాలకే పరిమితం కాకుండా..

అనేక దేశాల్లో పాఠశాల విద్య కేవలం పుస్తకాలకే పరిమితం కావడంలేదు. అనుభవపూర్వక విద్యా విధానం అమలు చేస్తున్నారు. దీనివల్ల వృత్తులపై అవగాహన పెరగడంతో పాటు జీవితాంతం గుర్తుండేలా మేలు చేస్తుంది. మన రాష్ట్రంలో విద్య అంటే పుస్తకాలతో కుస్తీ పట్టే విధానమే ఉంది. ఆ స్థానంలో అనుభవపూర్వక విద్యా విధానాన్ని విస్తరించడమే లక్ష్యంగా పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు అమలు చేస్తున్నారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో స్కిల్ పోటీలు కూడా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 260 స్కిల్ ప్రాజెక్టులు రూపొందించి విజయవాడలో ప్రదర్శించారు.



దుస్తుల దుకాణంలో చీరలు విక్రయిస్తున్న విద్యార్థి

అనేక రంగాల్లో కోర్సులు

వివిధ రంగాల్లో కోర్సులను పాఠశాల విద్యలో అమలు చేస్తున్నారు. విద్యార్థులు వారి అభిరుచి ఆధారంగా వాటిని ఎంపిక చేసుకుంటున్నారు. వ్యవసాయం, వస్త్ర పరిశ్రమలు, ఆటోమొబైల్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, బ్యాంకింగ్-ఆర్థిక సేవలు, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆరోగ్య సంరక్షణ, ఐటీ, రిటైల్, విద్యుత్ రంగాల్లో వృత్తి విద్యా కోర్సులు అమలవుతున్నాయి. వాటిని నేర్పించడమే కాకుండా ఇన్‌టర్న్‌షిప్‌లు, ఇండస్ట్రియల్ విజిట్ వంటివి అమలు చేస్తున్నారు. విద్యార్థులను ఆయా పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు తీసుకెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. వస్త్ర వ్యాపారంలో అమ్మకాలు, హెల్త్ కేర్‌లో రోగికి బీపీ, ఇతర ప్రాథమిక అంశాల పరిశీలన వంటివి నేర్పుతున్నారు. మొత్తంగా 11 విభాగాల్లో 27 ఉద్యోగాలకు సంబంధించిన అంశాలపై కోర్సులు చేరువ చేశారు. ఏవైనా కారణాలతో ఉన్నత విద్యలో ముందుకు సాగకపోయినా వృత్తి విద్యను మెరుగుపరుచుకుని ఉపాధి పొందే అవకాశం ఏర్పడుతుంది.

సౌకర్యాలతో బోధన

2016-17లో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభించినా మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చింది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ ఆదేశాలతో సౌకర్యాల కల్పన చేపట్టారు. 2,701 పాఠశాలల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. 41 పాఠశాలల్లో 'హబ్ అండ్ స్పోక్' విధానంలో ప్రయోగ శాలలు నిర్మించారు. అలాగే వృత్తి విద్యా బోధనకు పూర్తిస్థాయిలో ట్రైనర్లను నియమించారు. జాతీయస్థాయిలో పాఠశాల స్థాయి వృత్తి విద్యకు పూర్తిస్థాయిలో పుస్తకాలు అందుబాటులోకి రాకపోవడంతో సమగ్రశిక్ష 38 పాఠ్యపుస్తకాలను ట్రైనర్ల ద్వారా రూపొందించింది.

మార్కుల మెమోలో

2026-27 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో వినూత్న మార్పు తీసుకురానున్నారు. ప్రస్తుతం టెన్త్ మార్కుల మెమోల్లో కేవలం సబ్జెక్టుల మార్కులే ఉంటున్నాయి. ఇకపై విద్యార్థి నేర్చుకున్న వృత్తి విద్యా కోర్సుకు సంబంధించిన మార్కులను కూడా మెమోలో జత చేయనున్నారు. దీని వల్ల విద్యార్థికి అధికారికంగా వృత్తి కోర్సులో సర్టిఫికేషన్ లభిస్తుంది.

ఉన్నత విద్యలో ప్రయోజనం: ఎస్పీడీ

పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్యా కోర్సులు నేర్పడం వల్ల అదనపు ప్రయోజనం చేకూరుతుందని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. 'చదువుతూ నేర్చుకోవడం వేరు. స్వయంగా పనిచేస్తూ నేర్చుకోవడం వేరు. పాఠశాల విద్య పూర్తయ్యేనాటికి వృత్తి విద్యా సర్టిఫికెట్ అందటంతో పాటు జీవితంలో ముందుకు సాగే నైపుణ్యంపై అవగాహన ఏర్పడుతుంది. పుస్తకాలు జ్ఞానానికి మార్గం చూపితే, నైపుణ్యం జీవించడానికి ఆధారంగా మారుతుంది. ఉన్నత విద్యలో ఇవే వృత్తి విద్యా కోర్సులు చదివే వారు ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తారు. విద్యార్థులు స్వయంగా పనిచేస్తూ నేర్చుకోవాలన్నది మా లక్ష్యం. మంత్రి లోకేశ్ నేతృత్వంలో మరింత సమర్థంగా అమలుచేస్తాం' అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దౌత్య చొరవలు..!

భారత విదేశాంగమంత్రి జయశంకర్ ఢాకాలో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదాజియా అంత్యక్రియలకు హాజరై, ఆమెకు ఘన నివాళులు అర్పించారు. ఖలీదా కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారిఖ్ రహ్మాన్‌తో జైశంకర్ కరచాలనం చేస్తున్న చిత్రాన్ని అక్కడి భారత హైకమిషనర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేశారు. భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఢిల్లీలోని బంగ్లాదేశ్ దౌత్యకార్యాలయంలో కాలూని, ఖలీదా కన్నుమూత మీద ఆవేదన ప్రకటిస్తూ సంతాపవాక్యాలు రాశారు. మంగళవారం ఉదయం ఆమె మరణవార్త వెలువడగానే భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒకసారి గతాన్ని కూడా గుర్తుచేసుకుంటూ బేగం ఆధ్వర్యంలో భారత్–బంగ్లా బంధం బలపడటానికి కృషిజరిగిందని ప్రస్తుతించారు. 2015లో ఆమెతో భేటీ అయ్యాయని, ఆమె దార్శనికురాలని శ్లాఘించారు. ఖలీదాజియా అనారోగ్యంతో ఆస్పత్రిలోచేరగానే ఆమె చికిత్సకు అవసరమైనంత సాయం చేయడానికి తాము సిద్ధమంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేసినందుకు బీఎన్‌పి కృతజ్ఞతలు కూడా తెలియచేసింది. భారత్ వైఖరిమారిపోతోందా? అంటూ రేగుతున్న ప్రశ్నలను, సాగుతున్న చర్చలనూ అటుంచితే, బంగ్లాదేశ్‌తో భవిష్యత్ సంబంధాలను కాస్తంత మెరుగుపరుచుకోవడానికి ఇటువంటి దౌత్య పరమైన చొరవలూ చర్యలూ ఉపకరిస్తాయి.

బేగమ్‌లు ఇద్దరూ లేని బంగ్లాదేశ్ కొత్త ప్రయాణం ఆరంభించిందని మీడియా వ్యాఖ్యానిస్తోంది. పదిహేడేళ్ళుగా బ్రిటన్‌లో ఉంటున్న తారిఖ్ రాకతో బంగ్లాదేశ్ దశదిశ మారిపోబోతున్నాయని కూడా అంటున్నారు. ఎప్పుడెప్పుడని అంతా ఎదురుచూస్తున్నా, ఫిబ్రవరి 12నాటి ఎన్నికల ప్రకటన వెలువడేంత వరకూ వ్యూహాత్మకంగా ఆగి, ఆ తరువాత కానీ ఆయన రాకను బీఎన్పీ ఖరారు చేయలేదు. తారిఖ్ దేశంలో కాలూనిన ఐదురోజుల్లో ఖలీదా కన్నుమూశారు. జైలునుంచి విడుదలయ్యేప్పటికే తన తల్లి తీవ్ర అస్వస్థతతో ఉన్నారంటూ తారిఖ్ చేసిన వ్యాఖ్యలూ విమర్శల వెనుక షేక్ హసీనా మీద కక్షమాత్రమే కాదు, రాబోయే ఎన్నికలు, భవిష్యత్ రాజకీయ వ్యూహం కూడా ఉన్నాయి. వచ్చేనెల జరగబోయే ఎన్నికల్లో బిఎన్‌పి ఘనవిజయం సాధిస్తుందన్న ప్రచారంలో అతిశయోక్తి ఏమీ లేదు. బరిలో బలమైన ప్రత్యర్థి లేనందున అది సునాయాస విజయం. జమాత్–ఎ–ఇస్లామీ సైతం అతిబలంగా ఉన్నందున బిఎన్‌పి తరువాతస్థానంలో ఇదే ఉంటుందట. హసీనాకు వ్యతిరేకంగా సాగిన జూలై తిరుగుబాటులో కీలకభూమిక నిర్వహించిన నేషనల్ సిటిజన్‌పార్టీ (ఎన్‌సిపి)తో పొత్తు సాధించిన ఉత్సాహంలో జమాతే ఉంది. పాకిస్థాన్‌తో యుద్ధాన్ని, బంగ్లాదేశ్ విముక్తిని తీవ్రంగా వ్యతిరేకించిన ఈ పాక్ అనుకూల ఇస్లామిక్ పార్టీ 2001–2006మధ్యకాలంలో బిఎన్‌పి ప్రభుత్వంలో భాగస్వామిగా కరుడుగట్టిన భారత వ్యతిరేక వైఖరిని ప్రదర్శించింది. తన ఏలుబడిలో జమాతేతో హసీనా నిత్య యుద్ధం చేశారు. ఎన్నికల్లో పాల్గొనడానికి అనర్హమైనదని 2013లో కోర్టు ప్రకటించడంతో వెనక్కుపోయిన ఈ సంస్థను 2024లో నోబెల్ విజేత మహ్మద్ యూనిస్ ప్రభుత్వం తిరిగి రక్షించింది. రేపటి ఎన్నికల్లో అద్భుత విజయం సాధించబోతున్న ఈ సంస్థ పూర్తి ఇస్లామిక్ పాలనకోసం పట్టుబట్టకపోయినా, ప్రభుత్వ భాగస్వామిగా పాలనమీదా, దేశం పాటించబోయే విలువలమీదా ఎంత ఒత్తిడితేగలదో ఊహించుకోవచ్చు.

ఫిబ్రవరి తరువాత పొరుగుదేశంలో పాలన ఎవరిచేతుల్లో ఉండబోతోందో వారితో సత్సంబంధాలు కలిగివుండటం భారత్‌కు అవసరం. హసీనా పాత్రలేని, అవామీలీగ్‌కు చోటులేని భవిష్యత్ బంగ్లాదేశ్‌తో వ్యవహారం సాగించాలంటే అక్కడ ఉన్నవాటిలోనే వెతుక్కోవాలి. దాదాపు అన్ని పార్టీలతో సత్సంబంధాల కోసం భారత్ ప్రయత్నాలు సాగిస్తోందని వార్తలు వింటున్నాం. భారత ప్రతినిధి ఒకరు తనతో ఇప్పటికే భేటీ అయ్యారనీ, అయితే ఆ విషయాన్ని రహస్యంగా ఉంచమని కోరారని జమాతే అధ్యక్షుడు షఫీఖుర్ రహ్మాన్ బుధవారం ఓ వ్యాఖ్యచేశారు. మీకు పాకిస్థాన్‌తో చారిత్రక అనుబంధం ఉన్నది కదా? అన్న ప్రశ్నకు తాము ఎవరిపక్షమూ కాదని, అన్ని దేశాలతో సత్సంబంధాలు కోరుకుంటున్నామని మాటవరుసకైనా అన్నందుకు సంతోషించాల్సిందే. బిఎన్‌పి తప్ప బరిలో మరో ప్రత్యామ్నాయం లేనందున, నచ్చినా నచ్చకున్నా రేపటి పాలకులనూ, ప్రభుత్వంలో భాగస్వాములనూ భారత్ ఇప్పటినుంచే మచ్చిక చేసుకోవడం తప్పదు. భారత్–బంగ్లా సంబంధాలు ఎవరి ఆధ్వర్యంలో ఒక వెలుగువెలిగాయో తెలిసికూడా, కన్నుమూసిన ఖలీదాను ప్రత్యేకంగా శ్లాఘించకా తప్పదు.

కార్మికలోకానికి కమ్యూనిస్టులు వరం

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి డిసెంబర్ 12న ఆంధ్రజ్యోతిలో 'కార్మిక లోకానికి శాపం... ఈ కమ్యూనిస్టులు' శీర్షికతో వ్యాసాన్ని రాశారు. కార్మిక లోకానికి కమ్యూనిస్టులు శాపం కాదు వరం. కార్మికవర్గం శతాబ్దం పైగా ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సంపాదించిన హక్కులు, సౌకర్యాలకు ఒక చరిత్ర ఉంది. చరిత్రను వక్రీకరించే బీజేపీ నాయకులకు అది అర్థం కాదు.

44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి, గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు–సౌకర్యాలను మళ్ళీ పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టటం వాస్తవం కాదా? కార్మిక చట్టాలను కోడ్‌లుగా మార్చటం వల్ల పర్మినెంట్ ఉద్యోగులు ఉండరు. కాంట్రాక్ట్ లేబర్, క్యాజువల్ వర్కర్స్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుంటారు. లే ఆఫ్, రిట్రెంచ్‌మెంట్, క్లోజర్‌లు ఉంటాయి.

గతంలో ఉన్న కార్మిక చట్టాల్లో 100 మంది కార్మికులు పనిచేసే పరిశ్రమ మూసివేయాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి కావాలి. కాని మోదీ కొత్తగా మార్చి తెచ్చిన 'ద ఇండస్ట్రియల్ కోడ్ 2020' సెక్షన్ 77లో ఆ సంఖ్యను 300కు పెంచారు. ఇది వర్కింగ్ క్లాస్‌కి నష్టం. 50 మంది పనిచేసే పరిశ్రమను లే ఆఫ్ చేస్తే మారిన కోడ్ సెక్షన్ 65 ప్రకారం నష్టపరిహారం ఇవ్వాల్సిన పని లేదు. ఇది కార్మికుడికి లాభమా, నష్టమా? మరి, ఇంతకాలం సర్వీస్ చేసిన కార్మికుడి గతి ఏమిటి? అందుకే కమ్యూనిస్టుల పోరాటం.



పాత చట్టం ప్రకారం ఏడుగురు ఉంటే ట్రేడ్ యూనియన్ పెట్టుకోవచ్చు. మారిన కోడ్ ప్రకారం పరిశ్రమ సిబ్బందిలో 10శాతం లేదా 100 మంది సిబ్బంది ఉంటేనే యూనియన్ పెట్టాలి. దీన్ని అడ్డం పెట్టుకుని బీజేపీ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్లను ఖననం చేస్తోంది. కార్మికుడు, యజమాని మధ్య వివాదం తలెత్తితే కొత్త కోడ్ సెక్షన్ 97 ప్రకారం సివిల్ కోర్టుల్లో ఈ వివాదాలు వేయరాదు. బీజేపీ నాయకుడేమో పారిశ్రామిక వివాదాలు ఈ కొత్త కోడ్ వల్ల సత్వరం పరిష్కారం అవుతాయంటున్నారు. ఇది కార్మికవర్గాన్ని మోసం చేయటం కాదా?

పాత ఐడి యాక్ట్ 1947 సెక్షన్ 22(ఎ) (బి) ప్రకారం కార్మికులు సమ్మె చేసుకోవచ్చు. బీజేపీ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ 2020 ప్రకారం సమ్మె పూర్తిగా నిషేధం. ఇది కార్మికుడి సమ్మె హక్కుని లాక్కోవటం కాదా? మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్ 26 వారాలకు కొత్త కోడ్‌లో పెంచామని రాశారు. కానీ ఈ బెనిఫిట్ యూనివర్సల్ కాలేదు. ఈ కోడ్‌లో ఎస్టాబ్లిష్‌మెంట్ అనే పదాన్ని చేర్చారు. ఈ పదంలో అసంఘటితరంగ మహిళలను కలపలేదు. కాబట్టి వారికి వర్తించదు.

90శాతం అసంఘటిత రంగానికి పీఎఫ్ హామీ లభిస్తుందని బీజేపీ నాయకుని ఉవాచ. కాని మైక్రో, చిన్న ఎంటర్‌ప్రైజెస్‌లో పనిచేస్తున్న కొన్ని మిలియన్ల కార్మికులకు ఈ కొత్త కోడ్ వర్తించటం లేదనేది సత్యం. గ్రాట్యుటీలో మేలు జరుగుతుందన్నదీ అబద్ధమే. గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు ఈ కొత్త కోడ్‌లో అమోఘమైన భద్రత లభిస్తుందని కూడా రాశారు. కాని కొత్త కోడ్‌లో నమ్మదగిన రక్షణ లేదు. కొత్త కోడ్ అమలైతే టేక్ హోం పే తగ్గుతుంది, రిటైర్మెంట్ సేవింగ్స్ పెంచుతారు. ఇది ప్రస్తుతానికి ఆకర్షణీయంగా ఉంటుంది. కాని కార్మికులు రిటైర్ అయినప్పుడు సేవింగ్స్ మొత్తాలు చాలా చిన్నవిగా కనిపిస్తాయి. మోసపోయానని అప్పుడు కార్మికుడు నెత్తీ నోరు కొట్టుకుంటాడు. వేజెస్ రీస్ట్రక్చర్ కావటం వల్ల ప్రభుత్వానికి ఇన్‌కం ట్యాక్స్ రూపంలో ఆదాయం పెరుగుతుంది. ఇది కార్మికుడికి నష్టం, ప్రభుత్వానికి లాభం.

కొత్త కోడ్ ప్రకారం రోజుకి 8 గంటలు, వారానికి 48 గంటలు పనిచేయాలని విష్ణువర్ధన్‌రెడ్డి అంటున్నారు. కాని ఆర్టీసీలో రోజుకు 16 గంటలు, వారానికి 96 గంటలు కార్మికులు పనిచేస్తున్నారు. వీరి ఆరోగ్యంపై పడే ప్రతికూల ప్రభావాలు ప్రభుత్వం ఎందుకు గుర్తించదు? ఇప్పటికైనా కమ్యూనిస్టులను విమర్శించటం మాని కొత్త కోడ్‌లలో మార్పులు చేయకపోతే కార్మిక లోకానికి అన్యాయం చేసినట్టే.


● **ఎస్.బాబు**
ఏఐటీయూసీ వర్కింగ్ కమిటీ సభ్యులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

రవీంద్రుడు పురికొల్పిన కొత్త ప్రార్థన

ఎక్కడ మనస్సు నిర్భయంగా ఉంటుందో/ ఎక్కడ
మానవుడు సగర్వంగా తల ఎత్తుకుని తిరుగుతాడో/
ఎక్కడ జ్ఞానం స్వేచ్ఛగా మనగలుగుతుందో/
ఎక్కడ ప్రపంచం ముక్కలు ముక్కలై ఇరుకైన గోడల
మధ్య మ్రగ్గిపోదో.../ ఆ స్వేచ్ఛా స్వర్గంలోకి, తండ్రీ!
నా దేశాన్ని మేల్కొనేట్టు అనుగ్రహించు.

– రవీంద్రుడు 'గీతాంజలి'





■ **రాజ్‌దీప్ సర్దేశాయి**

దీపశిఖ

ఋషితుల్యుడైన ఆ మహాకవి అజరామర గీతం స్ఫూర్తితో, 2026 సంవత్సరంలో సకల శుభాలతో భారతదేశం ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్న ఒక భారతీయుని ప్రార్థనను నివేదిస్తాను. ఈ కొత్త సంవత్సరంలో, వర్తమానాన్ని, భవిష్యత్తును నిన్నటి దృక్కోణంతో చూడని కొత్త దృక్పథం భారతీయులలో ప్రభవించాలి. శతాబ్దం క్రితం వందేమాతరం గీతంలో ఏ చరణాలను ఎవరు తొలగించారనే విషయమై ఎంపీలు గంటల తరబడి చర్చలు జరపకూడదు. 1950ల్లో జవహర్‌లాల్ నెహ్రూ ఏమి చేశారు, ఏమి చేయలేదు అన్న విషయాన్ని అప్రస్తుతంగా పరిగణించాలి. అలాగే 17వ శతాబ్దిలో ఔరంగజేబు ఏ దురాగతాలకు పాల్పడ్డాడన్న విషయంపై కాకుండా భావితరాలకు మరింత మెరుగైన భారతదేశాన్ని అందించేందుకు ప్రస్తుత నాయకత్వం ఏమి చేస్తుందన్న దానిపైనే అందరూ దృష్టి పెట్టాలి.

ఓటర్ల మద్దతుకై కులపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టని లేదా మతపరమైన చీలికలు సృష్టించని వివేకశీల రాజకీయాలు ప్రభవించాలి. పాలనా సంబంధిత విషయాలకే ప్రాధాన్యమివ్వాలి. ఏ మసీదు కింద ఏ శతాబ్దంలో ఏ ఆలయం ఉన్నదనే విషయమై నిరాధార ఆసక్తి ప్రాధాన్యం పొందకూడదు. ఒక వాట్సాప్ యూనివర్సిటీ కోర్సు స్థాయికి చరిత్రను కుదించకూడదు. మరిన్ని ప్రార్థనా మందిరాలను నిర్మించడానికి కాకుండా నాణ్యమైన వసతులు ఉన్న పాఠశాలలు, ఆస్పత్రులు ఎన్నిటిని నిర్మిస్తున్నారనే విషయంపైనే దృష్టి కేంద్రీకరించాలి.

క్రిస్మస్ వేడుకలకు భంగం కలిగిస్తున్న, 'లవ్ జిహాద్' పేరిట ముస్లింలపై దురాగతాలకు పాల్పడుతున్న బజరంగ్ దళ్ లాంటి బృందాల కార్యకర్తలకు కఠిన శిక్షలు విధించాలి. అప్పటికీ ఆ సంఘం కార్యకర్తలు తమ దుర్మార్గాలకు స్వస్తి చెప్పని పక్షంలో అటువంటి స్వయం ప్రకటిత హిందూ సంరక్షక బృందాలను నిషేధించాలి. మతతత్వ ధోరణులు, హింసాకాండను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. ఈ విషయంలో మాటలకే పరిమితం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలి.

చట్టపరమైన అధికారం లేకుండా మూక న్యాయం, హింసను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్య పునాదులను దెబ్బ తీసే విజిలంటిజంను తిరస్కరించి, చట్టబద్ధ పాలనతో జవాబుదారీ తనంతో వ్యవహరించే పాలనా వ్యవస్థను సమకూర్చే రాజ్యాంగ వాదానికి మరింతగా నిబద్ధమవ్వాలి. బెంగాలీ భాష మాట్లాడుతున్న కారణంగా ఎవరినీ బంగ్లాదేశీయుడుగా ముద్రవేసి దేశం నుంచి గెంటివేయని నాగరీక పాలనా పద్ధతులు వర్ధిల్లాలి. 'చొరబాటుదారు' అనే పదం రాజకీయ బూచి కాకూడదు. 'విద్వేషం' సాధారణ పరిణామం కాకూడదు. 'మనము', 'వారు' అనే తేడాలతో సామాజిక బహిష్కరణలు చోటుచేసుకోకూడదు. ఆధిపత్య ధోరణులకు స్వస్తి చెప్పి, చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానులేనన్న వైఖరితో వ్యవహరించాలి.

మనం ఆకాంక్షిస్తున్న భారతదేశంలో పర్యావరణ సంరక్షణకు ప్రతి ప్రభుత్వమూ చిత్తశుద్ధితో పూనుకోవాలి. 'వాయు నాణ్యతా సూచీ' (ఎక్యుఐ) ప్రాధాన్యాన్ని ముఖ్యమంత్రులు గుర్తించాలి. ప్రతి పౌరుడూ నిర్మల వాయువు శ్వాసించే పరిస్థితి కల్పించాలి. పర్యావరణ సున్నిత ప్రదేశాలు ధ్వంసమయ్యేలా మైనింగ్ కార్యకలాపాలను అనుమతించకూడదు.

> **ఈ కొత్త సంవత్సరంలో, వర్తమానాన్ని, భవిష్యత్తును నిన్నటి దృక్కోణంతో చూడని కొత్త దృక్పథం భారతీయులలో ప్రభవించాలి. భావితరాలకు మరింత మెరుగైన భారతదేశాన్ని అందించేందుకు ప్రస్తుత నాయకత్వం ఏమి చేస్తుందన్న దానిపైనే అందరూ దృష్టి పెట్టాలి.**

రియల్ ఎస్టేట్ మాఫియాలను కట్టడి చేయాలి. వాతావరణ మార్పు నిరోధాన్ని మాటలకే పరిమితం చేయకుండా, అందుకు కార్యసాధక ప్రణాళికలను రూపొందించి అమలుపరచాలి.

ఈ కొత్త సంవత్సరంలో రాజకీయ పార్టీలు కుటుంబ యాజమాన్య సంస్థలుగా ఉండని విధంగా ప్రగతిశీల రాజకీయాలు ప్రభవించాలి. అన్ని రాజకీయ పక్షాలలో అంతర్గత ప్రజాస్వామ్యం పెంపొందాలి. నాయకత్వ నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిని అసమ్మతివాదులుగా పరిగణించకూడదు. విమర్శలు, ఆక్షేపణలను తిరుగుబాటుగా భావించకూడదు. చట్టం నుంచి రక్షణకు రాజకీయ విధేయతలు మార్చుకునే పద్ధతి పోవాలి. ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలపై మాత్రమే దృష్టి పెట్టి ఎన్నికలలో ప్రయోజనాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను దుర్వినియోగపరచకూడదు.

ఎన్నికల సంఘం తన రాజ్యాంగ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలి. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు పూచీపడాలి తటస్థ మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరించాలి గానీ ఒక పక్షానికి బి–టీమ్‌గా పరిణమించకూడదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణను పారదర్శకంగా పరిపూర్తి చేయాలి. ఎన్నికలలో పోటీ చేసే అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలి. ఇందుకు ప్రభుత్వ అధికారాలు దుర్వినియోగం కాకుండా జాగరూకత వహించడం ఎన్నికల సంఘం విధ్యుక్త ధర్మం.

కశ్మీర్ నుంచి కేరళ వరకు ప్రతి భారతీయ పౌరుడినీ సమరీతిలో గౌరవించాలి. దేశంలో ఏదో ఒకచోట ఉగ్రవాద దాడి సంభవించినప్పుడు కశ్మీరీలను వేధింపులకు గురిచేయకూడదు. కశ్మీర్‌ను కేవలం ఒక భూభాగంగా పరిగణించే వైఖరికి స్వస్తి చెప్పి, సమస్త కశ్మీరీల హృదయాలు, మనసులు గెలుచుకునేందుకు చిత్తశుద్ధితో మరింతగా కృషి చేయాలి. ఉత్తరాది–దక్షిణాది తేడాలు, తమిళ్–హిందీ భాషా వివాదాలు సమసిపోయేలా వివేకవంతమైన నిర్ణయాలు తీసుకోవాలి, పటిష్ఠ చర్యలు చేపట్టాలి. వైవిధ్యాన్ని బలహీనతగా కాకుండా బలంగా భావించాలి.

ఆదాయ అసమానతలు తగ్గించడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం కావాలి. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి ఇస్తున్న ప్రాధాన్యాన్ని హ్యూమన్ డిగ్నిటీ ఇండెక్స్‌కు కూడా ఇవ్వాలి. పేదలకు విద్యా వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలి. సమాజంలోని అన్ని వర్గాల వారికీ సమాన అవకాశాలు కల్పించాలి. సంపన్నులు, రాజకీయ పలుకుబడి ఉన్నవారి కాలనీలను క్రమబద్ధీకరిస్తూ పేదల గృహాలను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని మానుకోవాలి. ఆశ్రితులు అయిన వ్యాపార దిగ్గజాలకే ప్రభుత్వ ప్రాజెక్టులను కట్టబెట్టే అలవాటుకు స్వస్తి చెప్పాలి. కష్టపడి పనిచేస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. వారికి మరింతగా వ్యాపార సౌలభ్య పరిస్థితులను కల్పించాలి. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత ఆర్థిక వ్యవస్థ ఆవిర్భవించడం శుభ పరిణామమే. అయితే తలసరి ఆదాయం విషయంలో దేశం 130వ స్థానంలో ఉండడంపై తప్పకుండా ఆందోళన చెందాలి.

ఏడాది పొడుగునా కష్టపడి చదివి పరీక్షలు రాసే విద్యార్థులు స్వార్థపరులైన అధికారులు, ఉపాధ్యాయుల అక్రమాలకు నష్టపోకుండా జాగ్రత్త వహించాలి. పరీక్ష ప్రశ్న పత్రాలు లీక్ కాకుండా చూడాలి. పరీక్షల నిర్వహణ అత్యంత జాగ్రత్తగా జరగాలి. కళాశాలల్లో ప్రవేశాలు ప్రతిభ ఆధారంగా జరగాలి. సిఫారసుల మేరకు ప్రవేశాలు కల్పించడాన్ని నిషేధించాలి. నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కల్పన కలసికట్టుగా జరగాలి. ఆకాంక్షాభరిత యువ భారతీయులు తమ లక్ష్యాల పరిపూర్తిలో నిర్విఘ్నంగా ముందుకు సాగేందుకు ప్రభుత్వాలు దోహదం చేయాలి.

'నేను ముడుపులు తీసుకోను, ఎవరినీ తీసుకోనివ్వను' అనేది నినాద ప్రాయంగా ఉండకూడదు. స్వార్థ ప్రయోజనాలకు, ఆర్థిక లబ్ధికి ప్రాధాన్యమిచ్చే రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు నియమ నిబంధనలు మార్చేందుకై అధికార దుర్వినియోగానికి పాల్పడడాన్ని అరికట్టి, నైతిక నిష్ఠతో వ్యవహరించే నాయకులు, అధికారులు ప్రాధాన్యం పొందే అనుకూల పరిస్థితులు ఈ కొత్త సంవత్సరంలో ఏర్పడాలి. ప్రజాప్రతినిధుల, ప్రభుత్వాధికారుల ఆస్తుల వివరాలు ప్రజల నిశిత పరిశీలనకు అందుబాటులో ఉండాలి. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న నాయకుల, అధికారుల ఆస్తులను స్వాధీనం చేసుకుని పేదలకు గృహ వసతిని కల్పించేందుకు వాటిని వినియోగించాలి.

భారతీయ సమాజంలో జ్ఞానకుసుమాలు వికసించాలి. మూఢనమ్మకాల కంటే వైజ్ఞానిక జిజ్ఞాసకే ప్రాధాన్యం, మరింత విలువనివ్వాలి. వంశప్రతిష్ఠ కంటే కార్యదక్షతకే గౌరవం ఉండాలి. ఒక వ్యక్తి విలువ అతని బ్యాంక్ బ్యాలెన్స్ బట్టి కాకుండా జ్ఞానసంచయం ఆధారంగా నిర్ణయమవాలి. బాక్సాఫీస్ వసూళ్లు కాకుండా, సృజనాత్మక ప్రతిభా పాటవాలే ఒక సినిమా సార్థకతను నిర్ణయించాలి. కేవలం ఒక సూపర్ స్టార్ సంస్కృతిని పెంచి పోషించడం కాకుండా ఊరూరా విశాల ఆటస్థలాలు ఉండేలా చేయడమే క్రీడా విజయంగా పరిగణన పొందాలి.

భారతీయ న్యాయస్థానాలు కేసుల విచారణను పదే పదే వాయిదావేయడం కాకుండా న్యాయ నిర్ణయాలు వేగవంతంగా తీసుకోవాలి. ఒక న్యాయమూర్తి నివాసంలో లెక్కలేని నగదు కట్టలు కనిపించినప్పుడు దేశం దిగ్భ్రాంతి చెందాలి. ప్రజలు కలవరపడాలి. మౌనంగా ఉండిపోవడం తగదు గాక తగదు. ఉన్నత స్థాయి న్యాయమూర్తుల నియామకాలు రాజకీయ పరపతి, భావజాల అనుబంధాల ప్రాతిపదికన కాకుండా న్యాయ విధుల నిర్వహణలో నిష్పాక్షికత, దక్షత ఆధారంగా జరగాలి.

ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠపరచడమే పత్రికారంగం పరమ ధ్యేయం కావాలి. అవును, అధికారంలో ఉన్నవారు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించేలా చేయడమే తన విధ్యుక్త ధర్మమని మీడియా సదా జ్ఞాపకముంచుకోవాలి. అంతేగానీ పాలకులకు విధేయంగా వ్యవహరించడం ప్రజావంచనే కాక ఆత్మవంచన కూడా అవుతుందని గుర్తించాలి. అధికారంలో ఉన్నవారికి ఇబ్బందికరమైన ప్రశ్నలు వేయడమనేది తమ వృత్తి ధర్మమని పాత్రికేయులు మరచిపోకూడదు. సత్యశోధనతో ధర్మ రక్షణకు నిబద్ధమవ్వాలి.

ఇవన్నీ నిర్నిబంధంగా జరిగే స్వేచ్ఛా ప్రపంచానికి భారత్ జాగృతమవాలి. నూతన సంవత్సర శుభాకాంక్షలు!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

వీబీ జీరామ్‌జీ: గ్రామమే అభివృద్ధి కేంద్రం

భారతదేశం వికసిత దేశంగా మారాలంటే నగరాల అభివృద్ధి మాత్రమే సరిపోదు. దేశ ఆత్మ ఉన్న గ్రామాలు బలపడితేనే భారత్ నిజంగా ముందుకు సాగుతుంది. ఈ మౌలిక సత్యాన్ని విధానంగా మార్చిన జాతీయ ప్రయత్నమే వీబీ జీరామ్‌జీ చట్టం. ఇది కేవలం ఉపాధి హామీ పథకం కాదు; గ్రామాన్ని వికసిత భారత్ యాత్రలో కేంద్రంగా నిలిపే సంకల్పం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన వికసిత భారత్ 2047 లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. గ్రామీణ భారతాన్ని సంక్షేమంపై ఆధారపడే స్థితి నుంచి స్వావలంబన వైపు నడిపించే విధానంగా ఇది రూపుదిద్దుకుంది.

ఈ చట్టంలోని ప్రధాన బలం ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 125 రోజుల వేతన ఉపాధి హామీ. ఇది గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించడమే కాకుండా, గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలను పెంచుతుంది. ఫలితంగా పట్టణాలకు వలసలు తగ్గుతాయి, కుటుంబాలు విడిపోకుండా నిలబడతాయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం వస్తుంది. ఇది దయ ఆధారిత సంక్షేమం కాదు, గౌరవప్రదమైన జీవనానికి హామీ. వీబీ జీరామ్‌జీ చట్టం మరో విశిష్టత– ఉపాధితో పాటు దీర్ఘకాలిక ఆస్తి సృష్టి. నీటి సంరక్షణ, గ్రామ రోడ్లు, వ్యవసాయానికి అనుకూల మౌలిక వసతులు, భూమి అభివృద్ధి వంటి పనులు గ్రామాల్లో శాశ్వత అభివృద్ధికి దోహదం చేస్తాయి. ఉపాధి ముగిసినా అభివృద్ధి మిగిలేలా ఈ చట్టం రూపకల్పన జరిగింది. పారదర్శకత, సాంకేతికత ఈ చట్టానికి పునాది. డిజిటల్ ట్రాకింగ్, జియోట్యాగింగ్, ఆధార్ ఆధారిత ధృవీకరణ ద్వారా ప్రజల డబ్బు ప్రజలకే చేరేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇది మోదీ ప్రభుత్వ పాలనాతత్వానికి ప్రతిబింబం.

అటల్‌బిహారీ వాజపేయి గ్రామాభివృద్ధిని దేశ భవిష్యత్తుగా చూశారు. నేడు ప్రధాని నరేంద్ర మోదీ ఆ దృష్టిని కార్యాచరణగా ముందుకు తీసుకెళ్తున్నారు. అటల్ జీ కలగన్న స్వావలంబన గ్రామాల ఆలోచన, వీబీ జీరామ్‌జీ చట్టం ద్వారా వికసిత భారత్ లక్ష్యంగా మారుతోంది. గ్రామీణ ప్రాధాన్యం ఉన్న ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు ఈ చట్టం స్పష్టమైన సందేశం ఇస్తోంది. గ్రామమే అభివృద్ధి కేంద్రం. గ్రామం బలపడితే రాష్ట్రం బలపడుతుంది– రాష్ట్రం బలపడితే దేశం వికసిస్తుంది.

– **సాదినేని యామినిశర్మ**
బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

భాషాభివృద్ధికి ప్రపంచ తెలుగు మహాసభలు!


ప్రపంచ తెలుగు మహాసభలు కేవలం ఒక సాంస్కృతిక కార్యక్రమం మాత్రమే కాదు. ఇది తెలుగు భాషకు, తెలుగు జాతికి, తెలుగు వారి ఆత్మగౌరవానికి సంబంధించిన మహోత్సవం. తెలుగు భాష వెలుగును మరోసారి ప్రపంచ వేదికపై నింపే చారిత్రక సందర్భం. తెలుగు భాష వేల సంవత్సరాల చరిత్ర, సాహిత్య సంపద కలిగినది. ప్రపంచీకరణ యుగంలో అనేక భాషలు తమ గుర్తింపును కోల్పోతున్న సమయంలో, తెలుగు మాత్రం తన శక్తిని మరింత పెంచుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో తెలుగు ఒకటిగా నిలవడమే కాకుండా, అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు వలస సమాజాల ద్వారా అంతర్జాతీయ గుర్తింపు సాధిస్తోంది. టెక్నాలజీ, కృత్రిమ మేధ, డిజిటల్ కమ్యూనికేషన్ రంగాల్లో తెలుగుకు మరింత స్థానం కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచమంతా విస్తరించి ఉన్న కోట్లాది తెలుగు హృదయాలను దోచుకొన్న తెలుగు భాష ఎన్నో శతాబ్దాలుగా వికసిస్తూ వస్తుంది. గొప్ప కవులు, పండితులు, రచయితలు, గాయకులు, నాటక రచయితలు తెలుగు సాహిత్యధనాన్ని ఎంతో ఎత్తుకు చేర్చారు. నన్నయ, తిక్కన, యర్రా ప్రగడలతో ప్రారంభమైన ఆంధ్ర మహాభారతం నుంచి గురజాడ, విశ్వనాథ, శ్రీశ్రీ వరకు... పొట్టి శ్రీరాములు నుంచి గిడుగు వెంకటరామమూర్తి వరకు, ఇంకా నేటి ఆధునిక రచయితల వరకు తెలుగు భాష అభివృద్ధికి చేసిన సేవలు అమూల్యం. ప్రపంచవ్యాప్తంగా 18 కోట్ల మంది మాట్లాడే భాష తెలుగు. ఆరువేలకు పైగా భాషల్లో అందమైన లిపి వున్న రెండో భాష ఇది. దేశ భాషలందు తెలుగు లెస్స అన్నారు శ్రీకృష్ణదేవరాయలు... తేనె లోలికే తెలుగు భాష కమ్మదనం చూసి మనం గర్వపడాలి. ప్రపంచంలో అతి మధుర భాషల జాబితాలో చోటు సంపాదించిన మహత్తరమైన మాతృభాష మనది. మరి అటువంటి భాషను మనం ఈ రోజు ఎంతగా కాపాడుతున్నాం? ప్రపంచీకరణ యుగంలో ఇంగ్లిష్–హిందీ ప్రాముఖ్యత పెరుగుతున్న కొద్దీ మన తెలుగుకు మనమే దూరమవుతున్న ప్రమాదాన్ని గుర్తించాలి. కుటుంబాలలో పిల్లలతో తెలుగులో మాట్లాడకపోవడంతో పాటు, తెలుగు పుస్తకాలు చదవడం తగ్గిపోతోంది.

భాషాభివృద్ధి కోసం నేటికీ ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తెలుగు అధికార భాషా సంఘాలు ఉన్నాయి. ఆగస్టు 29 తెలుగు భాషాదినోత్సవం, ప్రపంచ తెలుగు మహాసభలు, వివిధ దేశాలలో తెలుగు సంఘాలు, తెలుగు డిజిటల్ నిఘంటువులు, డిజిటల్ లైబ్రరీలు, యూనికోడ్, ఏఐ, డిజిటల్ అనువాద సాధనాల ద్వారా తెలుగు అభివృద్ధికి కృషి జరుగుతూనే ఉన్నది. ప్రస్తుత సమాజంలో తెలుగు భాష ఆంగ్లీకరణ అవుతుంది. మార్కెట్ వలయంలో మన మాతృభాష చిక్కుకున్నది. ఈ నేపథ్యంలో తెలుగు భాష అభివృద్ధికి కృషి జరగాలి. ప్రధానంగా పరిపాలనలో తెలుగు కనపడితే తెలుగు భాషాభివృద్ధికి అవరోధాలు తొలగిపోతాయి. 1955 సెప్టెంబర్ 20న మొదటిసారి ఆంధ్రప్రదేశ్ శాసనసభ తెలుగును పాలనా భాషగా తీర్మానం చేసింది. 1966లో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారు. వావిలాల గోపాలకృష్ణయ్య, డా. సి.నారాయణ రెడ్డి, ఎబికె, బుద్ధప్రసాద్ వంటి వారు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా ఉన్న కాలంలో వ్యక్తిగత పలుకుబడితో భాషాభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాషను ఆధునీకరించడం, తెలుగేతరులకు తెలుగు బోధించడం, విశ్వవిద్యాలయాల స్థాయి వరకు తెలుగు మాధ్యమంలో చదువు చెప్పడం అనే లక్ష్యాలతో తెలుగు అకాడమీ ఏర్పడింది. అది చివరికి పాఠ్యపుస్తకాల ప్రభుత్వ ప్రచురణ సంస్థగా మారిపోయింది.

తెలుగు భాష అభివృద్ధి కోసం వివిధ కాలాలలో ఎందరో మహనీయులు శ్రమించారు. తెలుగు భాషా పరిరక్షణకు కృషి చేసిన పాలకుల్లో ప్రముఖులు స్వాతంత్ర్యానికి పూర్వం శ్రీకృష్ణదేవరాయలు కాగా, స్వాతంత్ర్యానంతరం నందమూరి తారకరామారావు భాషాభివృద్ధికి కృషి చేశారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి కాక ముందు దేశ రాజధానిలో తెలుగువారికి గుర్తింపు లభించేది కాదు. తెలుగువారు ఎవరైనా ఢిల్లీ వెళ్తే మదరాశీయులుగానే తెలుగువారిని సంబోధించేవారు. తెలుగు కలల వికాసానికి 1985లో ఎన్టీఆర్ తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కొన్నేళ్ల క్రితం వరకు తెలుగంటే ఆంధ్ర, తెలంగాణకే పరిమితం అని భావించే వారున్నారు. కానీ నేడు పరిస్థితి మారింది. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు, యూరప్ నుంచి ఆఫ్రికా వరకు 120కి పైగా దేశాలలో తెలుగు సంఘాలు భాషాభివృద్ధికి పనిచేస్తున్నాయి. అమెరికాలో తెలుగు భాషకు అధికారిక, సామాజిక అకడమిక్ గుర్తింపు. అమెరికాలోని పలు స్కూల్స్, యూనివర్సిటీలలో తెలుగు సెకండ్ లాగ్వేజీగా బోధన జరుగుతోంది.

> **విదేశాలలో తెలుగు సంఘాలు పిల్లలకు తెలుగును బోధిస్తూ భాషను పరిరక్షిస్తుంటే, స్వదేశంలో తెలుగు మాట వినిపించని ఇళ్ళ సంఖ్య పెరగడం ప్రమాదకరం. తెలుగు భాషను అధికారిక పాలనా వ్యవహారాల్లో తప్పనిసరి చేయాలి. భాషను రక్షించడం ప్రతి తెలుగువారి, ముఖ్యంగా యువత బాధ్యత.**



విదేశాలలో తెలుగు సంఘాలు పిల్లలకు తెలుగును బోధిస్తూ భాషను పరిరక్షిస్తుంటే, స్వదేశంలో తెలుగు మాట వినిపించని ఇళ్ళ సంఖ్య పెరగడం ప్రమాదకరం. తెలుగు భాషను అధికారిక పాలనా వ్యవహారాల్లో తప్పనిసరి చేయాలి. భాషను రక్షించడం ప్రతి తెలుగువారి, ముఖ్యంగా యువత బాధ్యత. తెలుగు భాషను కాపాడడానికి చేయాల్సినవి కుటుంబంలో తెలుగు మాట్లాడటం, తెలుగు పుస్తకాలు, పత్రికలు చదవడం, పాఠశాలల్లో మాతృభాష బలోపేతం చెయ్యడం, యువతలో కవిత్వం, రచన ప్రోత్సహించడం చేయాలి. తెలుగు భాషకు చరిత్ర ఉంది. అమ్మ భాషకు విలువ ఇచ్చినప్పుడే జన్మభూమి విలువ తెలుస్తుంది. మాతృభాషలోనే ప్రాథమిక విద్య నేర్పితే వారికి మిగతా భాషలు తేలిగ్గా అర్థమవుతాయని విద్యావేత్తలు, భాషావేత్తల అభిప్రాయం. తెలుగు భాషను కట్టుదిట్టంగా అమలు చెయ్యడానికి వీలుగా తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసి స్వతంత్ర ప్రతిపత్తితో ప్రజలకు, శాసనసభకు, ప్రభుత్వానికి జవాబుదారీ చెయ్యాలి. ప్రతి ఇంట్లో తెలుగు మాట్లాడాలి. ప్రతి పాఠశాలలో తెలుగు బోధన బలోపేతం కావాలి.

మన భాష గొప్పదని చెప్పుకోవడం కాదు ఆ గొప్పదనాన్ని తరతరాలకు అందించడం నిజమైన బాధ్యత. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వాలు కొంత వరకే చేయగలవు. భాషను కాపాడుకోవడం ప్రజల చేతుల్లోనే ఉంది. కావున ప్రతి ఒక్కరూ తమ మాతృభాష తెలుగును ప్రచారం చేయాలి. ఇతర భాషలతో పోటీపడి తెలుగు వినియోగం పెంచాలి.

■ **తొండపు దశరథ జనార్దన్**
టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు

(జనవరి 3 నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు)

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 జనవరి 2026





2026కు.. ఘన స్వాగతం

- అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వేడుకలు
- అధికారులకు, నేతలకు శుభాకాంక్షల వెల్లువ
- కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వినూత్నంగా వేడుకలు


కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ అన్సారియా


కేక్ కట్ చేస్తున్న ఐజీ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అధికారులు


చర్చిలో ప్రార్థన చేస్తున్న యువతి

జిల్లా అంతటా సందడే సందడి

కోటి ఆశలతో నూతన సంవత్సరం 2026కు జిల్లావాసులు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన వేడుకలు గురువారం సాయంత్రం వరకు కొనసాగాయి. పల్లె పట్టణం అన్న తేడా లేకుండా జిల్లావ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. ఒకరికొకరు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పుకుంటూ యువకులు సందడి చేశారు. విద్యాసంస్థల్లో ఆట పాటలతో విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలను హోరెత్తించారు. యువకులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ద్విచక్ర వాహనాలతో సందడి చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ జిల్లా వ్యాప్తంగా మహిళలు రంగవల్లులతో లోగిళ్లను ప్రత్యేకంగా అలంకరించారు. 2025కు వీడ్కోలు చెప్తూ.. 2026ను స్వాగతిస్తూ మహిళలు ముగ్గులను అలంకరించారు. ముఖ్య అధికారులకు, ప్రజాప్రతినిధులకు, రాజకీయ పార్టీల నేతలకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు పలువురు పెద్ద సంఖ్యలో వారి కార్యాలయాలు, ఇళ్ల వద్ద బారులు (మిగతా 6వ పేజీలో)

అంధులు, బధిరులతో కలెక్టర్ న్యూ ఇయర్ వేడుకలు

గుంటూరు, జనవరి 1 (ఆంధ్ర జ్యోతి): 2026 నూతన సంవత్సర వేడుకలను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అంధులు, బధిరులతో కలిసి జరుపుకున్నారు. గురువారం బ్రాడీపేట ఒకటో లైనులోని షిర్డి సాయి దీనజనుల సేవా సమితి ఆశ్ర మాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడి బధిర విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థుల చదువు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్లు వెంకటేశ్వరరావు, సుభాని పాల్గొన్నారు.


ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా

కలెక్టరేట్‌లో...

రెవెన్యూ ఉద్యోగుల సమక్షంలో కలెక్టర్ అన్సారియా నూతన సంవత్సర కేక్ కట్ చేశా రు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో, ఇతర జిల్లా స్థాయి అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ నివాసంలో కొత్త సంవత్సర వేడుకలు జరిగాయి.



రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- శిరిగిరిపాడు వద్ద బైకులు ఢీకొని ఇద్దరు..
- హైవేపై అగడ్తలోకి కారు దూసుకెళ్లి ఒకరు..
- రెండు ప్రమాదాల్లో ఆరుగురికి తీవ్రగాయాలు



వెల్దుర్తి, యడ్లపాడు, జనవరి 1 (ఆంధ్ర జ్యోతి): నూతన సంవత్సరం ఆరంభం రోజు గురువారం మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది. వెల్దుర్తి, యడ్లపాడు మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వెల్దుర్తి మండలంలోని శిరిగిరిపాడు వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మృతి చెందాగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జాతీయరహదారిపై యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద కారు అదుపు తప్పి అగడ్తలో పడిపోవడంతో ఒకరు మృతి చెందగా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేసేమార్కాపురానికి చెందిన షేక్ కరిముల్లా(50) వెల్దుర్తికి వచ్చి తిరుగు ప్రయాణంలో బంధువైన పట్టణానికి చెందిన నూర్జహాన్(45)తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. వీరు మార్గమధ్యలో శిరిగిరిపాడు వద్దకు రాగా అదే సమయంలో శిరిగిరిపాడుకు చెందిన మహేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఎదురుగా రావడంతో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కరిముల్లా అక్కడికక్కడే మృతి చెందగా నూర్జహాన్, మహేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ సత్యనారాయణ సంఘటనాస్థలాన్ని పరిశీలించి నూర్జహాన్‌ను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు, మహేష్‌ను నరసరావుపేటకు తరలించారు. నూర్జహాన్ చికిత్స పొందుతూ మృతిచెందింది.

అదుపుతప్పి తిరగబడిన కారు

నాదెండ్ల మండలం గణపవరానికి చెందిన ఐదుగురు, చిలకలూరిపేటకు చెందిన ఒకరు కారులో గుంటూరు సమీపంలోని దాసరిపాలెంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. సాయంత్రం తిరుగు ప్రయాణమైన యువకులు ప్రయాణిస్తున్న కారు తిమ్మాపురం పరిధిలో డివైడరన్ తాకి అదు పు తప్పి గాల్లో తేలుకుంటూ సర్వీసు రోడ్డు పక్కనే ఉన్న సుమారు మూడు అడుగుల లోతున్న అగడ్తలో తిరగబడింది. దీంతో చిలకలూరిపేటకు చెందిన మేకపోతుల నాగపవన్, గణపవరానికి చెందిన వీర్ల శివనాగరా జు, నూకల అఖిల్, షేక్ నాగుర్‌వలి, హేమంత్‌కుమార్, కిరణ్‌కుమార్(23) తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, 108 సిబ్బంది, స్థానికుల సహకారంతో ఎస్ఐ శివరామకృష్ణ క్షతగాత్రులను కారు నుంచి అతి కష్టం మీద బయటకు తీశారు. వారిలో ఇద్దర్ని పేట ప్రభుత్వాసుపత్రికి, మిగిలిన నలుగుర్ని గుం టూరుకు తరలించారు. చిలకలూరిపేటలో చికిత్స పొందుతూ కిరణ్‌కుమార్ మృతిచెందినట్లు తెలిసింది. అతిగా మద్యం తాగి వేగంగా కారు నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు సమాచారం.

లక్ష్యానికి మించి..

- రిజిస్ట్రేషన్ శాఖలో కాసులు గలగల
- రూ.1110.03 కోట్లు ఆర్జించిన ప్రభుత్వం





(తెనాలి, ఆంధ్రజ్యోతి)

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంలో మెరుగైన పనితీరును ప్రదర్శించింది. ప్రభుత్వం భారీ లక్ష్యం ఇవ్వగా.. అలవోకగా అధిగమించింది. క్రయ విక్రయాల ద్వారా అంచనాకు మించి ఆదాయాన్ని ఆర్జించింది. 2024 కంటే గతేడాది గణనీయమైన వృద్ధిని సాధించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు రిజిస్ట్రేషన్ రుసుం, స్టాంప్ డ్యూటీ, బదలీ పన్ను తదతర లావాదేవీల ద్వారా రూ. 1009.05 కోట్ల ఆదాయం.. ప్రభుత్వ సదరు శాఖకు నిర్దేశించిగా రూ. 1110.03 కోట్లు ఆదాయం పొందింది.

రిజిస్ట్రేషన్‌ల లావాదేవీలు పెరగడం వల్లే ఆదాయం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. 2024 కంటే గతేడాది పల్నాడు జిల్లా ఆదాయం 46.36 శాతం పెరిగినట్లు రిజిస్ట్రేషన్ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బాపట్ల జిల్లాలో 43.09 శాతం, గుంటూరు జిల్లాలో 23.02 శాతం ఆదాయం వృద్ధి చెందింది. గుంటూరు, నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆదాయం గణనీయంగా పెరిగింది. మార్చి ముగింపు కల్లా ఇంకా భారీగా పెరుగుతుందని అంచనాగా ఉంది.

నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు చేస్తే ఆదాయం ఇంకా పెరిగి ఉండేదన్న అభిప్రాయం (మిగతా 8వ పేజీలో)

జిల్లాల వారీగా రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ కోట్లలో ఇలా..

జిల్లా	టార్గెట్	ఆర్జించినది	2024లో	వృద్ధి శాతం
పల్నాడు	252.22	298.77	204.13	46.03
బాపట్ల	134.14	155.50	115.93	43.09
గుంటూరు	622.69	655.76	533.05	23.05

రేషన్‌లో గోధుమ పిండి

కార్డుదారులకు పంపిణీ చేసిన జేసీ

గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రేషన్ సరుకుల్లో గోధుమ పిండిని కార్డుదారులు అందుకున్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని జనవరి నెల నుంచి కార్డుదారులకు ప్రత్యేకంగా గోధుమ పిండిని సబ్సిడీపై అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా గురువారం కార్డుదారులకు గోధుమ పిండి ప్యాకట్ల పంపిణీని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ప్రారంభించారు. గుంటూరు నగర పరిధిలోని రేషన్ షాపు నంబరు 0781163లో కార్డుదారులకు ఆయన స్వయంగా రేషన్ సరుకులతోపాటు గోధుమిపిండి ప్యాకెట్లను అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 200 రేషన్ షాపులకు ఒక్కో షాపునకు 300 ప్యాకెట్ల చొప్పున గోధుమ పిండిన అందు బాటులో ఉంచామన్నారు. ఒక కార్డుకు ఒక ప్యాకెట్(కిలో) చొప్పున 20 రూపాయలకే అందిస్తున్నామన్నారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.


కార్డు దారులకు గోధుమపిండి ప్యాకెట్లు అందజేస్తున్న జేసీ శ్రీవాస్తవ

మూడు సంస్థలకు భూములు

రాజధానిలో కేటాయించిన సీఆర్డీఏ


గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మరో మూడు సంస్థలకు ఏపీ సీఆర్డీఏ భూములు కేటాయించింది. కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి సంస్థకు శాఖమూరులో 23.127 ఎకరాల భూమిని కేటాయించింది. చదరపు మీటరుకు ఏడాదికి ఒక రూపాయి లీజుకు 60 ఏళ్లపాటు లీజుకు ఇచ్చింది. రెండు హోటళ్లకు భూమి కేటాయింపుల్లో మార్పు చేశారు. 2014- 19 మధ్యకాలంలో సథరన్ గ్లోబల్ హోటల్స్, రిసార్ట్స్ లిమిటెడ్‌కు తుళ్లూరులో ఇచ్చిన రెండెకరాల భూమి స్థానంలో లింగాయపాలెంలో 2 ఎకరాలు కేటాయించారు. ఎకరం రూ.1.50 కోట్ల లెక్కన ఇస్తున్నారు. కాగా ఓమ్ శ్రీ భవనసాయి అసోసియేట్ (హెచ్‌వైఏటీటీ)కు గతంలో తుళ్లూరులో సర్వే నెంబరు 185లో స్థలం కేటాయించారు. ఇప్పుడు దాన్ని అదే గ్రామంలోని వేరే చోటికి మార్చారు. ఎకరం ధర రూ.1.50 కోట్లుగా నిర్ణయించారు.

రాజముద్రతో.. పాసు పుస్తకాలు

నేటి నుంచి పంపిణీకి రెవెన్యూ ఏర్పాట్లు

- గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పంపిణీ
- 9వ తేదీలోపు పూర్తి చేయనున్న అధికారులు

గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో పాత భూహక్కు పత్రాల స్థానంలో కొత్తగా రాజముద్రతో పట్టాదారుపాసు పుస్తకాలను పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. జిల్లాలో మొత్తం 35,690 పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ జరగనుంది. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీని ప్రారంభిస్తారు. మండల స్థాయిలో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆయా తేదీల్లో గ్రామ సభలు నిర్వహించి పంపిణీ చేస్తారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో రూపొందించిన పట్టాదారు పాసు పుస్తకాలు రైతుల చేతికి అందనున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 2020లో రీసర్వే ప్రారంభం కాగా, జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో రీసర్వే చేశారు. ఎన్నికల ముందు హడావుడిగా జగన్ బొమ్మతో ఉన్న పట్టాదారు పుస్తకాలను కొన్ని గ్రామాల్లో రైతులకు పంపిణీ చేశారు. కాగా కూటమి అధికారంలోకి రావడంతో జగన్ బొమ్మతో ముద్రించిన పాస్‌పుస్తకాలను రెవెన్యూ అధికారులు వెనక్కి తీసుకుని రాజముద్రతో ఉన్న కొత్త పాస్‌పుస్తకాలను సిద్ధమయ్యారు. రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో వెబ్‌ల్యాండ్ డేటాతో క్షుణ్ణంగా ధృవీకరించిన తర్వాతనే అర్హులైన రైతుల జాబితాను తయారు చేశారు. ఆ మేరకు పాసు పుస్తకాలను ముద్రించారు. ఇప్పటికే (మిగతా 6వ పేజీలో)



జగన్ బొమ్మపై జనాగ్రహం

వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు చెందిన భూములకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలపై అప్పటి సీఎం జగన్ ఫొటోలను ముద్రించారు. తమ పట్టాలపై జగన్ ఫొటోలు ఏమిటని రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో తమ పట్టాదారు పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్‌లు తనఖా పెట్టి రుణాలు తీసుకుంటారేమోనని రైతులు భయపడిపోయారు. సర్వే హద్దు రాళ్ల పైనా జగన్ ఫొటోలను ముద్రించారు. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జగన్ బొమ్మలన్నింటిని తొలగించింది. ఇప్పుడు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలను ముద్రించి భూయజమానులకు అందజేయనుతున్నది. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకుని పట్టాలను పొందాలని అధికారులు సూచించారు. ఎలాంటి రాజకీయ ముద్రలు, లోగోలు లేకుండా ప్రభుత్వ చిహ్నంతో ముద్రించిన పాసు పుస్తకాల పంపిణీపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పండగలు.. చికెన్ ధర పరుగులు

- ఆకాశాన్నంటుతున్న చికెన్ ధరలు
- స్కిన్ లెస్ కేజీ రూ.320పైనే
- అదే బాటలో కోడి గుడ్డు రూ.8

6

అకాడమీ పుస్తకాలు పైరసీ చేస్తే కఠిన చర్యలు

- ఏపీ తెలుగు, సంస్కృతి అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్

8

గిరిజనం.. వసతి అధ్వానం



కొత్త మిర్చికి.. కష్టాలు

- సరుకు రాక క్రమబద్ధీకరించకుంటే పతనం
- ఇప్పటికే కోల్ట్‌స్టోరేజ్‌ల్లో 32.16 లక్షల టిక్కీల నిల్వ
- సంక్రాంతిలోపు 4 లక్షల టిక్కీల విక్రయం జరగొచ్చని అంచనా

గిట్టుబాటు ధర ఇప్పట్లో అసాధ్యమే

గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త మిర్చికి గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇప్పటికే కర్నూలు నుంచి కొత్త మిర్చి పంట దిగుబడి రోజుకు 5 వేల టిక్కీలు(ఒక్కో టిక్కీ 40 కేజీలు) ఏఎంసీకి వస్తున్నాయి. మరోవైపు గుంటూరు, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీల పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లలో నేటికి 32 లక్షల 16 వేల మిర్చి టిక్కీల నిల్వలు ఉన్నాయి. ఇంత పెద్ద మోతాదులో స్టాకు ఉండగా మరో 15 రోజుల (సంక్రాంతి పండగ సెలవుల) తర్వాత యార్డుకు కొత్త పంట దిగుబడి (మిగతా 8వ పేజీలో)

జోష్‌గా.. కిక్

- మద్యం అమ్మకాల్లో న్యూ రికార్డు

31న రూ.18.68 కోట్ల విక్రయం



గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పాత సంవత్సరం 2025కు వీడ్కోలు పలుకుతూ.. నూతన సంవత్సరం 2026ను స్వాగతిస్తూ.. మందుబాబులు పార్టీల్లో మునిగి తేలారు. డిసెంబరు నెల 25వ తేదీ వరకు జరిగిన అమ్మకాల మొత్తం... 25 నుంచి 31వ తేదీ వరకు జరిగిన అమ్మకాల్లో సగం ఉన్నట్లు ఎక్సైజ్ లెక్కలు తెలియజేస్తున్నాయి. బుధవారం సాయంత్రం నుంచే (మిగతా 6వ పేజీలో)

నేడు పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవం

గుంటూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం జరగనుంది. మహాత్మాగాంధీ ఇన్నర్ రింగు రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 9 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని బోర్డు సెక్రెటరీ డివిజు గోపాల్ తెలిపారు. పొగాకు ఉత్పత్తిదారులు, ట్రేడర్లు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి వ్యాపారులు 500 మందికి పైగా పాల్గొంటారని ఆయన చెప్పారు. బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, సభ్యులు కూడా పాల్గొని ప్రసంగించనున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	162, 171, 183
చికెన్ విత్ స్కిన్(కిలో)	314.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	324.00

మిర్చియార్డు సమాచారం

(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	31,392	
అమ్మకాలు	34,992	
నిల్వ	11,276	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	12000	15500
273	---	----
341	11000	17600
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16500
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	17000
దేవనూరు డీలక్స్	11000	17800
ఆర్మూరు	10000	13000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16600
నెంబరు. 5	11000	15000
273	----	----
341	11000	16500
4884	12000	14300
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14800
బ్యాడిగి 355	10000	16500
దేవనూరు డీలక్స్	12000	16800
తాలుకాయలు	5000	7500

రేపటి నుంచి కేఎల్‌యూలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్

తాడేపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో శనివారం నుంచి 5వ తేదీ వరకు సౌత్‌జోన్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పురుషుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వర్సిటీ వీసీ డాక్టర్ సారధివర్మ తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ప్రోవీసీలు డాక్టర్, ప్రసాద్, వెంకట్రామ్, రిజిస్ట్రార్ సుబ్బారావు, క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్, డీన్ రామకృష్ణలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా 128 విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, గౌరవ అతిథులుగా పలువురు పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సౌత్‌జోన్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌తో పాటు అఖిల భారతస్థాయి పోటీలు జరగడం కేఎల్‌యూకు గర్వకారణమన్నారు. క్రీడాకారులకు యూనివర్సిటీ తరపున వసతి, వైద్య, భోజన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ పోస్టర్ విడుదల చేస్తున్న కేఎల్‌యూ వీసీ సారధివర్మ తదితరులు

పండగలు.. చికెన్ ధర పరుగులు

● ఆకాశాన్నంటుతున్న చికెన్ ధరలు
● స్కిన్ లెస్ కేజీ రూ.320పైనే
● అదే బాటలో కోడి గుడ్డు రూ.8

గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వరుస పండుగల డిమాండ్‌తో చికెన్ ధర పరుగులు పెడుతోంది. రూ.మూడు వందలు దాటి.. సామాన్యుడి చేతికి చిక్కనంటోంది. మాంసాహార ప్రియులకు మార్కెట్‌లో చికెన్ ధరలు షాక్ ఇస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం పెరిగాయి. గత నెలలో చికెన్ స్కిన్ లెస్ కేజీ రూ. 200 వరకు మాత్రమే ఉండగా ఇప్పుడు రూ. 324కు చేరింది. ప్రస్తుతం పండుగల సీజన్ కావడంతో ధరలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదని వ్యాపారులు చెబుతున్నారు.



మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా పౌల్ట్రీలో కోళ్ల ఉత్పత్తి పెద్దగా లేకపోవడంతో.. ఆ ప్రభావం ధరలపై పడుతోంది. వాస్తవానికి స్కిన్ లెస్ రూ. 324 కాగా, అధికారికంగా పేపరు ధరగా ప్రకటించారు. మార్కెట్లో మాత్రం ఒక్కో చికెన్ స్టాల్‌లో ఒక్కో ధరకు విక్రయిస్తున్నారు. మరికొన్ని స్టాల్స్‌లో కిలో స్కిన్ లెస్ రూ. 270కు కూడా విక్రయిస్తున్నారు. పండగలు కావడంతో.. వ్యాపారం ఎక్కువ ఉందని వ్యాపారి సయ్యద్ చాంద్ పేర్కొన్నారు.

కోడి గుడ్డు ధర రూ.8లు

చికెన్ ధరలు అమాంతం పెరుగుతుంటే, అదే బాటలో కోడి గుడ్డు ధర కూడా సాగుతోంది. కోడిగుడ్డు హోల్‌సేల్‌లో రూ.7లు ప్రకటించగా రిటైల్ దుకాణాల్లో కోడి గుడ్డు రూ.8కి విక్రయిస్తున్నారు. గత నెలలో 100 గుడ్లు రూ. 640 ఉండగాక్రమంగా ప్రస్తుతం రూ.700 దాటింది. మొన్నటి వరకు హోల్‌సేల్‌లోనే 100 గుడ్లు రూ. 720కి విక్రయించారు. తాజాగా 100 గుడ్లు రూ.660లకు చేరింది. కాగా రిటైల్ దుకాణాల్లో మాత్రం గుడ్డు ధర తగ్గడం లేదు. మరి కొన్ని రోజులు ఇవే ధరలు కొనసాగే అవకాశం ఉందని పౌల్ట్రీ వ్యాపారులు తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదు

నూతన సంవత్సర వేడుకల్లో రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

గుంటూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలందించే క్రమంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పిలుపునిచ్చారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తనను కలవడానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠీని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు మరింత కృషి చేయాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జి.వి.రమణమూర్తి, ఏటీవీ రవికుమార్, ఎ.హనుమంతు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అలహరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుంటూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు ఐజీని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు, మొక్కలను అందజేశారు.

సరికొత్త ప్రణాళికలతో ప్రజలకు ఉత్తమ సేవలు

సరికొత్త ప్రణాళికలతో ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా తనను కలవడానికి వచ్చిన పోలీస్ అధికారులకు దిశానిర్దేశం ఏశారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారులు ఎస్పీతో కలిసి కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రజల శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖను మరింత సమర్థంగా నడిపిస్తూ, సరికొత్త విధానాలు, ప్రణాళికలతో పోలీస్ అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్న ఎస్పీ పాలనా దక్షత, సేవాభావాన్ని కొనియాడారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. తమ ఆదేశాలను నిబద్ధతతో అమలు చేస్తూ పనిచేస్తున్నందుకు పోలీస్ అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి (అడ్మిన్), ఏటీవీ రవికుమార్ (ఎల్అండ్ఓ), కె.సుప్రజ (కెమ్స్), ఎ.హనుమంతు (ఏఆర్), పోలీస్ కార్యాలయ ఏఓ వెంకటేశ్వరరావు, తెనాలి, తుళ్లూరు, గుంటూరు ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, ట్రాఫిక్ డీఎస్పీలు అబ్దుల్ అజీజ్, అరవింద్, మురళీకృష్ణ, భానోదయ, బెల్లం శ్రీనివాస్, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అలహరి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు, ఆయా సబ్ డివిజన్ల సీఐలు తదితర సిబ్బంది ఉన్నారు.



ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్, అధికారులతో ఎస్పీ వకుల్ జిందాల్

జోష్‌గా కిక్

(5వ పేజీ తరువాయి)

మందుబాబులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకోవడంతో మద్యం కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఈ ఏడాదినూతన సంవత్సర వేడుకలలో మద్యం అమ్మకాలు కొత్త రికార్డులను సృష్టించాయి. పబ్‌కల్చర్ దరి చేరకపోయినా యువత అదే స్థాయిలో పార్టీలను నిర్వహించుకున్నారు. ఈ పార్టీల కోసం పెద్ద మొత్తంలో మద్యాన్ని కొనుగోలు చేశారు. డిసెంబరు 31న ప్రభుత్వం 12 గంటల వరకు మద్యం షాపులు, బార్లను అర్ధరాత్రి ఒంటి గంట వరకు తెరిచి ఉంచే అవకాశం ఇచ్చింది. దీంతో మద్యం దుకాణాలతో పాటు బార్లు మందుబాబులతో కిక్కిరిసిపోయాయి. డిసెంబరు నెల మొత్తం గుంటూరు జిల్లాలో రూ.254.51 కోట్లు, పల్నాడు జిల్లాలో 105.12 కోట్ల అమ్మకాలు జరిగాయి. కాగా చివరి పది రోజుల్లో గుంటూరు జిల్లాలో రూ.71.37 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.49.96 కోట్లు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కాగా గత నెల చివరి రోజున గుంటూరు జిల్లాలో రూ.12.96 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.5.72 కోట్లు అమ్మకాలు జరిగాయి.

విజ్ఞాన్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

గుంటూరు (విద్య), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, విజ్ఞాన్ లారా, విజ్ఞాన్ ఫార్మసీ, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు సరికొత్త మార్గాలను అన్వేషించా లన్నారు. మార్పును స్వీకరించడమే అభివృద్ధికి మూలమని పేర్కొన్నారు. వేడుకల్లో విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, లారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.మోహన్ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు (తూర్పు), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత నియామాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్ చాంబర్‌లో గురువారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ప్రారంభించి, పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలు పాటించనందువల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతు న్నాయన్నారు. వాహనదారులు తమ కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. డీటీసీ సీతారామిరెడ్డి మాట్లాడుతూ, జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు జరుగుతాయన్నారు. విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ శ్రీహరి, వాహన తనిఖీ అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, డీటీసీ

2026కు ఘన స్వాగతం

(5వ పేజీ తరువాయి)

తీరారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఎంపీ, ఎమ్మెల్యేలు, రాజకీయ నేతల కార్యాలయాల్లో, వారి గృహాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో పాటు కేక్ కటింగ్‌లు జరిగాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యాలయాలతో పాటు వివిధ సంస్థల కార్యాలయాల్లో కూడా నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా జరిగాయి. నేతలను వారి అభిమానులు ఘనంగా సత్కరించారు. వివిధ శాఖలకు చెందిన జిల్లా కార్యాలయాల్లో నూతన సంవత్సర కోలాహలం నెలకొంది. కార్యాలయాల్లో అధికారులను ఉద్యోగులు కలసి బొకేలు, స్వీట్లు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తహసీల్దారు, ఎంపీడీవో తదితర శాఖల కార్యాలయాలతో పాటు పోలీసు స్టేషన్, మార్కెట్ యార్డు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాల్లో అధికారులు కేక్‌లు కట్ చేయగా ఆయా వేడుకల్లో ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలయాల్లో జరిగిన ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. చర్చిలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

గవర్నర్‌కు ఎమ్మెల్యే ప్రవీణ్.. నూతన సంవత్సర శుభాకాంక్షలు

పెదకూరపాడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కుటుంబ సమేతంగా దుశ్శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అమరావతి అమర లింగేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా అమరావతి దేవాలయానికి రావాలని గవర్నర్‌ను ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను దుశ్శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఏఎన్‌యూలో నూతన సంవత్సర వేడుకలు

ఏఎన్‌యూ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ వీసీ చాంబర్‌లో గురువారం నూతన సంత్సర కేక్ కటింగ్ నిర్వహించారు. వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరామ్‌ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం కేక్ కట్ చేసి.. ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీసీ మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యతతో పనిచేసి.. విశ్వవిద్యాలయ ఖ్యాతి విశ్వవ్యాప్తికి కృషి చేయాలని కోరారు. అనంతరం వర్సిటీ క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వీరయ్య, సురేష్, పూలే అధ్యయన కేంద్రం అధ్యాపకుడు త్రీమూర్తిరావు, దూరవిద్య కేంద్ర పరీక్షల నిర్వహణ అధికారి రామచంద్రన్ వికాస, కార్యదర్శి జె.శ్రీనివారావు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వీసీ గంగాధరరావు రెక్టార్, రిజిస్ట్రార్

జీడీసీసీ బ్యాంకు పురోభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

● నూతన సంవత్సర వేడుకల్లో బ్యాంకు చైర్మన్ మక్కెన

గుంటూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు పురో భివృద్ధికి అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కోరారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికారులు, సిబ్బంది సమక్షంలో చైర్మన్ మక్కెన కేక్ కట్ చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో కొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకొని బ్యాంకు అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. బ్యాంకులో మరింత పారదర్శక సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో వీఏఎస్ ఫణికుమార్ పలువురు అధికారులున్నారు.



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు

మాచర్ల అభివృద్ధికి సహకరిస్తా

● పుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు





కేక్ కట్ చేస్తున్న మధుబాబు, ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు

మాచర్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో మాచర్ల నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు అన్నారు. గురువారం నెహ్రూనగర్‌లోని స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలను కూటమి నేతలు, కార్యకర్తలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులతో ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గ నేతలు మధుబాబును దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుడా చైర్మన్ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. పట్టణంలోని వీఏఎన్ గార్డెన్‌లో నూతన సంవత్సర వేడుకలకు హాజరై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి, నరసరావుపేటలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును కలిసి నూతన సంతవ్సరం శుభాకాంక్షలు తెలిపారు. విశ్రాంత ఐజీ చిరుమామిళ్ల వెంకటనరసయ్య, బొల్లినేని లచ్చయ్యచౌదరి, రాయవరపు శంకర్‌మూర్తి, గుండు కృష్ణమూర్తి, అద్దెనపూడి కృష్ణమూర్తి, ఉన్నం మహేష్, సామినేని నరసయ్య, చెరుకూరి నరసింహారావు, దాసరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాము కాటుకు వృద్ధుడి మృతి

తుళ్లూరు జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోరుపాలెం గ్రామంలో పాముకాటుకు గురై వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల పక్రారం.. బోరుపాలెం వాసి మల్లెల దాసు(80) ఇంట్లో ఉన్న సమయంలో తాచుపాము కరిచింది. వెంటనే బంధువులు తుళ్లూరులోని ఓ ప్రవేటు హాస్పటల్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అప్పటికే దాసు మృతి చెందినట్టు డాకర్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుళ్లూరు స్టేసన్ అధికారి కొంకా శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐ నవీన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రాజముద్రతో పాసు పుస్తకాలు

(5వ పేజీ తరువాయి)

ఆయా పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. మండల స్థాయిలో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆయా తేదీల్లో గ్రామసభలు నిర్వహించి పంపిణీ చేయనున్నారు. కాగా కొత్తగా రూపొందించిన పాస్‌పుస్తకాలు ఇప్పటికే రెవెన్యూ కార్యాలయాలకు చేరాయి.

నేటి మధ్యాహ్నం నుంచి...

శుక్రవారం మధ్యాహ్నం నుంచి మేడికొండూరు మండలం డోకిపర్రు, వరగాని, వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు, ప్రత్తిపాడు మండలం కొండపాడు, దుగ్గిరాల మండలం చినపాలెం, చేబ్రోలు మండలం మేసరగడ్డ అనంతవరం, తెనాలి మండలం దేవరపల్లి సిరి గ్రామాల్లో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ జరుగుతుంది. 3న మేడికొండూరు మండలం పాలడుగు, వట్టిచెరుకూరు మండలం గారపాడు, ప్రత్తిపాడు మండలం కొండ జాగర్లమూడి, పెదనందిపాడు మండలం రావిపాడు, దుగ్గిరాల మండలం డీపీ అగ్రహారం, చింతలపూడి, తెనాలి మండలం నందివెలుగు గ్రామాల్లో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ జరుగుతుంది. 5న వట్టిచెరుకూరు మండలం ముట్లూరు, కారంపూడిపాడు, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, 6న మేడికొండూరు మండలం విశదల, వెలవర్తిపాడు, వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం, పెదనందిపాడు మండలం రాజుపాలెం, దుగ్గిరాల మండలం తుమ్మపూడి, తెనాలి మండలం పినపాడులో, 7న మేడికొండూరు మండలం సిరిపురం, వట్టిచెరుకూరు మండలం చామర్లపాడు, ప్రత్తిపాడు మండలం గనికపాడు, దుగ్గిరాల మండలం మోరంపూడి, 8న మేడికొండూరు మండలం కొర్రపాడు, వట్టిచెరుకూరు మండలం యామర్రు, పెదనందిపాడు మండలం ఉప్పలపాడు, దుగ్గిరాల మండలం కొండూరు, తెనాలి మండలం సంగం జాగర్లమూడిలో, 9న మేడికొండూరు మండలం మంగళగిరిపాడు, పొనుగుపాడు కండ్రిక, పొట్లపాడు, వట్టి చెరుకూరు మండలం కుర్నూతల, దుగ్గిరాల మండలం శృంగారపాడు గ్రామాల్లో పాసు పుస్తకాల పంపిణీ జరగనున్నది.

19న జిల్లా ఏపీ ఎన్జీవో ఎన్నికలు



కిలారు జగదీశ్వరరావు

గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీ వో అసోసియేషన్ గుంటూ రు జిల్లా కమిటీ ఎన్నికలు ఈ నెల 19న జరగను న్నాయి. ఎన్నికల నిర్వహ ణాధిరిగా అసోసి యేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిలారు జగదీశ్వ రరావును నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో సహా 17 పోస్టులకు జనవరి 4న నామినేషన్ స్వీకరణ, 19న ఓటింగ్ జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ ఎన్నికలలో గుంటూరు సిటీ, ప్రత్తిపాడు, దుగ్గిరాల, అమరావతి, మంగళగిరి, తెనాలి, పొన్నూరు తాలూకా యూనిట్లకు చెందిన 256 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అప్పారావుకు అభినందనలు



ఎమ్మెల్యే నరేంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుర్రా అప్పారావు

గుంటూరు (తూర్పు), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు చైర్మన్‌గా నూతనంగా నియమితులైన కుర్రా అప్పారావు గురువారం గుంటూరులో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుర్రా అప్పారావును ఎమ్మెల్యే హృదయపూర్వకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. యార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



నూతన సంవత్సరం సందర్భంగా శ్రీవికాస్‌లో రాజామాస్టారిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీవికాస్‌లో నూతన సంవత్సర వేడుకలు

గుంటూరు (విద్య), జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూనగర్‌లోని శ్రీవికాస్ స్కూల్ ఆవరణలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజా మాష్టారు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నగర అభివృద్ధే ధ్యేయంగా కృషి



మేయర్ రవీంద్రకు అభినందనలు తెలుపుతున్న కమిషనర్ శ్రీనివాసులు తదితరులు

● మేయర్ రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం అశోక్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా, సుఖ, శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. రానున్న కాలంలో గుంటూరు నగరాభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలియజేశారు.



కేక్ కట్ చేస్తున్న దేగల ప్రభాకర్, పాల్గొన్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్‌లో ఘనంగా నూతన ఏడాది వేడుకలు

గుంటూరు (తూర్పు), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాజ్ సెంటర్లోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్‌లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన వేడుకలలో ఏసీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ పాల్గొని, వైద్యులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఏడాది సుఖ, సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి - గుంటూరు

19న జిల్లా ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్‌కు ఎన్నికలు

గుంటూరు (తూర్పు), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా ఎన్నికలను ఈ నెల 19న నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారు జగదీశ్వరరావు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ షెడ్యూల్ ప్రకారం జిల్లా శాఖలోని అధ్యక్ష, కార్యదర్శులతో సహా 17 పదవులకు ఈ నెల 4న నామినేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ ఎన్నికలలో గుంటూరు సిటీ, ప్రతిపాడు, దుగ్గిరాల, అమరావతి, మంగళగిరి, తెనాలి, పొన్నూరు తాలూకా యూనిట్లకు చెందిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

వయోవృద్ధుల సామాజిక భద్రతకు కృషి

గుంటూరు(విద్య): వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, సామాజిక భద్రతకు మరింత కృషి చేస్తామని జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ నూతన అధ్యక్షుడు మన్నే సుబ్బారావు అన్నారు. జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక బృందావన్ గార్డెన్స్ సంస్థ కార్యాలయంలో గురువారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా మన్నే సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా మదమంచి నాగమల్లేశ్వరరావు, పావులూరి చిన్న సుబ్బారావు, కట్టా వలరాజు, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, నల్లపునేని సుబ్బారావు, మొక్కపాటి తులసి మల్లేశ్వరరావు, రాయపాటి శరత్‌చంద్ర ప్రసాద్, మదమంచి సుధాకర్, ఘంటా నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శిగా కోగంటి బసవ నందికేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా మొక్కపాటి కృష్ణ వరప్రసాద్, మన్నె పార్వతి, కార్యవర్గసభ్యులుగా సోమేపల్లి రాంప్రసాద్, లంక విజయబాబు, గుమ్మడి రంగనాయకమ్మ, పాటిబండ్ల సాంబశివరావు, తాళ్ల నారపరెడ్డిని ఎన్నుకున్నారు.

రేషన్ అక్రమాలను సహించేదిలేదు

● ఎమ్మెల్యే మాధవి



కార్డుదారులకు సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రేషన్‌లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే గళ్లా మాధవి హెచ్చరించారు. అమరావతి రోడ్డులోని రేషన్ షాప్‌లో గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ విధానం, కార్డుదారులకు అందుతున్న సేవలను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని గుర్తించి అప్పటి డీలర్ లైసెన్సును రద్దు చేసి, ఈ నెల నుంచి కొత్త డీలర్‌కు షాప్ కేటాయించామని తెలిపారు. కొత్త డీలర్ తమ రేషన్ దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి లాగిన్ వివరాలను అధికారులకు అందించడం అభినందనీయమన్నారు. అక్రమాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి రేషన్ దుకాణంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల నుంచి రేషన్ దుకాణాల్లో గోధుమ పిండి పంపిణీ ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70 ఉన్న గోధుమ పిండి, చౌక దుకాణాలలో కేవలం కిలో రూ. 20కే అందుబాటులో ఉంటుందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పశ్చిమ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కూటమి నేతలతో పాటు, పలు ప్రభుత్వ విభాగాల అధికారులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

నగర సుందరీకరణకు కార్యాచరణ

● కమిషనర్ శ్రీనివాసులు



కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి మొక్క అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో గుంటూరు నగరాభివృద్ధితోపాటు సుందరీకరణ, సంక్షేమ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టడానికి కార్యాచరణ సిద్ధం చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా కమిషనర్ క్యాంపు కార్యాలయంలో కమిషనర్‌ను నగర ఫుర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు కలిసి పూల మొక్కలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గత ఏడాదిలో నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్ అందించిన సంపూర్ణ మద్దతు ఈ ఏడాది మరింత కొనసాగాలని కోరారు. ఈ నెలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించనున్నామని కమిషనర్ తెలిపారు.

అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

గుంటూరు నగరాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం క్లిన (సీఎల్ఈసీపీ) ఏపీ డైరీ ఆవిష్కరణ కమిషనర్ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లిన గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ మహమ్మద్ రఫి, జనరల్ సెక్రటరీ రేజేటి సతీష్ కుమార్, కోశాధికారి సూర్య తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

గుంటూరు(తూర్పు), జనవరి 1(ఆంధ్రజ్యోతి): నగరంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువత సందడిగా గడిపారు. పెద్దలు, మహిళలు, యువత ఆలయాలకు, ప్రార్థన మందిరాలకు వెళ్లి ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, ప్రార్థనమందిరాల వద్ద నిర్వాహకులు ప్రత్యేకఏర్పాట్లు చేశారు.

టీడీపీ కార్యాలయంలో ..

గుంటూరు: టీడీపీ జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, మిర్చియార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, ఇతర టీడీపీ నేతలతో కలిసి కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, పి.సమతా, ఏ లక్ష్మిశైలజ, బి.రామారావు, వై.నాగేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, జే శ్రీనివాసరావు, సి.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందు నిలుపుతా: ఎమ్మెల్యే నసీర్



పోలీస్ అధికారులతో కలిసి న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందు నిలుపుతానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘ నంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అధికారులు పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

● మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్డులోని ఈన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాయకులున్నారు.

● బృందావన్‌గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి ఆచారి, రోషన్, రంగారెడ్డి, మహమూద్, నాయకులు గులాం రసూల్, నూనె ఉమామహేశ్వరరెడ్డి, గేదెల రమేష్, బందా రవీంద్రనాథ్ తదితరులున్నారు.

గోధుమ పిండి ప్యాకెట్లు సరిపడా సరఫరా చేయాలి

● నగర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు

గుంటూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రేషన్ దుకాణాలన్నింటికీ సరిపడా గోధుమ పిండి ప్యాకెట్లను సరఫరా చేయాలని చౌకధరల దుకాణదారుల సంక్షేమ సంఘం నాయకులు జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మకు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన రేషన్ డీలర్ల సంఘం నాయకులు డీఎస్‌వోను కలిసి సమస్యను వివరించారు. షాపులన్నింటికీ తగినంత స్టాకు సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తుమ్మల గాంధీ, వి.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

గుంటూరు బ్రాంచ్ (బ్రాంచ్ కోడ్ -0028), 12-1-12, S V R'S ఎంపైర్, గ్రౌండ్ ఫ్లోర్, శనక్కాయల ఫ్యాక్టరీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522001. ఫోన్: 0863-2223997, E-Mail : iob0028@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ - వేలం బహిరంగ ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) r/w 9(1) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు వారు **తేది:22-09-2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ.71,85,972/-** (అక్షరాల డెబ్బై ఒక్క లక్షల ఎనభై ఐదు వేల తొమ్మిది వందల డెబ్బై రెండు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, కాస్ట్స్ వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి వారిచే **స్వాధీనత** పరచుకోబడిన బ్యాంక్ తనఖా/అధీనంలో నున్న దిగువ వివరించిన స్థిరాస్తి **"ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే"** మరియు **"అక్కడ ఏది ఉన్నదో అది"** పద్ధతి పై **తేది.20-01-2026**న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా సూచించటమైనది.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క నెం.54) క్రింద బ్యాంకుకు తనఖా పెట్టిన స్థిరాస్తుల అమ్మకము. ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా **ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్** అధీకృత అధికారి గారు దిగువ ఋణం సొమ్ము వసూలు కొరకు, బ్యాంకుకు రావలసిన బకాయిలు మరియు దిగువ తెలిపిన వడ్డీతో సహా రాబట్టుకొనుటకు దిగువ ఆస్తులను **"ఎక్కడ ఉన్నది అక్కడ అలాగే" & "ఏది ఉంటే అది"** అను పద్ధతిలో అమ్మకం చేసే హక్కుతో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేసిన నోటీసును అనుసరించి స్వాధీనం చేసుకున్నారు. సదరు బకాయిలు మరియు రావలసిన సొమ్మును చెల్లించనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం సంక్రమించిన అధికారములతో బ్యాంకుకు రావలసిన బకాయి సొమ్ములు మొత్తం రాబట్టుకొనుటకు సదరు ఆస్తి అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. దిగువ సంతకందారు వెబ్‌పోర్టల్ https://baanknet.com నందు గల ఇ-వేలం ఫ్లాట్‌ఫారంపై సదరు అమ్మకంను నిర్వహించెదరు.

ఋణగ్రహీతల పేరు మరియు చిరునామా: శ్రీమతి గొట్టం రాధ, ఫ్లాట్ నెం.103, క్రింది అంతస్తు, పద్మజ టవర్స్, కుండ్లుల రోడ్డు, శివం మెరిట్ స్కూల్ మీదుగా, ఎపిహెచ్‌బి కాలనీ మీదుగా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ - 522005. **శ్రీ గొట్టం వెంకట్ రెడ్డి,** ఫ్లాట్ నెం.103, క్రింది అంతస్తు, పద్మజ టవర్స్, కుండ్లుల రోడ్డు, శివం మెరిట్ స్కూల్ మీదుగా, ఎపిహెచ్‌బి కాలనీ మీదుగా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ - 522005.

NPA తేది. 31.05.2018 — **డిమాండ్ నోటీసు తేది : 20.08.2018**

డిమాండ్ నోటీసు నందు పేర్కొన్న బకాయి : తేది.31.05.2018 నాటికి రూ.39,67,792/- + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్వాధీనత నోటీసు తేది: **29-01-2019,** — స్వాధీనత నోటీసు ప్రచురించబడిన తేది: **04-02-2019**

స్వాధీనత నోటీసు నందు పేర్కొన్న బకాయి: **తేది.28.01.2019 నాటికి రూ.42,37,870/-** + తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఇతర ఖర్చులు.

స్థిరాస్తి వివరములు: షెడ్యూలు - ఎ (భూమి): గుంటూరు జిల్లా, నల్లపాడు రిజిస్ట్రేషన్ సబ్ డివిజన్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, గుంటూరు సిటీ, నల్లపాడు గ్రామ డి.నెం.159, 160, 168, 173 & 174 లోని 744.32 చ॥గ॥లు లేదా 622.35 చ॥మీ॥ల విస్తీర్ణంలో ఎమ్ఐజి ఇంటి నెం.186 & 187తో గల శ్రీ సాయి హోమ్స్ అను పేరు గల స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు** : ఎమ్ఐజి - 188, 103 అ॥లు, **దక్షిణం:** ప్రైవేట్ భూమి, 66 అ॥లు, **పడమర** : ఎమ్ఐజి - 185, 100 అ॥లు, **ఉత్తరం** : 33 అ॥ల వెడల్పు మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, 66 అ॥లు.,

షెడ్యూలు - బి (ఫ్లాట్) : మొత్తం 744.32 చ॥గ॥లు లేదా 622.35 చ॥మీ॥ల విస్తీర్ణంలో 56.40 చ॥గ॥లు లేదా 47.15 చ॥మీ॥ల అవిభాజ్యపు వాటాతో శ్రీ సాయి హోమ్స్, నాల్గవ అంతస్తు నందు 1330 చ॥అ॥లు (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియాతో సహా) ప్లింత్ ఏరియాతో గల నివాస ఫ్లాట్ నెం.501 యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు** : ఓపెన్ టు స్కై, **దక్షిణం** : ఓపెన్ టు స్కై, **పడమర** : ఓపెన్ టు స్కై, **ఉత్తరం** : కామన్ కారిడార్ & మెట్లు.

రిజర్వుధర: రూ.27,66,000/- — **ధరావత్తు ధర : రూ.2,76,600/-** — **బిడ్ పెంపుదల మొత్తం: రూ.50,000/-**

వేలం తేది మరియు సమయం: తేది.20-01-2026, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు మరియు https://baanknet.com ప్లాట్‌ఫాం నందు వేలం పూర్తి అయ్యే వరకు ప్రతి 5 ని॥లకు ఒక సారి ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్ ఉండును.

ధరావత్తు చెల్లించువిధానం : ఆసక్తి గల బిడ్డర్లు / కొనుగోలుదారులు వారి మొబైల్ నెంబర్ మరియు ఇ-మెయిల్ ఐడి ఉపయోగించి **https://baanknet.com** పోర్టల్ నందు నమోదు చేసుకొనవలెను. తదుపరి అవసరమైన కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేయవలసిందిగా కోరడమైనది. కెవైసి పత్రాలను ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ధృవీకరించిన తర్వాత (2 పని రోజులు పట్టవచ్చు), ఆసక్తి గల బిడ్డర్లు/ కొనుగోలుదారులు సదరు గ్లోబల్ ధరావత్తు వాలెట్ ఖాతా నందు ఆన్‌లైన్ విధానం ద్వారా ధరావత్తు మొత్తాన్ని **20-01-2026, మధ్యాహ్నం 1.00** గంటలోపు బదిలీ చేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ చిరునామాను కలిగి ఉండవలెను మరియు పైన పేర్కొన్న సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ నందు లాగిన్ అవ్వడం ద్వారా వారి పేరు / ఖాతాను నమోదు చేసుకొనవలెను.

బ్యాంకుకు తెలిసిఉన్నంత వరకు ఎలాంటి జంఝాటములు (ఎన్‌కంబరెన్స్) : లేదు

ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం : ముందుగా బ్యాంకు వారి అనుమతి తీసుకొని బ్యాంకు పనివేళలలో తేది.02-01-2026 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ సమర్పించుట: తేది: 02-01-2026 నుండి

ఆన్‌లైన్ ద్వారా ధరావత్తుతో కలిపి బిడ్స్ దాఖలు చేయు చివరి తేది.20-01-2026, మ॥ 1.00 గం॥ల వరకు

* ప్రభుత్వ స్థానిక పన్నులు (ఆస్తులకు సంబంధించిన స్థానిక పన్నులు, ప్రోపర్టీ టాక్స్, వాటర్, డ్రైనేజ్ నిర్వహణ ఛార్జీలు, ఎలక్ట్రికల్ బిల్స్ మొదలగునవి) పాల్గొనదలిచిన బిడ్డర్ల ద్వారా నిర్ధారించబడాలి. సఫలీకృతులైన బిడ్డరుదారులే భరించాలి.

* చట్టబద్ధ బకాయిలు కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం, సర్వీస్ ప్రొవైడర్ యొక్క వెబ్‌సైట్ : URL: https://baanknet.com లేదా బ్యాంక్ వెబ్‌సైట్ : www.iob.in మరిన్ని వివరముల కొరకు : బ్రాంచి మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్, గ్రౌండ్ ఫ్లోర్, S V R's ఎంపైర్, శనక్కాయల ఫ్యాక్టరీ రోడ్డు, మెయిన్ రోడ్డు, కొత్తపేట, గుంటూరు - 522001. ఫోన్ : 0863-2223997, మొబైల్ నెం.8925950028 & Email Id: iob0028@iob.in లేదా సర్వీస్ ప్రొవైడర్ : M/s. Bank Asset Auction Network (BAANKNET) , రిజిష్టర్డు ఆఫీస్ : యూనిట్ -1, 3వ ఫ్లోర్, VIOS కమర్షియల్ టవర్, వడాలా ట్రక్ టెర్మినల్ దగ్గర, వడాలా ఈస్ట్, ముంబయి - 400037, email: support.BAANKNET@psballiance.com (Website: https://baanknet.com) (సంప్రదించవలసిన నెం.: 8291220220, హెల్ప్ డెస్క్ పనిచేయు సమయం : ఉ॥ 8.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు) వారిని సంప్రదించగలరు.

తేది : 31-12-2025, ప్రదేశం : గుంటూరు — సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్




ఈ తరానికి తెలిసేలా....

పూర్వపు సంస్మతి, సంప్రదాయాలు, ఆచారాలు మరుగున పడిపోతున్న వేళ ఈ తరానికి తెలిసేలా గుంటూరులోని కలెక్టరేట్ ప్రహరీపై కళాకారులు గీసిన చిత్రాలు

-గుంటూరు, ఆంధ్రజ్యోతి


ప్రభుత్వ ప్రహరీ గోడలపై చిత్రీకరిస్తున్న కళాకారుడు

అకాడమీ పుస్తకాలు పైరసీ చేస్తే

కఠిన చర్యలు

● ఏపీ తెలుగు, సంస్కృతి అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్



మంగళగిరి సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఇంటర్మీడియేట్ విద్యా సంస్థలు కచ్చితంగా తెలుగు అకాడమీ పాఠ్యపుస్తకాలను మాత్రమే వినియోగించాలని ఏపీ తెలుగు, సంస్కృతి అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ (శరత్‌చంద్ర) స్పష్టం చేశారు. అకాడమీ పుస్తకాలను పైరసీ చేసి విద్యా సంస్థల పేరుతో ముద్రించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళగిరిలోని తెలుగు, సంస్కృతిక అకాడమీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు భాష పరిరక్షణే లక్ష్యంగా అకాడమీ పనిచేస్తుందన్నారు. ఇటీవల చెన్నై పర్యటనలో తమిళ భాష పరిరక్షణకు ఏర్పాటు చేసిన తమిళ వర్చువల్ అకాడమీని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 45 దేశాల్లో ఉన్న తమిళులకు, తమిళనాడుకు వివిధ దేశాల నుంచి వలస వచ్చిన వారికి కేంద్రీయ విద్యాలయాల్లో చదువుకున్న విద్యార్థులకు తమిళ భాషను నేర్పిస్తున్నారని చెప్పారు. అదే విధంగా ఏపీలోనూ తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు లేఖ రాయడం జరిగిందన్నారు. తెలుగు భాషను నేర్పించడానికి ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను, భాషా నిపుణులను గంటకు రూ.500 గౌరవ వేతనంతో నియమించుకోవాలని అకాడమీ బోర్డు సమావేశంలో నిర్ణయించామన్నారు. తెలుగు, సంస్కృతి అకాడమీలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో శుక్రవారం నుంచి జరుగనున్న పుస్తక మహోత్సవంలో 231, 232 నంబర్ల స్టాల్స్‌లో తెలుగు అకాడమీ పుస్తక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. తెలుగు అకాడమీ పుస్తకాల పైరసీని అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి విద్యా సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించి అకాడమీ పుస్తకాలను వినియోగించని విద్యా సంస్థల అనుమతులను రద్దు చేయడంతోపాటు క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. రాష్ట్ర విభజనలో తెలుగు అకాడమీకి రావలసిన రూ.వంద కోట్ల నిధులు, ఇతర ఆస్తులను అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామన్నారు.

లక్ష్యానికి మించి..

(5వ పేజీ తరువాయి)

సర్వత్రా వ్యక్తమవుతోంది. కొన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూములు, స్థలాల విలువలో తగ్గించి రిజిస్ట్రేషన్లు చేశారన్న విమర్శలున్నాయి. పలు కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్లలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లుగా విమర్శలున్నాయి. కాయకు కాయ తరహాలో రిజిస్ట్రేషన్లకు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్ల హవా కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేస్తే ఆదాయం ఇంకా పెరిగే అవకాశం ఉందని క్రయ విక్రయదారులు చెబుతున్నారు.

కొత్త మిర్చికి.. కష్టాలు

(5వ పేజీ తరువాయి)

భారీగా వచ్చే అవకాశాలు ఉన్నట్లు ట్రేడర్లకు సమాచారం ఉన్నది. ఈ నేపథ్యంలో రైతుకు గిట్టుబాటు ధర లభించడం ఇప్పుడిప్పుడే సాధ్యపడదన్న అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమౌతున్నది. ఈ నేపథ్యంలో మిర్చియార్డుకు కొత్త సరుకు రాకని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఏర్పడింది. లేకుంటే అంతంత మాత్రంగా ఉన్న ధర పతనమయ్యే అవకాశాలు ఉన్నాయి. గుంటూరు, ప్రత్తిపాడు ఏఎంసీల పరిధిలో 99 కోల్డ్‌స్టోరేజ్‌లు ఉన్నాయి. వాటి సామర్థ్యం 3,87,080 మెట్రిక్‌టన్నులు కాగా ప్రస్తుతం 1,39,523.5 ఎంటీల సరుకు ఉన్నది. ఇందులో మిర్చి స్టాకు 1,28,646 టన్నులు. ఈ స్టాకు 32 లక్షల 16 వేల మిర్చి టిక్కీలతో సమానంగా ట్రేడర్లు చెబుతున్నారు. కాగా స్టాకులో ఎక్కువగా రైతులకు చెందినదే ఉన్నది. 1,12,583.8 టన్నుల మిర్చి రైతులు గత సీజన్‌లో ధర లేకపోవడంతో స్టాకు పెట్టుకున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసి ఎగుమతులు లేక ట్రేడర్లు 26,939.64 టన్నులను నిల్వ పెట్టారు. మిర్చియార్డులో ప్రతీవారం ఐదు రోజులే ట్రేడింగ్ జరుగుతుంది. ఏవైనా ప్రభుత్వ సెలవు దినాలు ఉంటే ఆ రోజుల్లో లావాదేవీలు జరగవు. ప్రస్తుతం రోజుకు 40 వేల నుంచి 50 వేల టిక్కీలను రైతులు యార్డుకు తీసుకొస్తోన్నారు. అందులో కొత్త స్టాకు 5 వేల టిక్కీలకు పైగానే ఉంటున్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకుంటే కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి తీసుకువస్తోన్న పాత సరుకు 30 వేల నుంచి 40 వేల టిక్కీల మధ్యనే ఉంటున్నది. మిర్చి యార్డులో ఏటా సంక్రాంతి పండగ సెలవు దినాలు ముగియగానే తొలుత రాయలసీమ జిల్లాల నుంచి రైతులు భారీగా మిర్చి తీసుకురావడం ప్రారంభిస్తారు. ఆ తర్వాత 20 నుంచి నెల వ్యవధిలో గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల రైతులు మిర్చిని తీసుకొస్తారు. తెలంగాణ నుంచి కూడా కొంత కొత్త స్టాకు గుంటూరు ఏఎంసీకి వస్తుంది. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండగ లోపు కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న స్టాకు మహా అయితే నాలుగు లక్షల టిక్కీలు తగ్గి 28 లక్షలకు చేరుకొంటాయని భావిస్తోన్నారు. ఆ పరిస్థితుల్లో కొత్త పంట, పాత స్టాకు ఒకేసారి ఏఎంసీకి వస్తే ధర తగ్గడం ప్రారంభమౌతుంది. ముఖ్యంగా ఎక్స్‌పోర్టులు సరిగా లేకపోవడమే ప్రస్తుత ఈ పరిస్థితికి కారణమని ట్రేడర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు రాబోయే క్లిష్ట పరిస్థితులను ముందుగానే అంచనా వేసి మార్కెట్‌కి సరుకు రాకని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉన్నది. లేదంటే గత రెండేళ్లలో ఏ పరిస్థితులు అయితే తలెత్తాయో అవే పునరావృతం కాక తప్పవు.

గిరిజనం.. వసతి అధ్వానం


రూముల్లో నిల్వ ఉన్న చెత్తకుప్ప


చెదలు పట్టి ఊడిపోయిన తలుపులు

వినుకొండటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో అద్దె రేకుల షెడ్డులో నడుస్తున్న ఎస్టీ కళాశాల వసతి గృహంలో పరిశుభ్రత కరువైంది. ఇక్క డ వసతి పొందుతున్న ఇంటర్, డిగ్రీ, ఐటీఐ విద్యార్థులు వార్డెన్ నిర్వాకంతో కళాశాలలు మానేసి ఇంటిదారి పడుతున్నారు. గతంలో వందకు పైగా ఉన్న ఈ వసతి గృహ విద్యార్థుల సంఖ్య.. నేడు రెండు అంకెలకు పరిమితమైంది. కొరవడిన పరిశుభ్రత, దోమల తాకిడితో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. మరుగుదొడ్లకు తలుపులు విరిగిపోవడం, గదుల ద్వారాలకు చెదలు పట్టడంతో వారి బాధలు వర్ణనాతీతం. చలి వాతావరణంలో.. విద్యార్థులు లోపల ఉన్నప్పటికీ బయట ఉన్నట్లుగానే భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయంపై గిరిజన వసతి గృహం వార్డెన్‌ను ఫోన్‌లో వివరణ కోరగా విరిగిన తలుపులకు మరమ్మతులు చేపట్టాలని భవన యజమానికి సూచించినట్లు చెప్పారు. మద్యం సేవించి విద్యార్థులు తలుపులు పగలగొట్టారని చెప్పడం కొసమెరుపు.

రోడ్డుకిరువైపులా రెండు జిల్లాలు

ఓ వైపు ప్రకాశం..మరో వైపు పల్నాడు


గాజులపాలెం, గార్లదిన్నె ఏరియల్ వ్యూ

వినుకొండ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఒక సిమెంట్ రోడ్డు రెండు జిల్లాలను వేరు చేస్తోంది. చూడ్డానికి ఒక గ్రామంలోని రోడ్డులా అనిపించినా.. ఒక వైపు ప్రకాశం జిల్లా, మరో వైపు పల్నాడు జిల్లా సరిహద్దు ఇదీ. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గార్లదిన్నె గ్రామం, ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం గాజులపాలేనికి మధ్యలో ఉంది. గార్లదిన్నె గ్రామంలో 50 కుటుంబాలు ఉండగా.. గాజులు పాలెం గ్రామంలో 100 కుటుంబాలు ని వాసం ఉంటున్నాయి. ఒక గ్రామ ప్రజలు పైపుతో నీళ్లు చల్లితే.. పక్క జిల్లాలో పడతాయి. ఇవి రెండు జిల్లాలకు సరిహద్దు గ్రామాలు అని చెబితే తప్ప కొందరికి తెలియదు. ఈ రెండు గ్రామాలు చిన్నవే అయినప్పటికీ రేషన్ షాపులు, పంచాయ తీలు వేర్వేరుగా ఉన్నాయి. పండుగలు, ఉత్సవాలు ఇరు గ్రామాలు ప్రజలు కలిసి జరుపుకుంటారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



సరికొత్త అవతార్‌లో ప్రభాస్

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి ఇందులో ప్రభాస్ లుక్ ఎలా ఉండబోతోందనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. కొత్త సంవత్సరం సందర్భంగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు సందీప్ రెడ్డి వంగా. 'భారతీయ సినిమా.. మీ ఆజానుబాహుడిని చూడండి' అని పేర్కొన్నారు. 'మీరు ఇప్పటివరకూ ఉన్నదాన్ని ప్రేమించారు. ఇకపై తెలియని దానితో ప్రేమలో పడండి' అని చెప్పారు. ఇప్పటివరకూ తెరపై చూడని సరికొత్త అవతార్‌లో ఆయన కనిపించారు. జులపాల జుట్టుతో.. ఒంటినిండా ఉన్న గాయాలకు బ్యాండేజీలు వేసుకుని ఒక చేతిలో మద్యం సీసా పట్టుకుని ఉన్నారు ప్రభాస్. ఆయన పీలుస్తున్న సిగార్‌ను వెలిగిస్తూ త్రిప్తి దిమ్రీ కనిపించారు. ఇందులో శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు ప్రభాస్. ఇటీవలె విడుదల చేసిన 'ద సౌండ్ స్టోరీ' ఆడియో టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచేసింది. టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. త్రిప్తి దిమ్రి కథానాయిక. ప్రకాశ్‌రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన కీలక పాత్రల్లో కనిపించనున్నారు.


పవన్ కల్యాణ్, డైరెక్టర్ సురేందర్‌రెడ్డి కాంబినేషన్‌లో కొత్త చిత్రం పట్టాలెక్కనుంది. 'జైత్ర రామ మూవీస్' బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మించనున్నారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

సందేశాత్మక ప్రేమ కథ



మహాన్, శృతి, మోహన సిద్ధి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'సిద్ధు గాడి లవ్‌స్టోరీ'. సి.రమేశ్ దర్శకత్వం వహిస్తున్నారు. బాల బ్రహ్మాచారి సమర్పణలో శివ బ్రహ్మేంద్ర క్రియేషన్స్ బ్యానర్‌పై సి.సావిత్రమ్మ నిర్మిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వి.ఎన్.ఆదిత్య మాట్లాడుతూ 'డైరెక్టర్ కావాలనే తన కొడుకు కలను 'సిద్ధుగాడి లవ్ స్టోరీ' సినిమాతో సావిత్రమ్మ నిజం చేశారు' అని అన్నారు. మహాన్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో ప్రేమ కథతో పాటు మంచి సందేశం కూడా ఉంటుంది' అని చెప్పారు.

రాజకీయ నేపథ్యంలో..



విష్వక్సేన్ కథానాయకుడిగా 'పిండం' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న కిరణ్ దైదా తెరకెక్కిస్తున్న చిత్రం 'లెగసీ'. కలాహీ మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి, సాయికిరణ్ రెడ్డి దైదా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. రాజకీయ నేపథ్యంలో సాగే కథగా ఈ చిత్రం రూపొందుతోంది. అనివార్య పరిస్థితుల్లో తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని మోసే సిద్ధార్థ్ అనే వ్యక్తిగా విష్వక్సేన్ కనిపించనున్నారు. ఆయన పాత్రలో విభిన్న షేడ్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఏక్తా రాథోడ్ కథానాయిక. రావు రమేశ్, సచిన్ ఖేడేకర్, మురళీ మోహన్, కేకే మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

యాక్షన్ థ్రిల్లర్




డ్రామా, యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో రూపుదిద్దుకున్న కన్నడ చిత్రం 'ది టాస్క్' అక్కడ విడుదలై విజయం సాధించింది, ఇప్పుడు ఆ సినిమా అదే పేరుతో తెలుగులోకి రానుంది. ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య తనయుడు అనంత కిశోర్ ఈ సినిమాను అదే పేరుతో తెలుగులో విడుదల చేయనున్నారు. ఇంతకుముందు ఆయన 'తల్లి మనసు' పేరుతో ఓ కుటుంబ కథాచిత్రాన్ని నిర్మించి అభిరుచి కలిగిన నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. జయ సూర్య, ఆర్.ఆజాద్, సాగర్‌రామ్, రఘు శివమొగ్గ ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించారు. రఘు శివమొగ్గ దర్శకత్వం వహించారు.

ముత్యాల ముగ్గు

ఆర్. ఇందిర
వెలమవారి వీధి, బొబ్బిలి,
విజయనగరం జిల్లా



17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చే వరకు



మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గులు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

రెండు రోజుల్లో
1.37 లక్షల మందికి దర్శనం



వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమలలోని ఆక్టోపస్ బిల్డింగ్ వద్ద క్యూలోకి వెళ్లేందుకు నిరీక్షిస్తున్న భక్తులు

- తిరుమలలో ప్రశాంతంగా టోకెన్ వైకుంఠ ద్వార దర్శనాలు
- నేటి నుంచి టోకెన్ రహిత దర్శనాలు

తిరుమల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొలిసారి ఏ ఒడిదొడుకులూ లేకుండా ప్రశాంతంగా తొలి రెండు రోజులు వైకుంఠ ద్వార దర్శనాలు జరిగాయి. ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో శ్రీవారిని 1,37,309 మంది దర్శించుకున్నారు. 30న ఏకాదశి రోజు 67,053 మంది, 31న ద్వాదశి రోజు 70,256 మంది శ్రీవారిని దర్శించుకుని ఉత్తర ద్వార ప్రవేశం చేశారు. గతంతో పోలిస్తే ఈ రెండు రోజుల్లో 24,202 మంది భక్తులు అదనంగా శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా శుక్రవారం వేకువజాము నుంచి తిరుమలలో టోకెన్ రహిత సర్వదర్శనాలు ప్రారంభం కానున్నాయి. అలాగే ఆన్‌లైన్‌లో టోకెన్లు పొందిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన, శ్రీవాణి భక్తులనూ దర్శనానికి అనుమతిస్తారు.

తిరుమలలో పెరిగిన రద్దీ

శుక్రవారం నుంచి సర్వదర్శనాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం నుంచి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. ఈసారి ఏకాదశి, ద్వాదశి పర్వదినాలు పూర్తయినప్పటికీ టోకెన్లు పొందలేకపోయిన చాలా మంది గోవిందమాల భక్తులు 2వ తేదీన శ్రీవారిని దర్శించుకుని మొకుౖలు చెల్లించేందుకు తిరుమలకు చేరుకుంటున్నారు. గురువారం రాత్రి నుంచి తిరుమలలో రద్దీ వాతావరణం నెలకొంది. టోకెన్లు పొందిన భక్తుల దర్శనాలు పూర్తయితే ముందస్తుగానే సర్వదర్శనాలు ప్రారంభించేలా రాత్రి నుంచే వీరిని కంపార్టుమెంట్లలోకి అనుమతిస్తున్నారు.

2025లో హుండీ ఆదాయం
రూ.1,383.90 కోట్లు

- 2.61 కోట్ల మంది భక్తులకు శ్రీవారి దర్శనం
- 13.52 కోట్ల లడ్డూల విక్రయాలు

తిరుమల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 2025లో తిరుమల శ్రీవారికి హుండీ ద్వారా రూ.1,383 కోట్ల ఆదాయం లభించింది. 2024తో పోలిస్తే రూ.18 కోట్లు అదనంగా సమకూరింది. అలాగే 2025లో 2.61 కోట్ల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 2024లో ఈ సంఖ్య 2.55 కోట్లు. ఇక 2024లో 12.15 కోట్ల లడ్డూ విక్రయాలు కాగా, 2025లో 13.52 కోట్ల లడ్డూలు అమ్ముడయ్యాయి. దాదాపు 1.37 కోట్ల లడ్డూలను అదనంగా విక్రయించారు. డిసెంబరు 27వ తేదీన రికార్డు స్థాయిలో 5.13 లక్షల లడ్డూలను భక్తులకు అందించారు. గత పదేళ్లలో ఇదే అత్యధికం. నాణ్యమైన నెయ్యి, ముడిసరుకుల కొనుగోలుతో ఇటీవల కాలంలో లడ్డూల నాణ్యత, రుచిపై భక్తుల నుంచి విశేష స్పందన వస్తున్న విషయం తెలిసిందే.

నేటి నుంచి 12 వరకు
విజయవాడలో పుస్తక మహోత్సవం

విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఏటా నిర్వహించే పుస్తక మహోత్సవం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరం ప్రారంభంతోపాటు నగరంలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే ఈ పుస్తక మహోత్సవం 12వ తేదీ వరకు జరుగుతుంది. ఇందుకోసం మొత్తం 270 స్టాల్స్ ఏర్పాటు చేశారు. 140 మంది ప్రచురణకర్తలు ఈ పుస్తక మహోత్సవంలో పాల్గొననున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ఈ పుస్తక మహోత్సవాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహం ప్రారంభిస్తారు. పుస్తకావిష్కరణలు జరిగే ప్రధాన వేదికకు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ వేదికగా నామకరణం చేశారు. బాలలకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహించే ప్రతిభా వేదికకు ప్రముఖ శాస్త్రవేత్త నార్లేకర్ పేరు పెట్టారు. ఆరో తేదీన మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల నుంచి పుస్తక ప్రియుల పాదయాత్ర (బుక్ ఫర్ వాక్) నిర్వహిస్తారు.

శ్రీవారి సేవలో సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు




శ్రీవారి ఆలయం ముందు కుటుంబ సభ్యులతో జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి



శ్రీవారి ఆలయం ముందు కుటుంబ సభ్యులతో జస్టిస్ గోపాలకృష్ణారావు

తిరుమల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా తిరుమల శ్రీవారిని సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు గురువారం దర్శించుకున్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేర్వేరుగా దర్శనం చేసుకున్నారు. అనంతరం ఉత్తరద్వార ప్రవేశం చేశారు.



ఆలయం ముందు జస్టిస్ రవినాథ్ తిల్హారి

మల్లన్న సన్నిధిలో జస్టిస్ రవినాథ్ తిల్హారి

శ్రీశైలం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి ఈఓ శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం జస్టిస్ రవినాథ్ తిల్హారి దంపతులు ప్రాకారంలోని పరివార ఆలయాలు కూడా దర్శించుకున్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం

- కోనసీమ, కర్నూలు జిల్లాల్లో ముగ్గురు మృతి

అంతర్వేది/ఓర్వకల్లు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కర్నూలు జిల్లాలో విషాదం నెలకొంది. కోనసీమ జిల్లా అంతర్వేది బీచ్‌కు బుధవారం రాత్రి కాకినాడ పట్టణం ఇంద్రపాలేనికి చెందిన నిమ్మకాయల శ్రీధర్ (35), వాకలపూడికి చెందిన నందమూరి వెంకట సాయి నాగ గోపీకిషన్, పెద్దాపురానికి చెందిన బొండాడ సూర్యకిరణ్ వచ్చారు. సూర్యకిరణ్ రూముకు వెళ్లిపోగా, గోపీకిషన్, శ్రీధర్ మళ్లీ బీచ్‌లో థార్ వాహనంలో తిరుగుతూ, వీడియోలు తీసుకుంటూ ఘైమరిచిపోయారు. ఈ క్రమంలో గోదావరి, సముద్రం సంగమం అయిన అన్నాచెల్లెలు గట్టు వద్ద వాహనం నీళ్లలోకి దూసుకెళ్లింది. గోపీకిషన్ వెనుకడోరు నుంచి బయటకు వచ్చి కాపాడాలంటూ కేకలు వేయడంతో అక్కడే ఉన్న కొంతమంది యువకులు అతి కష్టం మీద అతన్ని కాపాడగలిగారు. కానీ, డ్రైవింగ్ సీటులో ఉన్న శ్రీధర్ మాత్రం ఇరుక్కుపోవడంతో బయటకు తీయడం కుదరలేదు. గురువారం ఉదయం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారును గుర్తించి జేసీబీ సాయంతో బయటకు తీశారు. శ్రీధర్ అప్పటికే మరణించాడు. కొత్త సంవత్సరం మొదటి రోజు పాఠశాలకు సెలవు కావడంతో సరదాగా గడిపేందుకు వెళ్లిన నలుగురు స్నేహితుల్లో ఇద్దరు మృతి చెందారు. కర్నూలు నగరానికి చెందిన వినయ్‌కుమార్ (14), ఓర్వకల్లు మండలం పాలకొలనుకు చెందిన అస్లాం (14) మంచి స్నేహితులు. కర్నూలులోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థలో 8వ తరగతి చదువుతున్నారు. వీరు మరో నలుగురు స్నేహితులతో కలసి పాలకొలను దగ్గర్లోని గుండమయ్య చెరువు కట్ట వద్దకు చేరారు. వినయ్ కుమార్ ఈత కని చెరువులోకి దిగి మునిగిపోతుండగా అస్లాం అతన్ని కాపాడేందుకు చెరువులోకి దిగాడు. ఇద్దరూ చెరువులో మునిగి మృతి చెందారు.

బుడితి రాజశేఖర్‌కు ఏడాది పొడిగింపు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ సర్వీస్‌ను ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.


స్పోర్ట్స్

గుంటూరు ● శుక్రవారం 2 జనవరి 2026

టీ20 వరల్డ్‌కప్‌నకు ఆసీస్ జట్టిదే



మార్ష్



కనోలీ

మెల్‌బోర్న్: భారత్, శ్రీలంక ఆతిథ్యమిచ్చే టీ20 వరల్డ్‌కప్‌నకు ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. 15 మందితో కూడిన ఈ బృందానికి మిచెల్ మార్ష్ నేతృత్వం వహిస్తుండగా.. గాయాలతో బాధపడుతున్న పేసర్లు హాజెల్‌వుడ్, కమిన్స్, హిట్టర్ డేవిడ్‌లను కూడా ఎంపిక చేశారు. వచ్చే నెల 7 నుంచి జరిగే ఈ టోర్నీ ఆరంభానికల్లా వీరు కోలుకుంటారనే ఆశాభావాన్ని ఆసీస్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ జార్జి బెయిలీ వ్యక్తం చేశారు. భారత ఉపఖండ పిచ్‌లపై ప్రభావం చూపేందుకు జట్టులో ఎక్కువమంది స్పిన్నర్లు ఉండేలా చూశారు. అలాగే గత ఆరు నెలలుగా జట్టుకు దూరంగా ఉన్న ఆల్‌రౌండర్ కూపర్ కనోలీపై విశ్వాసం ఉంచడం విశేషం. ఐసీసీ రూల్ ప్రకారం ఈనెల 31 వరకు జట్టులో మార్పుచేర్పులకు అవకాశం ఉంటుంది.

ఆసీస్ జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), బార్ట్‌లెట్, కనోలీ కూపర్, కమిన్స్, డేవిడ్, గ్రీన్, ఎలిస్, హాజెల్‌వుడ్, హెడ్, ఇన్‌గ్లిస్, కునేమన్, మ్యాక్స్‌వెల్, షార్ట్, స్టొయినిస్, జంపా.

డోపీ రెజ్లర్ రీతికపై వేటు

- కోర్ గ్రూప్‌లోకి కాంపౌండ్ ఆర్చర్లు
- టాప్స్ జాబితా విడుదల



న్యూఢిల్లీ: డోపింగ్‌లో పట్టుబడిన రెజ్లర్ రీతిక హుడాను టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) నుంచి తప్పించగా.. కాంపౌండ్ ఆర్చర్లు పర్ణీత కౌర్, అభిషేక్ వర్మలను కోర్ గ్రూప్‌నకు ప్రమోట్ చేశారు. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఆర్చరీని కూడా చేర్చారు. ఈ విభాగంలో భారత్‌కు పతకాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో మొత్తం ఎనిమిది మంది కాంపౌండ్ ఆర్చర్లకు కోర్ గ్రూప్‌లో స్థానం లభించింది. 118 మంది పేర్లతో తాజా జాబితాను క్రీడా మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఇందులో 57 మంది సాధారణ, 61 మంది పారా అథ్లెట్లున్నారు. జావెలిన్‌లో నీరజ్ చోప్రాతోపాటు సచిన్ యాదవ్‌కు ఈసారి టాప్స్‌లో చోటుదక్కింది. ఆసియా చాంపియన్‌షిప్స్ పతక విజేత హుడా డోపింగ్‌లో విఫలం కావడంతో టాప్స్ నుంచి తప్పించినట్టు సాయ్ అధికారి ఒకరు తెలిపారు.

కోహ్లీ 'కొత్త' పోస్ట్‌కు లైక్‌ల వెల్లువ!



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ దంపతులు కొత్త సంవత్సరం వేడుకలను దుబాయ్‌లో ధూం..ధాం..గా జరుపుకొన్నారు. ఈ వేడుకల్లో విరాట్ సోదరుడు వికాస్ కోహ్లీ, సోదరి భావనా కోహ్లీ ధింగార్, ఆమె భర్త, మేనల్లుడు ఆర్యవీర్ కోహ్లీతోపాటు కొద్దిమంది దగ్గరి స్నేహితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుష్కతో ఉన్న ఫొటోను కోహ్లీ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. కొత్త ఏడాదిలో విరాట్ పంచుకున్న ఈ తొలి పోస్ట్‌కు నాలుగు గంటల్లో ఏకంగా 50 లక్షల లైక్‌లు రావడం విశేషం. అంతకుముందు 'నా జీవిత వెలుగు అనుష్కశర్మతో కలిసి 2026లో అడుగుపెడుతున్నా' అంటూ ఇన్‌స్టాలో కోహ్లీ పోస్ట్ చేసిన 2025 చివరి పోస్ట్‌కు గంటలోపే 40 లక్షల లైక్‌లు వెల్లువెత్తాయి.

3, 4 తేదీల్లో టీమిండియా ఎంపిక

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో సిరీస్ ద్వారా కొత్త సంవత్సరంలో క్రికెట్‌కు భారత జట్టు ఆహ్వానం పలుకుతోంది. సిరీస్‌లో భాగంగా మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-కివీస్ తలపడనున్నాయి. ఈనెల 11న రాయ్‌పూర్‌లో జరిగే మొదటి వన్డేతో నూతన సంవత్సరంలో పురుషుల క్రికెట్ సందడి ప్రారంభం కానుంది. అయితే న్యూజిలాండ్‌తో పొట్టి ఫార్మాట్‌కు టీమిండియాను ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ వన్డేలకు మాత్రం జట్టును ఎంపిక చేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో ఈనెల మూడు లేదా నాలుగు తేదీల్లో ఆన్‌లైన్‌లో సమావేశం కానున్న సెలెక్షన్ కమిటీ భారత జట్టును ఎంపిక చేయనున్నట్టు తెలిసింది.

పంత్‌కు చోటు ఉంటుందా ?



న్యూజిలాండ్‌తో వన్డేలకు ప్రకటించే జట్టులో కీపర్ పంత్‌కు స్థానం ఉంటుందా..అనే విషయమ్మై చర్చ జరుగుతోంది. కారణం..ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో నాలుగు మ్యాచ్‌లు ఆడిన రిషభ్ కేవలం ఒక హాఫ్ సెంచరీ చేయడమే. దాంతో పంత్‌కు జాతీయ జట్టులో చోటుపై చర్చ మొదలైంది. అయితే 18 నెలల్లో ఒక వన్డే కూడా ఆడే అవకాశం ఇవ్వకుండా పంత్‌పై వేటు వేయరనే వాదన కూడా వినవస్తోంది. కాగా..పంత్ ధనాధన్ బ్యాటింగ్.. టీమ్ మేనేజ్‌మెంట్‌లోని ఓ ముఖ్యుడికి నచ్చడంలేదట. వన్డేలకు సంప్రదాయ బ్యాటింగ్ చేయడమే ఉత్తమమని సదరు సభ్యుడు అభిప్రాయపడుతున్నట్టు చెబుతున్నారు.

కొత్త సారథి అదృష్టం తెచ్చేనా?

మహిళల ప్రీమియర్ లీగ్ మరో 7 రోజుల్లో



శ్రీచరణి



షఫాలీ

గతేడాదిని భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుత విజయాలతో చిరస్మరణీయంగా ముగించింది. అంచనాలకు మించిన ఆటతీరుతో వన్డే వరల్డ్‌కప్ విజయంతో పాటు ద్వైపాక్షిక సిరీస్ విజయాలతో తమ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకుంది. అటు ప్లేయర్లు సైతం ప్రత్యర్థి జట్లపై సూపర్ ఫామ్‌తో విరుచుకుపడ్డారు. ఇక వీరంతా తమ జోరును ఫ్రాంచైజీ క్రికెట్ వైపు మళ్లించే వేళైంది. ఈనెల 9 నుంచి ఆరంభమయ్యే మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ కోసం తమ సహచరులపైనే సవాల్ విసిరేందుకు సిద్ధం కాబోతున్నారు. ఈ నేపథ్యంలో లీగ్‌లోని ఐదు జట్లలో ఢిల్లీ క్యాపిటల్స్ బలాబలాలపై దృష్టి సారిస్తే..

ఢిల్లీ క్యాపిటల్స్



జెమీమా రోడ్రిగ్స్

జట్టు

స్వదేశీ: జెమీమా రోడ్రిగ్స్ (కెప్టెన్), షఫాలీ వర్మ, నికీ ప్రసాద్, దియా, శ్రీచరణి, మిన్నూ మణి, స్నేహ్ రాణా, మమతా మదివాల, తానియా భాటియా, నందిని శర్మ.

విదేశీ: వోల్వార్ట్, కాప్, చినెల్లె హెన్రీ, హామిల్టన్, లిజెల్లె లీ, అలన కింగ్.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ఇప్పటి వరకు జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్ రెండుసార్లు, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఓసారి విజేతగా నిలిచాయి. అయితే ఈ మూడుసార్లు తుది పోరులో వీరికి ప్రత్యర్థిగా నిలిచిన జట్టు మాత్రం ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్కటే కావడం గమనార్హం. మెగ్ లానింగ్ నేతృత్వంలో బరిలోకి దిగిన డీసీ ప్రతిసారీ ఫైనల్‌కు చేరింది. కానీ విజేతగా మాత్రం మారలేకపోయింది. ఈసారి జెమీమా రోడ్రిగ్స్ జట్టు అదృష్టాన్ని మార్చాలనుకుంటోంది. వేలానికి ముందే లానింగ్‌ను విడుదల చేసిన డీసీ తిరిగి ఆమెను దక్కించుకోవడంలో విఫలమైంది. దీంతో ఆది నుంచీ జట్టుతో పాటే ఉన్న జెమీమాకు ఈసారి సారథ్య బాధ్యతలు అప్పగించింది.

బ్యాటింగే బలం: ఎప్పటిలాగే డీసీ జట్టు బ్యాటింగ్ బలంతో ప్రత్యర్థి జట్లకు సవాల్ విసరనుంది. ఇటీవలి వన్డే వరల్డ్‌కప్‌లో భారత్‌ను విజేతగా నిలపడంతో జెమీమాతో పాటు ఓపెనర్ షఫాలీ వర్మ కూడా కీలకంగా నిలిచింది. ఈ ఇద్దరూ డీసీలోనే ఉండడం జట్టుకు సానుకూలాంశం. అలాగే శ్రీలంకతో ఇటీవల జరిగిన టీ20 సిరీస్‌లో ఈ ద్వయం ఫామ్‌ను చాటుకున్నారు. అలాగే షఫాలీకి తోడు మరో ఓపెనర్ లారా వోల్వార్ట్ పవర్‌ప్లేలో వేగంగా ఆడే సత్తావుంది. మారిజానా కాప్‌తో పాటు పేస్ ఆల్‌రౌండర్ చినెల్లె హెన్రీ చివర్లో భారీ షాట్లు ఆడగలదు. 16 ఏళ్ల బ్యాటర్ దియా యాదవ్ ఈసారి అందరి దృష్టిని ఆకర్షించనుంది. అంతేకాకుండా స్పిన్నర్ శ్రీచరణి మధ్య ఓవర్లలో రన్స్‌ను కట్టడి చేయడంతో పాటు వికెట్లు తీయగలగడం జట్టుకు లాభించేదే.

సదర్లాండ్ దూరం: వ్యక్తిగత కారణాలతో ఈ సీజన్‌కు ఆల్‌రౌండర్ సదర్లాండ్ దూరం కావడం డీసీకి గట్టి దెబ్బే. రూ.2.2 కోట్లతో ఈసారి తనను జట్టు రిటైన్ చేసుకుంది. అలాగే గతేడాది సదర్లాండ్ ఏడు వికెట్లు తీసి జట్టును ఫైనల్‌కు చేర్చగలిగింది. తన స్థానంలో ఆసీస్‌కే చెందిన స్పిన్నర్ అలానా కింగ్‌ను తీసుకున్నారు. అలాగే జట్టు విదేశీ పేసర్లపైనే అతిగా ఆధారపడింది. ఒకవేళ సీనియర్లు గాయపడితే జట్టులోని దేశవాళీ ఆటగాళ్లు ఒత్తిడిని తట్టుకుని ప్రభావం చూపడం కష్టమే.

ఢిల్లీ జట్టు షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థి	వేదిక
జనవరి 10	ముంబై	నవీ ముంబై
జనవరి 11	గుజరాత్	నవీ ముంబై
జనవరి 14	యూపీ	నవీ ముంబై
జనవరి 17	బెంగళూరు	నవీ ముంబై
జనవరి 20	ముంబై	వడోదర
జనవరి 24	బెంగళూరు	వడోదర
జనవరి 27	గుజరాత్	వడోదర
ఫిబ్రవరి 1	యూపీ	వడోదర

ప్రపంచ కప్ తర్వాత వన్డేలు ఉండవేమో ?

అశ్విన్ ఆందోళన



చెన్నై: వన్డేల భవితవ్యంపై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర ఆందోళన వ్యక్తంజేశాడు. 2027 వరల్డ్ కప్ తర్వాత అసలు 50 ఓవర్ల ఫార్మాట్ జరగకపోవచ్చునేమోనని అన్నాడు. అంతేకాదు భారత స్టార్ బ్యాటర్లు కోహ్లీ, రోహిత్ ఆ మెగా టోర్నీ తర్వాత రిటైర్ అయితే వన్డేలపై అభిమానులకు ఆసక్తి తగ్గిపోతుందని అభిప్రాయపడ్డాడు. టీ20 లీగ్‌ల ఆధిపత్యం, టెస్ట్ క్రికెట్‌కు క్రమంగా ఆదరణ పెరుగుతుండడం వన్డేల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయని వివరించాడు. '2027 ప్రపంచ కప్ అనంతరం వన్డేలు కొనసాగడం అనుమానంగానే ఉంద'ని ఓ యూట్యూబ్ చానెల్ ఇంటర్వ్యూలో అశ్విన్ చెప్పాడు.

వరుస పెట్టి ప్రపంచ కప్‌లా?

ఒకదాని వెంట ఒకటి జరుగుతున్న వరల్డ్ కప్‌ల వల్ల కూడా వన్డేలపై ఫ్యాన్స్‌కు ఆసక్తి తగ్గిపోతోందని అశ్విన్ పేర్కొన్నాడు. 'ఆదాయం కోసం ప్రతి ఏటా వరల్డ్ కప్‌లను షెడ్యూల్ చేస్తున్నారు. 2025లో చాంపియన్స్ ట్రోఫీ జరిగింది. మహిళల వన్డే వరల్డ్ కప్‌ను నిర్వహించారు. 2026లో పురుషులు, మహిళల టీ20 వరల్డ్ కప్‌లు జరుగుతున్నాయి. కానీ ఫిఫాను చూడండి. ప్రపంచ కప్‌ను నాలుగేళ్లకోసారి జరుపుతోంది. అందుకే ఫిఫా వరల్డ్ కప్‌నకు అంత ప్రత్యేకత ఉంటోంది. కానీ క్రికెట్‌లో ఎన్నో ద్వైపాక్షిక సిరీస్‌లు, ఎన్నో ఫార్మాట్‌లు, లెక్కలేనని ప్రపంచ కప్‌లు. ఇవన్నీ ఆటపై అభిమానుల ఆసక్తిని చంపేస్తున్నాయి' అని అశ్విన్ వివరించాడు.

ఫిడేపై క్రామ్నిక్ పరువునష్టం దావా



న్యూఢిల్లీ: వివాదాస్పద రష్యన్ గ్రాండ్ మాస్టర్ వ్లాదిమిర్ క్రామ్నిక్.. అంతర్జాతీయ చెస్ సమాఖ్య ఫిడేపై పరువునష్టం దావా వేశాడు. లాసన్నేలోని స్విస్ సివిల్ కోర్టులో అతడు కేసు దాఖలు చేశాడు. అమెరికా జీఎం డేనియల్ నరోడిట్‌స్కీ హఠాన్మరణం తర్వాత క్రామ్నిక్ చెస్ ఆటగాళ్లపై పలు కామెంట్లు చేశాడు. ఆన్‌లైన్ టోర్నీలో మోసాలకు పాల్పడుతున్నారంటూ పలుమార్లు ఆరోపణలు కూడా చేశాడు. అతడి తీరుతో అనేక మంది ప్లేయర్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. ఈ క్రమంలో క్రామ్నిక్‌పై చర్యలు తీసుకోవాలని వేలాది మంది సంతకాలతో ఫిర్యాదులు కూడా వచ్చాయి. గతేడాది నవంబరులో క్రామ్నిక్‌పై ఫిడే అధికారికంగా ఫిర్యాదును నమోదు చేసింది. దీనికి కౌంటర్‌గా తనను అప్రతిష్ఠపాల్జేస్తున్నారని ఆరోపిస్తూ క్రామ్నిక్ సివిల్ కేసు వేశాడు.

పాక్షికంగా అమల్లోకి కేంద్ర క్రీడా చట్టం

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఆమోదించిన నూతన జాతీయ క్రీడా పాలన చట్టం గురువారం నుంచి పాక్షికంగా అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం జాతీయ క్రీడా బోర్డు (ఎన్‌సీబీ), క్రీడలకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ చట్టం నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర క్రీడా సంఘాలు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, కొన్ని సాంకేతిక కారణాల వల్ల చట్టం పూర్తిస్థాయిలో అమలు కావడానికి మరికొన్ని నెలలు పట్టనుంది.

ఆటో రికార్డు స్పీడ్



- 2025లో 45.5 లక్షల కార్ల విక్రయం
- జీఎస్‌టీ తగ్గింపుతో ద్వితీయార్ధంలో పోటెత్తిన అమ్మకాలు

న్యూఢిల్లీ: దేశంలో ఆటో రంగం హైస్పీడ్‌లో దూసుకుపోయింది. 2025 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 45.5 లక్షల కార్లు టోకున అమ్ముడుపోయాయి. ఇది ఒక కొత్త రికార్డు. 2024 సంవత్సరంలో విక్రయించిన 43.05 లక్షల కార్లతో పోల్చితే అమ్మకాల్లో ఆరు శాతం వృద్ధి నమోదయింది. ఏడాది ప్రారంభంలో ఆటో రంగం మందకొడిగానే సాగినప్పటికీ ద్వితీయార్ధంలో జీఎస్‌టీ 2.0 సంస్కరణల్లో భాగంగా కార్లపై సుంకాలు తగ్గించడం అమ్మకాల జోరును పెంచింది. కార్ల తయారీలో అగ్రగామి మారుతి సుజుకీ ఇండియా రికార్డు స్థాయిలో అమ్మకాలు సాగించడం, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్, స్కోడా ఆటో కంపెనీలు కూడా రికార్డు స్థాయిలో అమ్మకాలు నమోదు చేయడం కార్ల మార్కెట్లో జోరును పెంచింది. దీర్ఘకాలంగా అమ్మకాల్లో ద్వితీయ స్థానంలో ఉన్న హ్యూండయ్ మోటార్ ఇండియాను నాలుగో స్థానానికి నెట్టి మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ రెండు, మూడు స్థానాలను ఆక్రమించాయి. మొత్తం అమ్మకాల్లో 55.8% వాటాతో ఎస్‌యూవీలు అగ్రస్థానంలో ఉండగా జీఎస్‌టీ ఉత్తేజంతో చిన్న కార్ల అమ్మకాలు పెరిగాయి.

మారుతి కొత్త రికార్డు

దేశీయ ఆటో దిగ్గజం మారుతి సుజుకీ 18.44 లక్షల కార్లు విక్రయించింది. 2014 సంవత్సరంలో విక్రయించిన 17.90 కార్ల రికార్డును బ్రేక్ చేసింది. జీఎస్‌టీ తగ్గింపు, రూ.12 లక్షల వరకు వార్షికాదాయంపై ఆదాయపు పన్ను తగ్గింప, రెపోరేటు కోతలు అమ్మకాలకు ఉత్తేజం ఇచ్చాయని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. రుతుపవనాలు కూడా ప్రోత్సాహకరంగా ఉన్నట్టయితే ఈ ఏడాది 6-7 శాతం వృద్ధిని నమోదు చేయడం ఖాయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా ముందు ఏడాది డిసెంబర్‌తో పోల్చితే 2025 డిసెంబర్‌లో 22.21% వృద్ధితో 2,17,854 కార్లు విక్రయించినట్టు కంపెనీ తెలిపింది.

టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్: వరుసగా ఐదో సంవత్సరం సైతం తాము అమ్మకాల్లో రికార్డును నమోదు చేశామని కంపెనీ ఎండీ, సీఈఓ శైలేశ్ చంద్ర ప్రకటించారు. ప్రధానంగా ఎస్‌యూవీలకు కస్టమర్ల ప్రాధాన్యత పెరిగిందని, దీనికి తోడు స్వచ్ఛమైన, కాలుష్య రహిత కార్ల కొనుగోలుకు వారు మొగ్గు చూపుతున్నారని ఆయన చెప్పారు. ఏడాది మొత్తం మీద తాము 5,87,218 కార్లు విక్రయించామని, అందులో 81,125 ఈవీలు కూడా ఉన్నాయని, ఈవీ విక్రయాల్లో కూడా రికార్డును నమోదు చేశామని ఆయన వెల్లడించారు.

వివిధ కంపెనీల దేశీయ అమ్మకాలు ఇలా ఉన్నాయి...

- మహీంద్రా అండ్ మహీంద్రా ఎగుమతులు సహా డిసెంబర్ నెల అమ్మకాల్లో 25% వృద్ధిని నమోదు చేసింది. మొత్తం 86,090 కార్లు విక్రయించింది. దేశీయంగా 23% వృద్ధితో 50,946 కార్లు విక్రయించింది.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ 33% వృద్ధితో 39,333 కార్లు విక్రయించింది. దేశీయ అమ్మకాలు 34,157గా నమోదయ్యాయి.
- స్కోడా ఆటో ఇండియా 2025 సంవత్సరంలో రెండింతలు వృద్ధితో 72,665 కార్లు విక్రయించింది. 2024 అమ్మకాలు 35,166 యూనిట్లున్నాయి.
- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా 2025 సంవత్సరంలో 19% వృద్ధితో 70,554 కార్లు విక్రయించింది. డిసెంబర్ విక్రయాలు 6,500.
- కియా ఇండియా డిసెంబర్ నెలలో 18,659 కార్లు విక్రయించింది. 2024 డిసెంబర్‌లో విక్రయించిన 8,957 కార్లతో పోల్చితే అమ్మకాల్లో రెండింతలు వృద్ధి నమోదయింది.
- ఆడి ఇండియా 2025 సంవత్సరంలో 4,510 కార్లు విక్రయించింది.
- రెనో ఇండియా డిసెంబర్ నెలలో 33.4% వృద్ధితో 3,845 యూనిట్లు విక్రయించింది.
- అశోక్ లేలాండ్ వాణిజ్య వాహన విక్రయాలు డిసెంబర్‌లో 27% పెరిగి 21,533గా నమోదయ్యాయి. దేశీయ అమ్మకాలు 26% వృద్ధితో 19,855కి చేరాయి.

చిన్న కార్ల ధర పెంపుపై పరిశీలిస్తాం

మారుతి సుజుకీ చిన్న కార్ల ధర పెంపు విషయం పరిశీలించనున్నట్టు ప్రకటించింది. గత ఏడాది జీఎస్‌టీ తగ్గింపు సమయంలో జీఎస్‌టీ ప్రయోజనాన్ని మించి ధర తగ్గించామని బెనర్జీ అన్నారు. ఇప్పుడు జీఎస్‌టీ తగ్గింపు ఎంత శాతం ఉందో అంత మేరకే కార్ల ధర తగ్గింపును పరిమితం చేసేలా ధరలను సవరించాలా, వద్దా అన్నది పరిశీలించాలనుకుంటున్నట్టు ఆయన చెప్పారు. అలాగే తమ దగ్గర ఒకటిన్నర నెలలకు పైగా బుకింగ్‌లు పెండింగ్‌లో ఉన్నాయంటూ ముందుగా కార్లు బుక్ చేసుకున్న కస్టమర్లకు కూడా డిసెంబర్ 31 వరకు అమలులో ఉన్న ధరలనే వర్తింపచేయాలా, కొత్త ధరలు వసూలు చేయాలా అన్నది కూడా త్వరలో నిర్ణయిస్తామన్నారు.

- హీరో మోటో కార్ప్ డిసెంబర్ విక్రయాల్లో 40% వృద్ధిని ప్రకటించింది. మొత్తం 4,56,479 వాహనాలు విక్రయించింది. వీటిలో దేశీయ అమ్మకాలు 4,19,243 యూనిట్లున్నాయి.
- టీవీఎస్ మోటార్ కంపెనీ 50% వృద్ధితో 4,81,389 వాహనాలు విక్రయించింది. టూ వీలర్ విక్రయాల్లో 48% వృద్ధి నమోదయింది.

బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,35,060 ▼	1,23,800 ▼	2,56,000 ▼
విజయవాడ	1,37,000 ▼	1,27,000 ▼	2,37,000 ▼
విశాఖపట్నం	1,37,520 ▲	1,24,550 ▼	2,56,000 ▼
రాజమండ్రి	1,35,050 ▼	1,23,800 ▼	2,25,000 ▼
ప్రొద్దుటూరు	1,37,300 ▼	1,26,320 ▼	2,37,000 ▲
ముంబై	1,33,461 ▲	1,22,250 ▲	2,29,250 ▼

జీఆర్‌టీ సంక్రాంతి ఆఫర్లు

స్వర్ణ సంక్రాంతి పేరుతో రెడీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ ఆభరణాల సంస్థ సంక్రాంతి పండగ కోసం ప్రత్యేక ఆఫర్లతో సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో 'స్వర్ణ సంక్రాంతి' పేరుతో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. తమిళనాడులో 'పోన్ పొంగల్' పేరుతో, సింగపూర్‌లో 'గోల్డెన్ ఫెస్టివల్' పేరుతో ఈ ఆఫర్లు లభిస్తాయి. ఈ ఆఫర్ల కింద బంగారు ఆభరణాల వేస్టేజిపై (వీఏ) 20% వరకు.. డైమండ్, అన్‌కట్ వజ్రాభరణాలపై డైమండ్ విలువలో 25% వరకు తగ్గింపు లభిస్తుంది. అయితే సాలిటైర్లపై మాత్రం ఈ తగ్గింపు లభించదు. అలాగే వెండి వస్తువుల వేస్టేజిపై 25% వరకు, వెండి ఆభరణాల గరిష్ఠ ధరపై 10% వరకు తగ్గింపు లభిస్తుంది. ప్లాటినం ఆభరణాల తయారీ ఛార్జీల పైనా 30% తగ్గింపు లభిస్తుందని కంపెనీ తెలిపింది. దక్షిణ భారత్‌లో తమకు ఉన్న 65 షోరూమ్‌లు, సింగపూర్‌లో ఉన్న ఒక షోరూమ్‌లో ఈ ఆఫర్లు లభిస్తాయని జీఆర్‌టీ జువెలర్స్ తెలిపింది.

ఫ్లాట్‌గా ముగిసిన సెన్సెక్స్

ముంబై: కొత్త ఏడాది తొలి రోజే దేశీయ స్టాక్ మార్కెట్ మదుపరులను నిరాశ పరిచింది. సెన్సెక్స్ 32 పాయింట్లు నష్టపోయి 85,188.60 వద్ద ముగిసింది. ఉదయం లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్ ట్రేడింగ్ చివర్లో సిగరెట్ కంపెనీలు, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లలో అమ్మకాల హోరుతో నీరసించింది. అయినా నిఫ్టీ 50 మాత్రం 16.95 పాయింట్ల లాభంతో 26,146.55 వద్ద ముగిసింది. అమ్మకందారులు, కొనుగోలుదారులు ఇంకా హాలీడే మూడ్‌లో ఉండడంతో లావాదేవీల సంఖ్య భారీగా పడిపోయింది.

'సిగరెట్' షేర్లు ఢమాల్: ఫిబ్రవరి 1 నుంచి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం భారీగా పెంచబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఐటీసీ, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. ఐటీసీ కంపెనీ షేర్లు 9.69% నష్టపోయి రూ.363.95 వద్ద ముగిశాయి. దీంతో ఐటీసీ మార్కెట్ క్యాప్ గురువారం ఒక్క రోజే రూ.50,000 కోట్లు తుడిచి పెట్టుకు పోయింది. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ కంపెనీ షేర్లయితే ఒక దశలో 19.24% నష్టపోయి 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.2,230.15ని తాకింది. చివరికి 17.09% నష్టంతో రూ.2,289.65 వద్ద ముగిసింది. ఈ రెండు కౌంటర్లలో మరికొద్ది రోజుల పాటు ఈ దిద్దుబాటు తప్పదని బ్రోకరేజి సంస్థలు చెబుతున్నాయి.

ఒలెక్ట్రా కొత్త ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం

హైదరాబాద్ సమీపంలోని సీతారాంపూర్‌లో నిర్మించిన కొత్త ప్లాంట్‌లో విద్యుత్ బస్సుల తయారీని ప్రారంభించినట్టు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ప్రకటించింది. తొలి దశలో ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2,500 బస్సులని, ఇది ప్లాంట్ మొత్తం సామర్థ్యంలో 50 శాతంతో సమానమని కంపెనీ రెగ్యులేటరీ సంస్థలకు పంపిన ప్రకటనలో తెలిపింది. ఈ ప్లాంట్ పూర్తిగా ఉత్పత్తి ప్రారంభించినట్టయితే మొత్తం సామర్థ్యం 5 వేలకు పెరుగుతుందని పేర్కొంది.

హ్యుండయ్‌కు తొలి భారతీయ బాస్

ఏండీ, సీఈఓగా బాధ్యలు చేపట్టిన తరుణ్ గార్గ్

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) నూతన మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా తరుణ్ గార్గ్ గురువారం అధికార బాధ్యతలు చేపట్టారు. 29 ఏళ్ల కంపెనీ ప్రస్థానంలో ఒక భారతీయుడు సంస్థకు సారథ్యం వహించడం ఇదే తొలిసారి.

జీఎస్‌టీ వసూళ్లు రయ్ రయ్

రూ.1.74 లక్షల కోట్లకు చేరిక


న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్లు గత సెప్టెంబరులో తగ్గించినా, ఆ ప్రభావం పన్ను వసూళ్లపై ఏ మాత్రం కనిపించడం లేదు. డిసెంబర్ నెలలో దేశ వ్యాప్తంగా రూ.1,74,550 కోట్లు జీఎస్‌టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరాయి. 2024 డిసెంబర్‌లో నమోదైన రూ.1.64 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 6.1% ఎక్కువ.

తెలంగాణాలో డీలా : డిసెంబర్ నెలలో తెలంగాణలో జీఎస్‌టీ వసూళ్లు నీరసించాయి. 2024 డిసెంబర్ లో రూ.1,817 కోట్లుగా ఉన్న వసూళ్లు ఈ డిసెంబరులో మూడు శాతం తగ్గి రూ.1,762 కోట్లకు పడిపోయాయి.

అరబిందో చేతికి ఖండేల్వాల్ నాన్ కేన్సర్ ఫార్ములేషన్ల బిజినెస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక అరబిందో ఫార్మా దేశీయ ఫార్ములేషన్స్ మార్కెట్‌లో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా మహారాష్ట్ర కేంద్రంగా పనిచేసే ఖండేల్వాల్ లాబొరేటరీస్ నాన్ కేన్సర్ ఫార్ములేషన్ల వ్యాపారాన్ని రూ.325 కోట్లకు కొనుగోలు చేసింది. తన అనుబంధ సంస్థ అరో ఫార్మా లిమిటెడ్ ద్వారా ఈ కొనుగోలు జరిపింది. గురువారం నుంచే ఈ కొనుగోలు అమల్లోకి వచ్చినట్టు కంపెనీ తెలిపింది. ఈ కొనుగోలుతో దేశీయ పెయిన్ మేనేజ్‌మెంట్, యాంటీ ఇన్‌ఫెక్టివ్ ఫార్ములేషన్ల మార్కెట్‌లో తమ స్థానం మరింత పటిష్ఠమవుతుందని పేర్కొంది. ఖండేల్వాల్ లాబొరేటరీస్ దేశీయ ఫార్ములేషన్స్ మార్కెట్‌లో 23 బ్రాండెడ్ ఔషధాలు ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	630	విజయవాడ	660
వరంగల్	632	గోదావరి	625
చిత్తూరు	703	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	విజయవాడ	147
వరంగల్	150	గుంటూరు	152
కరీంనగర్	150	ఒంగోలు	152
మహబూబ్‌నగర్	150	చిత్తూరు	148
కర్నూలు	150	నెల్లూరు	153
విశాఖపట్నం	133	అనంతపురం	153
గోదావరి	147		

అవాన్స్ టెక్నాలజీస్ చేతికి హైదరాబాద్ కంపెనీ

హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న పుష్పక్ ఏఐ కంపెనీలో నూరు శాతం వాటాల కొనుగోలుకు అవాన్స్ టెక్నాలజీస్ ఒక ఒప్పందంపై సంతకాలు చేసింది. పుష్పక్ ఏఐ కొనుగోలుతో అవాన్స్ టెక్నాలజీస్ అధిక వృద్ధి అవకాశాలున్న విజువల్ ఇంటెలిజెన్స్, ఎడ్జ్ ఏఐ విభాగాల్లో అడుగు పెట్టే అవకాశం ఏర్పడుతుంది. ఈ కొనుగోలుతో పుష్పక్ ఏఐపై అవాన్స్ టెక్నాలజీస్ పూర్తి వ్యూహాత్మక, నిర్వహణాపరమైన అదుపు సాధించగలుగుతుందని అంటున్నారు. పుష్పక్ ఏఐకి ఆటోమోటివ్, ఇన్‌ఫ్రా, తయారీ, స్మార్ట్ సిటీ, లాజిస్టిక్స్, ఆర్థిక సర్వీసుల రంగాల్లో క్లయింట్లున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 2 జనవరి 2026



ప్రతిరోజూ పండుగే!

కోరికల జాబితా, తీర్మానాలు, సాధించాల్సిన లక్ష్యాలు లేదా నెరవేర్చుకోవాల్సిన ఆశలు... కొత్త సంవత్సరానికి సంబంధించి ప్రజలు సాధారణంగా ఆలోచించే అంశాలు. కానీ ఈ ఏడాది ఆ దృక్పథాన్ని మార్చుకోవాలనేది నా ఆకాంక్ష. మీరు ప్రపంచం కోసం జీవిస్తే... అది ప్రపంచానికి అదృష్టం అవుతుంది. కాలం మీ ఉనికిని వేడుక చేసుకోవాలి. మీరు ఎప్పటిలా చిరునవ్వుతో ఉండాలి.

పేదలు ఏడాదికి ఒక రోజును కొత్త సంవత్సరంగా వేడుక చేసుకోవచ్చు. ధనవంతుడికి ప్రతి రోజూ వేడుక. కానీ అత్యంత ధనవంతుడు ప్రతి క్షణాన్నీ వేడుకగా జరుపుకొంటాడు. ఇక్కడ ధనం అంటే భౌతిక సంపద కాదు. అవగాహన అనే సంపద. ప్రతి క్షణంలో పూర్తిగా ఉండే సమృద్ధి. అది మీకు ఉంటే ప్రతి క్షణాన్నీ వేడుక చేసుకుంటారు. సృష్టికర్తతో మమేకం అవుతారు. 'మంచి రోజులు ఎప్పుడు వస్తాయి?' అని నిరంతరం ఎదురుచూస్తే... కాలం నెమ్మదిగా సాగుతున్నట్టు అనిపిస్తుంది. కానీ మీరు ఆధ్యాత్మిక మార్గంలో ఉంటే కాలం వేగంగా గడుస్తున్నట్టు అనిపిస్తుంది. స్వచ్ఛమైన హృదయం, నిశితమైన మనస్సు ఏ సమయాన్నైనా మంచి సమయంగా మార్చగలవు. అంటే కాలాన్ని మార్చి, దాన్ని మెరుగుపరిచే సామర్థ్యం మీలో ఉంది. ఈ కొత్త సంవత్సరం ముగిసిపోయేలోగా... ఆనందాన్ని పొందడానికే కాదు... గడచిన కాలాన్ని సమీక్షించడానికి కూడా సమయం కేటాయించండి. ఒక గంట సమయం తీసుకొని, గత వారం గురించి ఆలోచించండి. మీలో ఎదుగుదల ఏమిటి? మీరు ఏం చేశారు? ఏం సాధించారు? మీ చుట్టూ ఉన్న వారికి ఎంతవరకూ ఉపయోగించారు? గడచిన ఏడాది మీకు ఏ పాఠాలు నేర్పింది? ఇవన్నీ సమీక్షించుకోండి.

జ్ఞానంలో గడపండి

గత ఏడాది ఏం చేయాలో, ఏం చేయకూడదో మీకు తెలియజేసింది. మంచి సంఘటనలు, చెడు సంఘటనలు... ఈ రెండూ మీకు ఏదో ఒకటి నేర్పాయి. మళ్ళీ ఏం చేయాలో, ఆ పనులను ఎలా మెరుగుపరుచుకోవచ్చో మంచి సంఘటనలు చూపించాయి. దేన్ని నివారించుకోవాలో చెడు సంఘటనలు హెచ్చరించాయి. అంటే తప్పిదాలు కూడా మీ జీవితానికి దారి చూపించాయి. అంటే... మొత్తం ప్రపంచమే మీ మిత్రుడు, గురువు. మీరు శత్రువులుగా భావించేవారు కూడా మీ మిత్రులే. మీరు జాగ్రత్తగా ఉండాల్సిన విషయాలను వారు గుర్తు చేశారు. మీలోని సామర్థ్యాలను వెలికి తీశారు. గత సంవత్సరాన్ని ఒక పుష్పంగా దైవానికి అర్పించండి. గత ఏడాది నేర్పిన పాఠాలను మాత్రమే స్వీకరించి, పశ్చాత్తాపం, కోపం, ఒత్తిడి లేకుండా ముందుకు సాగండి. మన కోరికలకు, కార్యాలకు జ్ఞానం నుంచి మద్దతు లభిస్తే... జీవితంలో సుఖం, ఆనందం మిగులుతాయి. జ్ఞానం లేకపోతే మన ఆకాంక్షలు బలహీనపడతాయి. ప్రణాళికలు సాధారణంగా మారతాయి. మనపైన అనిశ్చితి కమ్ముకుంటుంది. కాబట్టి జ్ఞానంలో సమయాన్ని గడపండి. అప్పుడు మీరు చేసే పనులు, ప్రణాళికలు బలపడతాయి. మరింత ప్రభావవంతం అవుతాయి. ధ్యానం, జ్ఞానం ద్వారా మూలంతో అనుసంధానమైనప్పుడు... జీవితం నిరంతరం పండుగలా మారుతుంది.




శ్రీశ్రీ రవిశంకర్
'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకుడు

తెలుసుకుందాం

విలక్షణం... దివ్య సుందరం

అర్చామూర్తిని... అంటే విగ్రహరూపంలో ఉన్న భగవంతుణ్ణి ఆరాధించి, మోక్షాన్ని పొందిన భక్తుల చరిత్రలు ఎన్నో ఉన్నాయి. వాటిలో శ్రీగోదాదేవి కథ ప్రసిద్ధమైనది. స్వామి అనుగ్రహంకోసం ఆమె ఆచరించి, లోకానికి అనుగ్రహించిన తిరుప్పావై వ్రతం ఎంతో సులభతరమైనది. మనల్ని రక్షించడానికి వచ్చిన అమ్మ కాబట్టి ఆమెను 'ఆండాళ్' అనీ, తాను ధరించిన మాలలను భగవంతుడికి అర్పించినది కాబట్టి 'చూడికుడుత్త నాచ్చియార్' అనీ పిలుస్తారు. అయోనిజగా భూమిపై అవతరించిన గోదాదేవి దివ్యరూపం బహు సుందరమైనది. అది ద్వాపరయుగంలో శ్రీకృష్ణుణ్ణి సేవించిన గోపికల్లా ఉంటుంది.



ఆళ్వారుల్లో ఒకరైనప్పటికీ...

శిల్పశాస్త్రం ప్రకారం భగవంతుడి ప్రతిమలను సాధారణంగా 'ఉత్తమ దశ తాళ' పద్ధతిలో, దేవేరులను 'మధ్యమ దశ తాళ' పద్ధతిలో నిర్మిస్తారు. శ్రీగోదాదేవి సామాన్యమైన మనుష్య రూపంలో అవతరించింది. తన అనన్యమైన భక్తితో భగవంతుణ్ణి సేవించి, ఆయనే పతిగా ఆరాధించి, వివాహమాడి, ఆయనలో లీనమైపోయింది. ఆమె పన్నిద్దరు ఆళ్వారుల్లో ఒకరు అయినప్పటికీ... భగవంతుని సారూప్య స్థితిని పొందింది. కనుక గోదాదేవి విగ్రహం చేసేటప్పుడు... ఆగమోక్తంగా దేవేరులను చేసినట్టే... 'మధ్యమ తాళ' పద్ధతిలో నిర్మించాలని శిల్ప శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయి. కాగా, మరో విధానం ప్రకారం భక్త ప్రతిమలను, ఆండాళ్‌తో సహా పన్నిద్దరు ఆళ్వారుల విగ్రహాలను 'ఉత్తమ అష్ట తాళ' పద్ధతిలో చేయాలని 'విష్ణు తత్వం' అనే గ్రంథం చెప్పింది.

చేతిలో చిలుక

శ్రీగోదాదేవి రూపం ఎంతో విలక్షణమైనది. ఆమె జన్మస్థానమైన శ్రీవిల్లిపుత్తూరులో ఉన్న ఆండాళ్ విగ్రహంలో... తన ఎడమ చేతిలో చిలుకను ధరించి ఉంటుంది. కుడి చేతిని డోల హస్తంగా (ఊయలలా ఊగుతున్న భంగిమలో) ఉంచుతుంది. చిలుక వేదానికి, జ్ఞానానికి, భక్తికి, ప్రేమకు ప్రతీక. మనుషుల్లా మాటలు పలుకగలిగే ఏకైక పక్షి చిలుక. అందుకే శ్రీరంగమన్నార్ స్వామివారి కుడివైపున గోదాదేవి నిలబడి, తన ఎడమ చేతిలో చిలుకను ధరించి, శ్రీవారిపై తన ప్రేమను ప్రకటిస్తూ ఉంటుంది. అయితే శ్రీరంగ క్షేత్రంలో మాత్రం విలక్షణంగా... శ్రీరంగనాథుని ఎడమవైపు సన్నిధిలో వేంచేసి ఉండే గోదాదేవి... తన కుడిచేతితో చిలుకను పట్టుకొని, ఎడమ చేతిని డోల హస్తంగా ఉంచుతుంది.

ఆండాళ్ కొప్పు

గోదాదేవి తలపై అందమైన కొప్పు ఉంటుంది. ఇది దేవీ ప్రతిమలకు నిర్దేశితమైన ఒక ప్రత్యేకమైన తలముడి. తలమీద అందంగా... తామరపువ్వు మొగ్గలా అమర్చి ఉండే 'కుంతలం' అనే ఈ అలంకారం... తలకు మధ్యలో కానీ, పక్క భాగంలో కానీ ఉండవచ్చు. ఇటువంటి కొప్పు ముడి బాలకృష్ణుని విగ్రహానికి, నమ్మాళ్వార్ విగ్రహానికి అలంకరించి ఉండడం గమనించవచ్చు. అలాగే శ్రీకృష్ణుని దేవేరులైన రుక్మిణి, సత్యభామలకు కూడా దీన్ని అలంకరింపజేయడం ఒక విధానం. కానీ అది 'ఆండాళ్ కొప్పు'గానే ప్రసిద్ధి చెందింది. కొన్నిచోట్ల గోదాదేవి విగ్రహానికి అంతర్గతంగానే పుష్పమాలిక ఉంటుంది. చాలా దివ్య దేశాల్లో విడిగా అలంకరిస్తారు.



డి.యన్.వి. ప్రసాద్, స్థపతి, 9440525788

భగవద్గీత



అర్జునుడిది పాపభీతా? భయమా?

తనకు అత్యంత ఇష్టుడైన అర్జునుడు 'నా చేతుల్తో ఇంతమందిని చంపాలా?' అని తీవ్రమైన మానసిక సంఘర్షణకు లోనై, "చేతులు వణుకుతున్నాయి కృష్ణా!" అంటూ ఉంటే... ఓదార్చి, ధైర్యం చెప్పి, మార్గం చూపాల్సిన కృష్ణుడు కిసుక్కున నవ్వడం ఏమిటి? అంతటి ఉద్విగ్నమైన సన్నివేశంలో అసలు ఎందుకు నవ్వాలని అనిపించింది?

అప్పటికే అర్జునుడి విషాదయోగం అంతటినీ నిశ్శబ్దంగా విన్నాడు కృష్ణుడు. నీలాంటి గొప్పవారికి ఇలాంటి కుంగుబాటు రాకూడదని కూడా మందలించాడు.

క్లైబ్యం మాస్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప

"ఇది నీకు సరికాదు అర్జునా... పిరికితనాన్ని దగ్గరకు రానివ్వకు. యుద్ధానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఇవేం మాటలు"? అంటూ... "ఇదేమీ వేదాంతం కాదు... పిరికితనం"అని కూడా అన్నాడు.

ఉన్నది అదొక్కటే

1897లో.. కలకత్తాలోని అలంబజారులో ఉన్న రామకృష్ణ మఠంలో స్వామి వివేకానంద ప్రతిరోజూ వేదాంతం గురించి యువకులకు పాఠాలు చెప్పేవారు. "నేను చేసేది పాపం కాదా! అన్న అర్జునుడికి ఈ శ్లోకంతో ధైర్యవచనాలు పలికాడు కృష్ణుడు. ఈ ఒక్క శ్లోకం చాలు... గీతాపారాయణం చేసిన ఫలం లభిస్తుంది. గీతాసందేశం అంతా ఈ ఒక్క శ్లోకంలోనే ఇమిడి ఉంది" అంటారు స్వామి వివేకానంద. 'నేను పాపిని. దేహదోషాపన్నుడిని, మనోవ్యధితుణ్ణి' అనే తలపే నిన్ను ముంచేస్తోంది. లోకంలో పాపం లేదు, దైన్యం లేదు, వ్యాధి లేదు, విషాదం లేదు. లోకంలో పాపం అనదగినది ఏదైనా ఉంటే అది భయం మాత్రమే. ఇక్కడ అర్జునుణ్ణి ఆవహించినది సత్వగుణ ప్రేరేపితమైన ధోరణి కాదు. ఇది తమోగుణ ప్రభావం. సత్వగుణ వేషంలో తనను అమర్చుకోవడం అంటే తమోగుణానికి ఎంతో ఇష్టం. అందుకే అర్జునుడిలోని తమోగుణం... వేదాంతం చెబుతున్నట్టు, సర్వసంగపరిత్యాగి, జ్ఞాని, పండితుడు మాట్లాడినట్టు బహిర్గతం అవుతోంది. అర్జునుడి యుద్ధ విముక్తి ఆలోచనకు కారణం... తమోగుణమైన భయం. ఆ భయాన్ని భక్తి ముసుగులో దాచి... "భీష్ముణ్ణి, ద్రోణుణ్ణి నేనెలా చంపగలను? వారిద్దరూ నాకు పూజ్యులు కదా!" అంటాడు అర్జునుడు. నిజానికి 'భీష్మ ద్రోణుల్ని నేను ఓడించగలనా?' అనేది అర్జునుడి భయం. 'ఎన్ని యుద్ధాలు చేసినా, ఎంతమందిని ఓడించినా... భీష్ముడు, ద్రోణుడు అరివీరభయంకరులు. సర్వాస్త్ర సంపన్నుడైన భీష్ముడు, సకల యుద్ధ విద్యలూ ఆపోశన పట్టిన ద్రోణాచార్యుడు నిజంగా నన్ను ఓడించాలనుకుంటే నేను తట్టుకోగలనా?'... ఈ భయం అర్జునుణ్ణి కంపింపజేసింది. దానికి 'పాపభీతి' అనే పేరు తగిలించుకున్నాడంతే!

గీత... హింసను ప్రేరేపిస్తోందా?

అందుకే కృష్ణుడికి నవ్వు వచ్చింది. 'నేను యుద్ధం గెలవలేనేమో' అనే భయం... అర్జునుడితో గొప్పగొప్ప మాటలు పలికించింది. "పెద్ద పండితుడిలా, మహాజ్ఞానిలా మాట్లాడుతున్నావే అర్జునా... బ్రతికి ఉన్నవాడి గురించి కానీ, మరణించినవాడి గురించి కానీ నిజంగా పండితులైనవారు అసలు బాధేపడరు" అంటూ మొదలుపెట్టాడు కృష్ణుడు. 'నేను యుద్ధం చేయను' అన్న అర్జునుణ్ణి యుద్ధోన్ముఖుడిగా చేయడం హింసను ప్రేరేపించడంగా భావించేవారు అనేకులు ఉన్నారు. ఒకప్పటి అమెరికా విదేశాంగ మంత్రి హెన్రీ కిసింజర్ ఆసియా మీద తాను రాసిన పుస్తకంలో ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. హింస నేను చేయలేనని అహింసావాదిగా మారబోతున్న అర్జునుణ్ణి హింసవైపు ప్రేరేపించిన 'భగవద్గీత' అనే భారతీయులు అధికంగా చదివే గ్రంథం... నిత్యం అహింసను బోధించే మహాత్మాగాంధీకి ప్రేరణ ఎలా అయిందో... బుర్ర ఎంత బద్దలుగొట్టుకున్నా కిసింజర్‌కు అర్థం కాలేదు.

మానవ జీవితానికి దిక్సూచి

మహాభారతంలోనే... అనుగీత, ఉద్ధవగీత కూడా శ్రీకృష్ణుడు చెప్పినవే. కానీ భగవద్గీత మొత్తం మానవ జీవితానికి ఒక దిక్సూచి లాంటిది. ఇది సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ఎవరి వ్యాఖ్యానం చదవాలి? మహాత్మాగాంధీ, బాలగంగాధర తిలక్, సర్వేపల్లి రాధాకృష్ణన్, రాజగోపాలాచారి లాంటి ఆనాటి నాయకులు రాసినవా? శంకరాచార్యుడు, రామానుజాచార్యుడు, మధ్వాచార్యుడు, స్వామి ప్రభుపాద లాంటి గురువులు రాసినవా? ఏది చదివితే సరిగ్గా కృష్ణుడు చెప్పిన విధంగా గీత మనకు అర్థమవుతుంది? ఈ ప్రశ్నకు కూడా కృష్ణుడే గీతలో సమాధానం చెప్పాడు. అది కూడా... మనందరికీ సులువుగా అర్థమయ్యేలా చెప్పాడు.

ప్రతి వ్యక్తి తన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కృష్ణుడు స్పష్టం చేశాడు. అంటే పరిస్థితులనుబట్టి నిర్ణయం తీసుకోవాల్సింది మనమే!



ఉండవల్లి అరుణ్‌కుమార్



నూతన సంవత్సరం సందర్భం అధికారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న సమాచార శాఖ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను ఉద్యోగులు అలవర్చుకోవాలని సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ సూచించారు. గురువారం విజయవాడలోని ఐ అండ్ పీఆర్ కమిషనరేట్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగులు ఎప్పటికప్పుడు ఏఐ, చాట్ జీపీటీ వంటి సాంకేతికతను అందిపుచ్చుకుంటే.. పనిలో వేగంతో పాటు నాణ్యత పెరుగుతుందన్నారు. కొత్త ప్రచార విధానాలను అమల్లోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ ఉన్నతాధికారులు స్వర్ణలత, కిరణ్ కుమార్, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఫైర్ 'ఎన్‌వోసీ'

- పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేలా సంస్కరణ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగానికి అనుకూల వాతావరణం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. అగ్నిమాపక నిరభ్యంతర పత్రం (ఫైర్ ఎన్‌వోసీ) జారీలో భాగంగా ఫైర్ సేఫ్టీ ఆడిట్లను గుర్తింపు పొందిన థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా నిర్వహించేందుకు అనుమతిస్తూ హోంశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. నేషనల్ బిల్డింగ్ కోడ్‌లోని పార్ట్-4 ప్రకారం తక్కువ ప్రమాద తీవ్రత కలిగిన చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ప్రతి రెండేళ్లకు ఒకసారి ఫైర్ ఎన్‌వోసీ రెన్యూవల్ చేసుకోవాలి. అగ్నిమాపక శాఖ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి రెన్యూవల్ చేస్తారు. ఈ క్రమంలో పారిశ్రామిక రంగానికి ఊతమిస్తూ.. కేంద్ర ప్రభుత్వం మేకిన్ ఇండియాకు ప్రోత్సాహకంగా కీలక సంస్కరణలు చేపట్టింది. అందులో మొదటిది చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ప్రమాద తీవ్రత తక్కువ ఉన్న వాటి ఫైర్ ఎన్‌వోసీ రెన్యూవల్ ప్రతి ఐదేళ్లకు ఒకసారి చేసుకొనేలా సంస్కరించింది.

7న గ్రూప్-1 క్రీడా కోటా ఇంటర్వ్యూలు

- పోస్టులకు నలుగురు అభ్యర్థుల ఎంపిక
- గ్రూప్-2లో అన్‌విల్లింగ్ ఆప్షన్: ఏపీపీఎస్సీ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల విడుదల అంశం కొలిక్కి వస్తోంది. గ్రూప్-2 నోటిఫికేషన్ రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను ఇటీవల హైకోర్టు కొట్టివేయడంతో గ్రూప్-1 ప్రక్రియను కూడా పూర్తి చేయాలని ఏపీపీఎస్సీ నిర్ణయించింది. రిజర్వేషన్లపై అస్పష్టతతో ఇప్పటి వరకూ నిలిపివేసిన క్రీడా కోటా ఇంటర్వ్యూలను ఈనెల 7న నిర్వహించనున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పోస్టులకు నలుగురు అభ్యర్థులను ఎంపిక చేసింది. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి అనంతరం ఫలితాలు విడుదల చేస్తారు. అలాగే గ్రూప్-2 ఉద్యోగం వద్దనుకొనేవారి కోసం అన్‌విల్లింగ్ ఆప్షన్ ఇచ్చినట్లు తెలిపింది. ఇప్పటికే ఇతర ఉద్యోగాలకు ఎంపికై, గ్రూప్-2 ఉద్యోగం వద్దనుకునే అభ్యర్థులు అన్‌విల్లింగ్ ఫారం(తప్పనిసరికాదు) సమర్పించాలని సూచించింది. దానివల్ల తర్వాతి మెరిట్ అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసే అవకాశం ఏర్పడుతుందని తెలిపింది. అలాగే సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో ఇచ్చిన పోస్టు ప్రాధాన్యతల్లో ఎలాంటి మార్పులూ ఉండబోవని వెల్లడించింది.

విద్యుత్ బస్సు.. ఎప్పుడు వచ్చు!



- ప్రకటనలకే పరిమితమైన ప్రగతి రథం
- రాష్ట్రంలో 11 నగరాలకు 750 కేటాయింపు.. అదనంగా మరో 300 కోసం కేంద్రానికి లేఖ
- 2029నాటికి మొత్తం 'ఈ-బస్సు'లేనని ప్రకటన
- 2025లో ఒక్క బస్సూ రాని వైనం
- ప్రస్తుత ఉన్న వాటిలో సగం కాలం చెల్లినవే
- క్రిస్మస్, సంక్రాంతికి తప్పని ఇబ్బందులు
- ముందస్తు ప్రణాళికలు చేయని అధికారులు
- చైర్మన్ సహా పాలకమండలి ఎవరిదారి వారిదే

డీజిల్ ఖర్చులు, వాయుకాలుష్యం తగ్గించే లక్ష్యంతో విద్యుత్ బస్సులు సమకూర్చుకునే దిశగా ఏపీఎస్ ఆర్టీసీ ఏడాదిన్నర నుంచి అడుగులు వేస్తూనే ఉంది. డీజిల్ బస్సులు పక్కన బెట్టి, విద్యుత్ బస్సులు సమకూర్చుకుంటామని అధికారులు చెబుతూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం 2029 నాటికి అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే ఉండేలా 'విద్యుత్ విధానం'లో స్పష్టం చేసింది.. అప్పటికి ఆర్టీసీలో 10,155, అద్దె బస్సులు 2,562 కలిపి మొత్తం 12,717 బస్సులు విద్యుత్‌వే ఉండాలని ప్రణాళిక సిద్ధం చేసింది. అయితే.. ప్రణాళికలు ఎలా ఉన్నా.. ప్రయత్నాలు మాత్రం సాకారమవుతాయా? అన్నది సందేహంగా మారింది!.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో విద్యుత్ బస్సుల వ్యవహారం ప్రకటనలకే పరిమితమవుతోంది. అన్ని ప్రధాన నగరాల్లో ఎలక్ట్రిక్(ఈవీ) బస్సులు నడపాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తొలి విడతలో 750 ఈవీ బస్సులు ఇస్తామని చెప్పింది. అయితే, ఇవి సరిపోవని.. తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాలకు అదనంగా మరో 300 బస్సులు కావాలని సీఎం చంద్రబాబు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. మరోవైపు 300 అద్దె బస్సులు కూడా విద్యుత్‌వే తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. ప్రధాన నగరాలైన విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలుతో పాటు అనంతపురం వంటి 11 నగరాలను ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఎంపిక చేశారు. స్వయంగా సీఎం చంద్రబాబు ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని చెప్పడంతో ప్రయాణికులు సంతోషంతో ఎదురు చూస్తున్నారు. 2024తో పాటు 2025 కూడా వెళ్లిపోయింది తప్ప విద్యుత్ బస్సులు మాత్రం ఆర్టీసీ డిపోలకు చేరలేదు. రాష్ట్రంలో రోజూ 40 లక్షల మందికి పైగా ప్రయాణికులను గమ్యం చేరుస్తున్న 10,500 ఏపీఎస్ఆర్టీసీ బస్సులు, మహిళలకు ఉచిత రవాణా సౌకర్యంతో 45 లక్షల మందికి పైగా ప్రయాణ సేవలు అందిస్తున్నాయి. వాటిలో అద్దె బస్సులు మినహాయిస్తే ఆర్టీసీ సొంత బస్సులు 8,275 ఉన్నాయి. అయితే, వీటిలో కాలం చెల్లినవి చాలానే ఉన్నాయి. 12 లక్షల కిలో మీటర్లు తిరిగిన బస్సులు 1,954(అక్టోబరు నాటికి), 15లక్షల కి.మీ. దాటినవి 2,626 బస్సులు ఉన్నాయి. అంటే మొత్తం 8,257 ఆర్టీసీ బస్సుల్లో పక్కన పెట్టాల్సినవి 4,580 వరకు ఉన్నాయని తెలుస్తోంది. రవాణా శాఖ మార్గదర్శకాలతో పాటు విద్యుత్ బస్సులు రాగానే 13 లక్షల కి.మీ. దాటిన సిటీ ఆర్డినరీ బస్సులు, 12 లక్షల కి.మీ. తిరిగిన ఏసీ బస్సు లు, పల్లె వెలుగు, 10లక్షల కి.మీ. దాటిన సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, 8 లక్షలు నడిచిన ఎక్స్‌ప్రెస్‌లు, మెట్రో సర్వీసులు, ఆరున్నర లక్షల కి.మీ. ప్రయాణించిన సప్తగిరి(తిరుమల ఘాట్) బస్సులు పక్కన బెట్టాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఎలక్ట్రిక్ బస్సుల రాక ఆలస్యంతో పాతవి పక్కన పెట్టలేక, డొక్కు బస్సులతో ప్రయాణ సేవలు అందించలేక యాజమాన్యం తర్జనభర్జన పడుతోంది. ఇందులో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే రవాణా మంత్రి సొంత జిల్లా(అన్నమయ్య)లోని బస్సుల్లోనే 45 శాతం బస్సులు డొక్కువి ఉండటం. రాష్ట్రంలో ఇటీవల ఎక్కువగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు డ్రైవర్లు, అధికారులను భయపెడుతున్నాయి.

పండగ సీజన్ గట్టెక్కేదెలా..

రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు హైదరాబాద్, బెంగళూరు నగరాల నుంచి సంక్రాంతికి లక్షలాది మంది ప్రజలు వస్తారు. ప్రతి ఏటా డిసెంబరు మూడో వారం నుంచి క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి నేపథ్యంలో వందలాది బస్సులు అదనంగా నడుపుతున్నారు. రాష్ట్రంలోని పలు డిపోల నుంచి హైదరాబాద్‌కు వేల సంఖ్యలో, బెంగళూరు, చెన్నై లాంటి నగరాలకు వందల సంఖ్యలో ప్రత్యేక సర్వీసులు నడుపుతారు. ఈ ఏడాది డిసెంబరు మూడో వారం గడిచి పోయినా అదనపు బస్సుల ఊసే వినిపించడం లేదు. రాష్ట్రంలోని ప్రతి డిపోలో కనీసం పది-20 బస్సుల వరకు అదనంగా అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే బస్సుల కొరత ఉంటే పొరుగు రాష్ట్రాలకు ప్రత్యేక సర్వీసులు నడపడం ఎలాగో అర్థం కావట్లేదని అంటున్నారు.

మళ్లీ ఇక్కట్లే: గత ఏడాది జనవరి రెండో వారంలో ఎక్కడికక్కడ బస్టాండ్లలో జనం ఆగిపోయారు. హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి ఏపీలోని విజయవాడ, గుంటూరు, ఏలూరు, కాకినాడ, విశాఖ, నెల్లూరు తదితర ప్రాంతాలకు ప్రయాణికులు చేరుకున్నా, ఇక్కడి నుంచి సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు చాలినన్ని బస్సులు లేక ఎక్కడికక్కడ బస్టాండ్లలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఈ పరిణామాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షించి హైదరాబాద్‌లో ఉన్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఆగమేఘాల మీద రప్పించి సమస్యను పరిష్కరించారు. ఇక, రానున్న సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు చేశారో వెల్లడించలేదు. దీంతో వచ్చే సంక్రాంతికి ఇక్కట్లు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది. గతఅనుభవంతో ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌లో ముందస్తు రిజర్వేషన్లు చేసుకుంటున్నారు.

ఎవరి దారి వారిదే..

ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఆర్టీసీలో సమస్యలు ఎప్పటికప్పుడు సమీక్షించి పరిష్కరించాల్సిన పెద్దలు ఎవరి దారిలో వారు ఉన్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజయవాడలోని ఆర్టీసీ వైపు కన్నెత్తి చూడడం లేదనే వాదన వినిపిస్తోంది. సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బోర్డు సభ్యులు, ఆర్టీసీ ఈడీలు ఎవరూ కనీసం సమీక్షించలేదు. ఆర్టీసీ హౌస్‌లో స్పెషల్ బస్సుల ప్రస్తావన తీసుకొస్తే 'మంత్రిది రాయలసీమ దారి, ఎండీది హైదరాబాద్ రూటు.. చైర్మన్ ఆరోగ్యం బాగలేదంటారు.. ప్రయాణికుల గురించి పట్టించుకునే స్థితిలో ఆర్టీసీ పెద్దలు ఉన్నారా.?' అని అంటున్నారు.



సీఎస్ విజయానంద్‌కు మొక్కను అందజేస్తున్న ఏపీజెన్‌కో ఎండీ నాగలక్ష్మి

సీఎస్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు పలువురు ఐఏఎస్‌లు, అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ముఖేశ్ కుమార్ మీనా, శ్యామలరావు, జయలక్ష్మి తదితర ముఖ్యకార్యదర్శులు, కలెక్టర్లు, జేసీలు, వివిధ శాఖాధిపతులు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు గురువారం అమరావతి సచివాలయంలో సీఎస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ శాఖను వెంటాడుతున్న జగన్ పాపాలు

- ట్రూ అప్ పేరుతో రూ.32,166 కోట్ల భారం మోపిన వైసీపీ
- కొనుగోళ్ల నియంత్రణతో ప్రజలపై భారం తగ్గిస్తున్నాం: గొట్టిపాటి

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు గత ఐదేళ్లుగా విద్యుత్ శాఖను, రాష్ట్ర ప్రజలను వెంటాడుతున్నాయని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోకుండా కమీషన్ల కోసం కక్కుర్తిపడి అడ్డగోలుగా విద్యుత్ కొనుగోలు చేశారని గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఐదేళ్లలో ట్రూ అప్ పేరుతో రూ.32,166 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. 2019 వరకు మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉన్న ఏపీని వైసీపీ హయాంలో అంధకారంలోకి నెట్టేశారవిమర్శించారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ కొనుగోళ్ల నియంత్రణతో ప్రజలపై భారాన్ని తగ్గిస్తున్నారని తెలిపారు. 1999లో ఏపీఈఆర్‌సీ ఏర్పడిన నాటి నుంచి తొలిసారిగా ట్రూడౌన్ అమలు చేసిన ఘనత కూటమి సర్కార్‌కు దక్కుతుందన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.

టీడీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏవీ రమణ, పరుచూరి కృష్ణ, గుమ్మడి గోపాలకృష్ణ, దారపనేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తొలిసారి పారా మెడికల్ సప్లిమెంటరీ పరీక్షలు

- 5 వరకు దరఖాస్తులు.. ఫిబ్రవరిలో పరీక్షలు: మంత్రి సత్యకుమార్

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పారా మెడికల్ కోర్సుల విద్యార్థులకు ప్రభుత్వం తొలిసారిగా సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల వ్యవధి కలిగిన పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన వారు పరీక్షల్లో ఫెయిల్ అయితే.. తిరిగి వార్షిక పరీక్షలప్పుడు మాత్రమే సప్లిమెంటరీ రాసేవారని చెప్పారు. ఈ విధానం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఒక ఏడాది సమయం వృథా అవుతోందని, ఉపాధి అవకాశాలను కూడా కోల్పోతున్నారని మంత్రి పేర్కొన్నారు. అందుకే 2025-26 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామని వివరించారు. ఇటీవల జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణత పొందలేని విద్యార్థుల కోసం సప్లిమెంటరీ పరీక్షల నోటిఫికేషన్ జారీచేశామని, జనవరి 5 వరకు దరఖాస్తులు స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. సుమారు 5 వేల మంది విద్యార్థులకు ఈ పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నామని, ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

301 మందికి జీవన్‘దాన్’

2025లో రికార్డు స్థాయిలో బాధితులకు అవయవాల దానం

బ్రెయిన్ డెడ్ అయిన 93 మంది నుంచి సేకరణ

Jeevan Daan
A Gift of Life

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ‘జీవన్ దాన్’ గడచిన ఏడాది (2025) వందలాది మంది జీవితాల్లో వెలుగులు నింపింది. బ్రెయిన్‌డెడ్ అయిన 93 మంది నుంచి సేకరించిన అవయవాలను 301 మంది బాధితులకు అందించారు. అంతకుముందు 2024లో 200 మందికి అందించగా, గత ఏడాది అదనంగా 101 మందికి అందించారు. దీంతో రాష్ట్ర చరిత్రలో ఒకే ఏడాదిలో అత్యధిక ఆర్గాన్స్‌ను సేకరించిన రికార్డును జీవన్‌దాన్ సృష్టించినట్టు అయింది. జీవన్‌దాన్ కార్యక్రమాన్ని 2015లో ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటివరకూ బ్రెయిన్ డెడ్ అయిన 403 మంది నుంచి వివిధ రకాల అవయవాలను సేకరించి 1,293 మందికి అమర్చారు. గడచిన రెండేళ్లుగా అవయవదానంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో బ్రెయిన్‌డెడ్ అయిన వారి అవయవాలు (ఆర్గాన్స్) దానం చేసేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకు వస్తున్నారు. అవయవదానం చేసే వ్యక్తికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం కూడా అందిస్తున్నారు. పది వేల రూపాయలతోపాటు ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహిస్తోంది. ఈ గౌరవం కూడా మరింత మందిని ముందుకు వచ్చేలా చేస్తోంది.

అవగాహనతో మంచి ఫలితాలు



ఎంతోమంది అవయవాలు ఫెయిలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ.. దాతల కోసం ఎదురుచూస్తున్నారు. కొన్ని వందల మంది వివిధ రకాల అవయవాల కోసం జీవన్‌దాన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉన్నారు. అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజల్లో అవయవదానం పట్ల అవగాహన కల్పిస్తున్నాం. ఇది మంచి ఫలితాన్ని అందించింది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను దానం చేసేందుకు వారి కుటుంబ సభ్యులు ముందుకువస్తున్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో అవయవాలను సేకరించి బాధితులకు అందించాం. జీవన్‌దాన్ కార్యక్రమాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ సోషల్ అభినందించారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి మరింతమంది అవయవదానానికి ముందుకువచ్చేలా కృషిచేస్తాం.

-డాక్టర్ కె.రాంబాబు, జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్



రేపటి నుంచే నల్లమలలో గణన ప్రక్రియ

- నాలుగేళ్లకు ఓసారి లెక్కింపు
- ‘టైగర్ రిజర్వు’లోనూ సిద్ధం
- ఈ విధుల్లో 1200 మంది సిబ్బంది
- ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల వినియోగం
- నాలుగు డివిజన్లలో 1,176 కెమెరా ట్రాప్‌లు!

ఎన్‌ఎస్‌టీఆర్‌లోని పులుల లెక్క

సంవత్సరం	పులుల సంఖ్య
2006	95 ఉమ్మడి ఏపీ
2010	72
2014	68 నవ్యాంధ్ర
2018	74
2022	73

పులులెన్ని?

ఆత్మకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పులుల గణనకు అటవీ శాఖ సిద్ధమవుతోంది. ప్రతి పదేళ్లకు ఓసారి జనాభా లెక్కలను ఏవిధంగా తీస్తారో, ఆ తరహాలోనే ప్రతి నాలుగేళ్లకు ఓసారి దేశంలో ఉండే పులులను లెక్కించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శనివారం మొదలై, మే 31వ తేదీ వరకు పులుల లెక్కలు తీయనున్నారు. మన రాష్ట్రంలోని నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్ట్ (ఎన్‌ఎస్‌టీఆర్) సహా 58 పెద్దపులుల అభయారణ్యాల పరిధిలో గణన చేపట్టనున్నారు. నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రక్రియను మూడు విడతలుగా చేపడతారు. ఫేస్-1 కింద గత ఏడాది డిసెంబరు 1 నుంచి 7వ తేదీ వరకు అటవీశాఖ బృందాలు, తొలి మూడు రోజుల పాటు మాంసాహార జంతువులు, మరో మూడు రోజులు శాకాహార జంతువుల సంఖ్యను లెక్కించారు. అదేక్రమంలో అటవీ స్థితిగతులను పరిశీలించి వృక్ష సంపద, వేట, మానవ ప్రమేయం వల్ల కలిగిన అటవీ నష్టాల వివరాలతో పాటు పలు వన్యప్రాణుల మలమూత్రాలను, పగ్ మార్కులను సేకరించారు. ఈ వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు ఎం-స్ట్రైప్స్ ఎకలాజికల్ మొబైల్ యాప్‌లో నిక్షిప్తపరిచారు. ఫేస్-2 లో శాటిలైట్ వ్యవస్థను ఉపయోగించి ఎన్‌టీసీఏ బృందాలు అడవుల స్థితిగతులు, వన్యప్రాణుల సంచారాన్ని పసిగట్టాయి.

దేశవ్యాప్తంగా పులుల లెక్క ఇదీ

సంవత్సరం	పులుల సంఖ్య
1972	1,827
1979	3,015
1984	4,005
1989	4,334
1993	3,750
1997	3,508
2001-02	3,642
2005	2,000 కన్నా ఎక్కువ
2008	1,411
2010	1,706
2014	2,226
2018	2,967
2022	3,167

ఇందులో అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది ప్రమేయం లేదు. ఇప్పుడు ఫేస్ - 3 మొదలవుతోంది. ఇందులోభాగంగా కెమెరా ట్రాప్స్ ఆధారంగా కేవలం పులుల ఫొటోలను సేకరించనున్నారు.

మన రాష్ట్రంలో..

నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3,568 చదరపు కిలోమీటర్ల మేర ‘ఎన్‌ఎస్‌టీఆర్’ విస్తరించి ఉంది. ఇది దేశంలో అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా గుర్తింపు పొందింది. ఇంత భారీ విస్తీర్ణంలో ఒకే విడతలో పులుల కెమెరా ట్రాప్స్ సేకరించడం కష్టం. అందువల్ల ఎన్‌ఎస్‌టీఆర్‌ను మూడు బ్లాకులుగా విభజించి పులుల అంచనాలను సిద్ధం చేయాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. బ్లాక్-1 కింద ఈ నెల మూడోతేదీ నుంచి ఫిబ్రవరి 10 వరకు రాజీవ్‌గాంధీ అభయారణ్యం పరిధిలోని ఆత్మకూరు, మార్కాపురం డివిజన్లు; బ్లాక్-2 కింద గుండ్ల బ్రహ్మేశ్వరం అభయారణ్యం పరిధిలోని గిద్దలూరు, నంద్యాల డివిజన్లతో పాటు ఆత్మకూరు, మార్కాపురం డివిజన్లలోని మిగిలిన ఏరియాల్లో ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 4 వరకు లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. బ్లాక్-3లో భాగంగా ఎన్‌ఎస్‌టీఆర్ కారిడార్ పరిధిలో పులి సంచరించే వివిధ ప్రదేశాలను గుర్తించి అక్కడ కూడా ఏప్రిల్ 20 నుంచి మే 31 వరకు కెమెరా ట్రాప్స్ ద్వారా పులుల చిత్రాలను సేకరించనున్నారు.

పకడ్బందీగా లెక్కింపు



“నాగార్జునసాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో పులుల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎన్‌ఎస్‌టీఆర్ దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు కావడంతో మూడు బ్లాకులుగా విభజించి పులుల లెక్కింపు అంచనాల ప్రక్రియను చేపడుతున్నాం. నల్లమల అడవులే కాకుండా ఎన్‌ఎస్‌టీఆర్ కారిడార్ పరిధిలో పులి సంచారాన్ని గుర్తించిన వివిధ ప్రదేశాల్లో కెమెరా ట్రాప్స్‌ను ఏర్పాటు చేయనున్నాం. ఇప్పటికే అన్ని డివిజన్ల సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చాం. అందరి సమన్వయంతో ఈ ప్రక్రియను పూర్తిచేస్తాం. ఎన్‌ఎస్‌టీఆర్‌లో గత లెక్కలతో పోల్చితే ఈసారి పులుల సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నాం.

- విజయకుమార్, ఎన్‌ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్

ఎన్‌ఎస్‌టీఆర్ పరిధిలోని ఆత్మకూరు, నంద్యాల, మార్కాపురం, గిద్దలూరు అటవీ డివిజన్లలో మొత్తం 18 రేంజ్‌లు, 68 సెక్షన్లు, 145 బీట్లు ఉన్నాయి. వీటన్నింటిలో ఫేస్-1 ద్వారా పులుల కదలికలను గుర్తించిన ప్రదేశాలను ఎంపిక చేసి పాయింట్లను నిర్ధారిస్తారు. ఈ లెక్కన ఎన్‌ఎస్‌టీఆర్ పరిధిలో మొత్తం 1,176 కెమెరా ట్రాప్ పాయింట్లను అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఇందులో బ్లాక్-1 పరిధిలో 473, బ్లాక్-2 పరిధిలో 703 పాయింట్లను ఎంపిక చేశారు. గత ఏడాది డిసెంబరు 30వ తేదీ నుంచే బ్లాక్-1 పరిధిలో కెమెరా ట్రాప్స్ ఏర్పాటు ప్రక్రియను మొదలుపెట్టారు. ఒక్కో పాయింట్లో ఎదురెదురుగా కెమెరాలు ఉండే విధంగా రెండు కెమెరా ట్రాప్స్‌ను అమర్చనున్నారు. ఇందుకోసం 40 మెగాపిక్సెల్ సామర్థ్యం కలిగిన కడ్డె బ్యాక్-సీ1, స్పార్క్‌ఆన్, జీసీస్ కంపెనీలకు చెందిన సెన్సార్ సిస్టమ్‌తో రూపొందించిన ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను ఒక్కొక్కటి రూ.25వేల చొప్పున కొనుగోలు చేశారు. సుమారు 2500 నుంచి 3వేల కెమెరాలను అందుబాటులో ఉంచారు. కాగా, లెక్కింపు ప్రక్రియలో నాలుగు డివిజన్ల పరిధిలో సుమారు 1,200 మంది అటవీశాఖ సిబ్బంది పాల్గొననున్నారు. కెమెరాల పనితీరు, బ్యాటరీలు, మెమరీ కార్డులు మార్చడం వంటి వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు. ఆ తర్వాత ఎఫ్‌ఎస్‌వో, డీఆర్వో, ఆర్వోలు, సబ్ డీఎఫ్‌వోలు, డిప్యూటీ డైరెక్టర్లు, ఫీల్డ్ డైరెక్టర్ ప్రతిరోజూ తాము నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం కెమెరా ట్రాప్స్ పాయింట్లను, సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తారు.

ఫేస్ - 3 లో భాగంగా..



పిల్లలను పెంచలేక.. ఎవరూ ఆదరించక!



విగత జీవులుగా సురేంద్ర, అతని పిల్లలు



భార్య, పిల్లలతో సురేంద్ర (ఫైల్)

- ముగ్గురు బిడ్డలకూ విషమిచ్చిన తండ్రి
- ఆపై తానూ ఉరివేసుకుని బలవన్మరణం
- ఐదు నెలల క్రితం భార్య ఆత్మహత్య
- నంద్యాల జిల్లా ఉయ్యాలవాడలో విషాదం

ఉయ్యాలవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): భార్య మరణంతో.. ముగ్గురు చిన్నారులను పెంచలేక.. బంధువుల ఆదరణా కరువై..తీవ్రంగా మదనపడిన ఓ తండ్రి కఠిన నిర్ణయం తీసుకున్నాడు! కన్నబిడ్డలకు పాలల్లో విషమిచ్చాడు. ఆపై తానూ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం తుడుమల దిన్నె గ్రామంలో గురువారం నూతన సంవత్సరం వేళ ఈ విషాదం చోటుచేసుకుంది. వివరాలివీ.. తుడుమలదిన్నె వాసి వేములపాటి సురేంద్ర(35)కు అవుకు మండలం మహేశ్వరితో 8ఏళ్ల క్రితం వివాహమైంది. సురేంద్ర వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవించేవాడు. వీరికి కావ్యశ్రీ(7), ధ్యానేశ్వరి(4), సూర్యగగన్(1) సంతానం. మహేశ్వరి బాలింతగా ఉండగా గతేడాది ఆగస్టు 16వ తేదీన అనారోగ్యం కారణంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి ఆ కుటుంబాన్ని కష్టాలు వెంటాడాయి. చిన్నపిల్లల ఆలనాపాలనా చూసేందుకు ఎవరూ సాయం చేసేవారు కారు. బంధువులు కూడా వచ్చేవారు కారు. దీంతో కావ్యశ్రీ, ధ్యానేశ్వరిలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపేవాడు. ఇక సూర్య గగన్‌ను ఎలా చూసుకోవాలో అతడికి తెలిసేది కాదు. సురేంద్ర తండ్రి కూడా పక్షవాతంతో మంచానపడ్డాడు. సురేంద్ర తల్లి చనిపోతే, ఆయన మరో ఆమెను పెళ్లి చేసుకుని వేరుగా ఉంటున్నారు. సురేంద్ర పిల్లలను చూసుకోవడానికి బంధువుల నుంచి ఎలాంటి సహకారం లేదు. అయినప్పటికీ ఐదు నెలలుగా ఎలాగోలా చూసుకునేవాడు. ఓవైపు పిల్లలను చూసుకోవటం భారం కాగా, మరోవైపు వారిని పోషించే స్థోమత లేక.. తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. తాను తనువు చాలిస్తే తన పిల్లలు మరొకరికి భారం కాకూడదనుకున్నాడో ఏమో ముగ్గురు పిల్లలకూ విషమిచ్చాడు. అనంతరం తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో పాలడబ్బాతో పాటు చిన్నపిల్లలకు ఇష్టమైన రెండు కూల్‌డ్రింక్ (మాజా) బాటిళ్లను పోలీసులు గుర్తించారు. ఇద్దరు కుమార్తెలకు కూల్‌డ్రింక్, కుమారుడికి పాలలో విషం కలిపి ఇచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం 8 గంటలైనా పిల్లలు ఇంటి నుంచి బయటికి రాకపోవటంతో పక్క వీధిలో ఉంటున్న సురేంద్ర సవతి తల్లికి అనుమానం వచ్చి చూడగా ఈ ఘోరం వెలుగుచూసింది. గురువారం రాత్రి నలుగురికీ సురేంద్ర పెద్దన్న కొద్దిమందితో కలిసి అంత్యక్రియలు జరిపించారు. కాగా, సురేంద్ర బంధువులతోపాటు.. మహేశ్వరి తల్లిదండ్రులు కూడా అంత్యక్రియలు రాకపోవడం విచారకరం. ఆత్మహత్య ఘటనకు ముందు స్నేహితులకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు సెల్‌ఫోన్‌ద్వారా తెలియజేసిన సురేంద్ర ఇంతపని చేస్తాడని ఊహించలేదని స్నేహితులు కంటతడి పెట్టారు.

పండ్లకు కవర్ల రక్ష!

నాణ్యత, అధిక ధర సాధనే లక్ష్యం

నిరుడు మామిడిలో మంచి ఫలితాలు



మామిడి తోటలో పండ్లకు కవర్లు తొడిగిన దృశ్యం

ఏ వస్తువుకైనా కవర్(తొడుగు) ఉంటే కొంత రక్షణ ఉంటుంది. మార్కెట్లో మనం కొనుగోలు చేస్తే ఎన్నోరకాల వస్తువులు ఇదే కోవలో ఉంటాయి. ఇప్పుడు ఉద్యానవన సాగులోనూ కవర్ల విధానం వస్తోంది. కవర్లను చుట్టడం ద్వారా మామిడి, అరటి, దానిమ్మ, జామ వంటి పండ్లలో నాణ్యత పెంచడానికి ఉద్యానశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ విధానంతో పండ్ల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఎగుమతుల ద్వారా రైతులకు అధిక ధర, ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో అందుకుతగ్గ ప్రణాళిక అమలు పరుస్తోంది. నిరుడు మామిడిలో అమలు చేసి, మంచి ఫలితాలు రాబట్టింది. ఈ ఏడాది అరటి, దానిమ్మ, జామ పండ్లకూ కవర్ల తొడుగులతో ఎగుమతికి అనువైన ఉత్పత్తి సాధించడానికి ప్రణాళిక రూపొందించింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉద్యానవన సాగులో అధిక దిగుబడులే లక్ష్యంగా ప్రభుత్వం నూతన విధానాలు అవలంబిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రంలో పండ్ల తోటలు అధికంగా సాగులో ఉన్న రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర, కృష్ణా, గోదావరి ప్రాంతాల్లో కొత్తగా కవర్ల విధానాన్ని అమలు చేయనుంది. నోరూరించే మధుర ఫలంగా పేరొంది, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న మామిడి పండ్లలో మంగు, డాగు లేకుండా.. కంటికి ఇంపుగా కనిపించి, నోటికి రుచిగా ఉండేలా ఉత్పత్తి చేయడానికి గత ఏడాది కవర్లు చాలా ఉపయోగపడ్డాయి. మామిడి పిండె దశలోనే కవర్లు



దానిమ్మ తోటలో పండ్లకు కవర్లు

అరటి, దానిమ్మకూ తొడుగులు

కూరగాయ పంటల్లో ట్రెల్లిసింగ్ పద్ధతి

తొడగడంతో కాయ కోతకొచ్చే సరికి పసుపు వర్ణంలో నాణ్యంగా తయారవడంతో రైతులు మంచి ధర పొందారు. ఒక్క కవర్ రూ.రెండు మాత్రమే. కాయకో కవర్ తొడుగుతారు. దీనివల్ల శీతాకాలంలో మంచు పడకుండా ఉంటుంది. మంచు వల్ల కాయ పాడవకుండా ఉంటుంది. కాయలకు మంగు వంటి తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి. కిలోకు సగటున మూడు కాయల చొప్పున టన్నుకు మూడు వేల కాయలొస్తాయి. అంటే టన్నుకు రూ.6వేలు కవర్ల ఖర్చవుతుంది. కవర్ల తొడుపు లేని బంగినపల్లి రకం మామిడి టన్ను రూ.25వేలు ఉంటే.. కవర్‌తో ఉండే పండ్లు రూ.40నుంచి 60వేలుపలికాయి. తోతాపురి మామిడికి కవర్లు లేకపోతే టన్ను రూ.5వేలు పలకని పరిస్థితి ఉంటే.. కవరింగ్ వల్ల రూ.15నుంచి 20వేలు పలికింది. బంగినపల్లి హెక్టారుకు 12.5టన్నుల దిగుబడి వస్తే.. టన్నుకు రూ.16వేలు చొప్పున రూ.2లక్షల అదనపు ఆదాయం రైతులు పొందినట్లు ఉద్యాన అధికారులు చెప్తున్నారు.

అరటి, దానిమ్మ సాగులో..

అరటిలో ఫ్రూట్ కేర్ విధానంతో ఒక్కో గెలకు రూ.20 ఖర్చుతో కవర్ తొడిగితే.. హెక్టారుకు 3వేల అరటి మొక్కలకు రూ.60వేలు ఖర్చవుతుంది. హెక్టారుకు 65టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు రూ.923 ఖర్చవుతుంది. అయితే ఎగుమతి రకంపై టన్నుకు రూ.2వేలు చొప్పున హెక్టారుకు రూ.లక్షా30వేల అదనపు ఆదాయం లభిస్తుంది. హెక్టారుకు కవర్ల ఖర్చు రూ.60వేలు పోతే.. రూ.70వేలు అదనపు ఆదాయం లభిస్తుందని అధికారులు అంచనా వేశారు. 2024-25లో అరటిలో 2వేల హెక్టార్లకు ఈ కవర్ల తొడుపులు చేయగా, ఈ ఏడాది రూ.5వేల హెక్టార్లకు ఇవ్వాలని నిర్ణయించారు. దానిమ్మ తోటలు గాలులకు పడిపోకుండా ఊత కర్రలు పెట్టడం, కాయలకు గ్రో కవర్లు తొడగటానికి హెక్టారుకు రూ.62,500 ఖర్చయితే.. పురుగు మందుల వినియోగం తగ్గి రూ.12,500 మిగలడంతో పాటు, హెక్టారుకు 20టన్నుల దిగుబడితో టన్నుకు రూ.10వేలు, హెక్టారుకు రూ.2లక్షల అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఈ విధానంలో నిరుడు 500 హెక్టార్లలో అమలు చేయగా, ఈ ఏడాది 5వేల హెక్టార్లలో అమలు చేయాలని నిర్ణయించారు. 2026 నుంచి జామ తోటల రైతులకు కూడా కవర్లు రాయితీపై ఇవ్వాలని నిర్ణయించారు. దీని కవర్ 50పైసలు మాత్రమే ఉంటుంది. అలాగే కోకో పంట కోత అనంతరం గింజల నాణ్యత, రుచి కోసం చెక్క పెట్టెల్లో నిల్వ చేసే విధానాన్ని రూపొందించారు. ఈ చెక్క పెట్టెలను 15-20ఏళ్ల వినియోగించవచ్చు. ఈ పెట్టెలను 35% సబ్సిడీపై అందించనున్నారు. కోకో పంట కిలో రూ.50అదనంగా పలికి, టన్నుకు రూ.50వేలు అధికంగా లభిస్తుంది.

ట్రెల్లిసింగ్ పద్ధతిలో టమాటా సాగు

శాశ్వత పందిరి కూరగాయ పంటలు సాగు చేసే విధానాలను కూడా ఉద్యానశాఖ చేపట్టింది. కూరగాయల తోటలను సంప్రదాయ పద్ధతిలో సాగు చేస్తే.. 45 రోజులకు 5 కోతలు మాత్రమే వస్తుంది. ఎకరానికి రూ.లక్ష ఖర్చు చేసినా.. 24టన్నులే దిగుబడి వస్తుంది. ఈ తరహా టమాటాకు మార్కెట్‌లో టన్ను రూ.10వేలు మించి పలకని పరిస్థితి. నికరంగా రైతుకు ఎకరానికి రూ.లక్షా 40వేలు వస్తేనే లాభం. అదే ట్రెల్లిసింగ్ పద్ధతిలో మూడు నెలల్లో 15కోతలు వస్తాయి. ఎకరానికి రూ.లక్షా 60వేలు ఖర్చయినా.. 30 టన్నుల దిగుబడి వస్తుంది. టన్ను రూ.12వేలు పలికినా.. రూ.3.60 లక్షలు వస్తాయి. ఖర్చులు పోను రూ.2లక్షలు మిగులుతాయని అధికారులు చెప్తున్నారు. ఈ విధంగా అన్ని రకాల కూరగాయ పంటలను సాగు చేసి, అదనపు ఆదాయం పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ అధికారులు నిర్ణయించారు.

అదనపు ఆదాయానికి ఉత్తమ విధానం

కవర్లు వినియోగించడం ద్వారా కోస్తాలో తోతాపురి మామిడి రైతులు హెక్టారుకు 15 టన్నుల దిగుబడికి గాను టన్నుకు రూ.6వేల చొప్పున రూ.90వేల అదనపు ఆదాయం పొందారు. ఇలా హెక్టారుకు రూ.1,12,500 ఖర్చు పెడితే.. బంగినపల్లికి రూ.2లక్షలు, తోతాపురికి రూ.90వేల అదనపు ఆదాయం లభించింది. 2024-25లో 10వేల హెక్టార్ల మామిడి తోటల్లో ఈ కవర్ల తొడుపులు చేపట్టాం. ఈ ఏడాది 50వేల హెక్టార్లలో అమలు చేయాలని నిర్ణయించాం.

-శ్రీనివాసులు, ఉద్యానశాఖ డైరెక్టర్

500 కోట్ల కిక్కు



(మొదటిపేజీ తరువాయి)

మందుబాబులు తాగేశారు. కాగా గతేడాది నూతన సంవత్సరం సమయంలో రూ.331 కోట్ల అమ్మకాలే జరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి మూడు త్రైమాసికాల్లో రూ.2,2983 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. 2024-25తో పోలిస్తే ఇది 1.79శాతం ఎక్కువ. మద్యం షాపుల విక్రయాల్లో లిక్కర్ 277 శాతం వృద్ధి రేటు నమోదు కాగా, బార్లలోని అమ్మకాల్లో 69 శాతం అమ్మకాలు పడిపోయాయి. బీర్ అమ్మకాలు షాపుల్లో 521 శాతం పెరగ్గా, బార్లలో 60 శాతం తగ్గాయి.

అమ్మకాలు పెరిగినా... పరిమాణం పరంగా అమ్మకాలు పెరిగినా, విలువ పరంగా పెద్దగా వృద్ధి కనిపించడం లేదు. ఎందుకంటే కూటమి ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించింది. అలాగే రూ.99 బ్రాండ్లు ప్రవేశపెట్టింది. మొత్తం అమ్మకాల్లో రూ.99 బ్రాండ్ల మద్యం అమ్మకాలు 20 శాతంగా ఉన్నాయి. ఫలితంగా అమ్మకాలు పెరిగినా విలువలో వృద్ధి కనిపించలేదు. కాగా డిసెంబరు నెలలో అమ్మకాలు భారీగా పెరిగాయి. 2024తో పోలిస్తే ఆ నెలలో విలువ పరంగా చూసినా 7.75 శాతం అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాది తీసుకొచ్చిన నూతన బార్ పాలసీ విఫలం కావడంతో బార్ల అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. పాలసీ లాభదాయకంగా లేదని భావించిన వ్యాపారులు లైసెన్స్‌లు తీసుకునేందుకు కూడా ముందుకు రాలేదు. దీంతో 299 బార్లు ఎవరూ తీసుకోకుండా మిగిలిపోయాయి. ఆ ప్రభావం అమ్మకాలపై పడింది.


డిసెంబరులో జీఎస్టీ వసూళ్లు 2,652 కోట్లు

పెరుగుదల 5.78%.. దక్షిణాదిలో రెండో స్థానం

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిసెంబరులో నికర జీఎస్టీ రూ.2,652 కోట్లు వసూలైంది. వసూళ్ల పెరుగుదలలో జాతీయ సగటు 5.61 శాతం ఉండగా.. ఏపీలో 5.78 శాతం ఉన్నట్లు రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఏ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అలాగే వసూళ్లలో దక్షిణాదిలో తమిళనాడు తర్వాత రెండోస్థానంలో ఉన్నామని తెలిపారు. 2025 డిసెంబరులో స్థూలంగా రూ.3,137 కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. ‘2024 డిసెంబరులో వచ్చిన జీఎస్టీ కంటే గత నెలలో వసూలైన జీఎస్టీ 5.78 శాతం ఎక్కువ. రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వసూళ్లు 2.46 శాతం మేర పెరిగి రూ.1,102 కోట్లకు చేరుకున్నాయి. 2025 డిసెంబరులో ఐజీఎస్టీ సెటిల్మెంట్ 8.29 శాతం మేర పెరిగి రూ.1,549 కోట్లకు చేరింది. పెట్రోలియం వ్యాట్ ద్వారా రూ.1,448 కోట్ల ఆదాయం వచ్చింది. 2024 డిసెంబరు కంటే ఈ ఆదాయం 3.89 శాతం ఎక్కువ. వృత్తిపన్ను రూ.42 కోట్లు వసూలైంది. గత నెలలో అన్ని విభాగాల నుంచీ రూ.4,246 కోట్ల పన్ను ఆదాయం వసూలైంది. 2024 డిసెంబరులో వచ్చిన పన్ను ఆదాయం (రూ.4,047 కోట్లు) కంటే ఇది 4.91% ఎక్కువ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల నుంచీ రూ.39,517 కోట్ల పన్ను ఆదాయం వచ్చింది. 2024లో ఇదే సమయంలో వచ్చిన పన్ను ఆదాయం (రూ.37,804 కోట్లు) కంటే ఇది 4.53% ఎక్కువ’ అని ప్రకటనలో పేర్కొన్నారు.

మల్లెలు కిలో 3,000

- కనకాంబరం రూ.2,500, ముల్లె పూలు రూ.1,200
- తమిళనాడులో గురువారం పలికిన పూల ధరలివి
- న్యూ ఇయర్, ముక్కోటి ఎఫెక్ట్



చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు మార్గళి పూజలు, మరో వైపు ఆంగ్ల సంవత్సరాది వేడుకల కారణంగా తమిళనాడులో మల్లెలు సహా అన్నిరకాల పూల ధరలకు రెక్కలు వచ్చాయి. మదురై మార్కెట్లో గురువారం మల్లెలు కిలో రూ.2,500లు, తేని జిల్లా ఆండిపట్టి మార్కెట్లో రూ.3,000 ధర పలికాయి. అలాగే, కనకాంబరం కిలో రూ.2,500, ముల్లె పూలు కిలో రూ.1,200, సింధూరపువ్వులు రూ.120, పన్నీటి గులాబీల ధరలు రూ.200 వరకు పెరిగాయి. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో, మంచు కురవడం ప్రారంభమైంది. ఈ కారణంగా పూల దిగుబడులు కూడా బాగా తగ్గిపోయాయి. అదే సమయంలో, వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరం కావడంతో పూలకు గిరాకీ పెరిగింది. ఈ కారణంగా అన్ని రకాల పూల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. సంక్రాంతి రానున్న కారణంగా ఈ పూల ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

సీఎం ప్రాజెక్టుల బాట

- 5న పోలవరం.. 7న వెలిగొండ.. 17న ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి బాబు
- స్వయంగా పనుల పరిశీలనకు ముఖ్యమంత్రి

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాది మొదటి నెలలో సీఎం చంద్రబాబు వరుసగా సాగునీటి ప్రాజెక్టులను సందర్శించనున్నారు. ఈ నెల 4న విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే.. ఐదో తేదీన పోలవరం వెళ్తారు. ప్రధాన డ్యాం పనుల పురోగతిని పరిశీలిస్తారు. 7వ తేదీన వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తారని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు 'ఆంధ్రజ్యోతి'కి గురువారం తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పరిధిలోని పోలవరం ఎడమ కాలువ విస్తరణ పనులను సీఎం పరిశీలించనున్నారు. తన పర్యటనల్లో ఆయా ప్రాజెక్టుల స్థితిగతులను స్వయంగా చూసి.. ఆ వివరాలను ప్రజలకు తెలియజేస్తారు.

గోదావరి పుష్కరాలనాటికి పోలవరం..

పోలవరంలో కీలకమైన డయాఫ్రం వాల్‌ను గత నెలాఖరునాటికే పూర్తి చేయాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే.. డిజైన్ల రూపకల్పన, ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమంపై అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వడంలో జాప్యం.. తదితర కారణాలతో జాప్యం జరిగింది. ఇప్పటికే 83 శాతం డయాఫ్రం వాల్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన 17 శాతం పనులూ ఫిబ్రవరి నెలాఖరుకు లేదా మార్చి రెండో వారానికి పూర్తి చేస్తామని పోలవరం ఇంజనీరింగ్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ వాల్‌కు సమాంతరంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణం కూడా చేపడుతున్నారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పనులు పూర్తి చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రిని కోరారు. ఇందుకు ఆయన సమ్మతించారు. 2027 జూన్ నాటికి పనులు పూర్తి చేయాలని జల వనరుల శాఖకు ఇప్పటికే ఆయన గడువు విధించారు. ఈ నేపథ్యంలోనే విదేశీ పర్యటన నుంచి రాగానే.. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని స్వయంగా తెలుసుకోనున్నారు. గడువులోగా పూర్తిచేస్తామన్న విశ్వాసాన్ని ప్రజలకు కలిగించే ఆయన పర్యటన ఉంటుందని జల వనరుల శాఖ వర్గాలు తెలిపాయి.

పనులు పూర్తవకముందే ప్రారంభోత్సవం..

వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సీఎం హోదాలో ప్రాజెక్టును జాతికి అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. అత్యంత ప్రధానమైన పనులు ఇంకా మిగిలి ఉండగానే.. ప్రారంభోత్సవం చేసినట్లు డ్రామాలాడి ప్రజలను జగన్ మోసం చేశారని నిమ్మల ధ్వజమెత్తారు. 7న వెలిగొండ పర్యటన సందర్భంగా అత్యంత కీలకమైన ఫీడర్ చానల్‌కు శంకుస్థాపన చేయడం ద్వారా.. జగన్ చేసిన మోసాన్ని ప్రజలకు ప్రత్యక్షంగా తెలియజేస్తామని స్పష్టం చేశారు. కాగా.. ప్రాజెక్టుల పరిశీలనకు ముఖ్యమంత్రి సిద్ధమవడంతో.. ఇందుకు సంబంధించిన వివరాలను అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) రాష్ట్ర జల వనరుల శాఖను ఆదేశించింది.



మన్యం అందానికి మైమరచిన సీఎం

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), జనవరి 1(ఆంధ్రజ్యోతి): మన్యంలో గురువారం వివిధ ప్రాంతాల్లో భానోదయ దృశ్యాలు ముఖ్యమంత్రి చంద్రబాబును అమితంగా ఆకర్షించాయి. శీతాకాలం కావడంతో పొగమంచును చీల్చుకుంటూ సువర్ణ వర్ణంలో భానుడి దర్శనం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. నూతన సంవత్సరం తొలిరోజున గురువారం ఉదయం ఏజెన్సీలో వంజంగి హిల్స్, మాడగడ, చెరువులవేనం ప్రాంతాల్లోని సన్‌రైజ్ పాయింట్లలో సూర్యోదయం ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. వంజంగి హిల్స్‌లోని ఆ దృశ్యం వీడియోను సీఎం 'ఎక్స్' వేదికగా పోస్టుచేశారు. రాష్ట్రాన్ని 'సన్‌రైజ్ స్టేట్'గా పేర్కొంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 'సూర్యోదయ రాష్ట్రం నుంచి 2026 తొలి సూర్యోదయం (ఫస్ట్ సన్‌రైజ్ ఆఫ్ 2026.. ఫ్రమ్ ద సన్ రైజ్ స్టేట్.. అరకులోయ, ఆంధ్రప్రదేశ్)' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఇది సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది.


గురువారం పాడేరు మండలం వంజంగి హిల్స్‌లో సూర్యోదయం

గేట్లు ఎత్తేశారు!

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు స్వగ్రామం ఏ.వి.నగరంలోని శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం! ఇప్పుడు యనమల కోరితే చేశారు! రేపు... అంతకుమించిన బలమైన సిఫారసుతో ఇంకెవరైనా వచ్చి ఫలానా ఆలయాన్ని టేకోవర్ చేయండి అంటే కాదనగలరా?


ఏవీనగరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం

ఖర్చుతో కొలవలేని 'భారం'

ప్రస్తుతం టీటీడీ ఏడు ప్రధాన ఆలయాలను నిర్వహిస్తోంది. వీటి ద్వారా వచ్చే ఆదాయం ఏటా రూ.140 కోట్లుకాగా... ఖర్చు రూ.117 కోట్లు. అలాగే... రాష్ట్రం వెలుపల టీటీడీకి 19 ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల నుంచి ఏటా రూ.47 కోట్ల ఆదాయం వస్తోంది. వాటి నిర్వహణ, సిబ్బంది జీతాలు, స్వామివారి కైంకర్యాలకు కలిపి రూ.47 కోట్లు ఖర్చవుతోంది. వీటితో ఎలాంటి ఇబ్బందీ లేదు. అసలు సమస్యల్లా... 'టేకోవర్' ఆలయాలతోనే! గత కొన్నేళ్లుగా టీటీడీ 34 చిన్న ఆలయాలను తన పరిధిలోకి తీసుకుంది. ఇవన్నీ ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు నిర్మించి, నిర్వహించలేక టీటీడీకి అప్పగించినవే. వీటి ద్వారా ఏటా టీటీడీకి వచ్చే ఆదాయం కేవలం రూ.3.5 కోట్లు మాత్రమే. కానీ, వాటి నిర్వహణకు ప్రతి ఏటా రూ.20.1 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఆలయాలు ఆర్థిక భారంగా మారుతున్నా వెనక్కి వెళ్లలేని పరిస్థితి. నిజానికి... వెంకన్నకు వచ్చే ఆదాయంతో పోల్చితే ఏటా రూ.20 కోట్లు భరించడం కష్టమేమీ కాకపోవచ్చు. కానీ... ఇందులో ఆర్థిక అంశాలకు అతీతమైన సమస్యలున్నాయి. ఒక్కసారి టీటీడీ ఏదైనా ఆలయాన్ని తన పరిధిలోకి తీసుకుంటే... స్వామి వారి కైంకర్యాలను నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం నిర్వహించాల్సిందే. 'టీటీడీ గుడి' కాబట్టి... వేడుకలు, ఉత్సవాలను కూడా ఘనంగా నిర్వహించాలని భక్తులు ఆకాంక్షిస్తారు. ఇక... అప్పటికి ఆ ఆలయాల్లో పని చేస్తున్న సిబ్బందితో న్యాయపరమైన చిక్కులు వస్తున్నాయి. 'గుడితోపాటు మమ్మల్నీ టేకోవర్ చేసుకోవాల్సిందే' అంటూ ఇప్పటికే టీటీడీపై పలువురు కేసులు వేశారు. అన్నింటికంటే మించి... మారుమూల ప్రాంతాల్లో ఉన్న 'టేకోవర్' ఆలయాల్లో పని చేసేందుకు టీటీడీ సిబ్బంది ముందుకు రావడంలేదు. ఇలా అనేక అంశాలు ముడిపడి ఉండటంతో... ప్రైవేటు ఆలయాలను తన పరిధిలోకి తీసుకోకూడదని 1997లో నిర్ణయించుకుంది. అప్పుడూ సీఎంగా ఉన్న చంద్రబాబు టీటీడీ బోర్డు ద్వారా ఈ తీర్మానం చేయించారు. ఆ తర్వాత... 'మా ఆలయాన్ని టేకోవర్ చేయండి' అంటూ పదుల కొద్దీ విన్నపాలు వచ్చాయి. కానీ... బోర్డు ససేమిరా అంది. 2005లో కూడా 'ఎలాంటి ఆలయాలను టీటీడీ పరిధిలోకి తీసుకోవడానికి వీల్లేదు' అని తీర్మానం చేసింది. 2021లో దీనికి చిన్న వెసులుబాటు ఇచ్చారు. నేరుగా ఆలయాల నిర్వహణ చేపట్టకుండా... ధూపదీప నైవేద్యానికీ ఇబ్బందుల్లో ఉన్న వాటికి మాత్రం శ్రీవాణి ట్రస్ట్ నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద సాయం చేయాలని అప్పటి బోర్డు తీర్మానం చేసింది. ఇలా కొన్ని వందల ఆలయాలకు ఆర్థిక సహకారం అందిస్తోంది.

ఇన్నేళ్లకు ఇలా..

దాదాపు 28 ఏళ్ల కిందట మూసేసిన 'టేకోవర్' గేట్లను టీటీడీ ఇప్పుడు తెరిచేసింది. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏ.వి.నగరం గ్రామంలో ఉన్న 'శ్రీ శ్రీదేవీ భూదేవీ సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి' ఆలయాన్ని టీటీడీ తన పరిధిలోకి తీసుకుంది. దీనిపై టీటీడీ బోర్డు చేసిన తీర్మానం మేరకు జీవో విడుదలైంది. కొత్త సంవత్సరం తొలిరోజైన గురువారం దేవదాయ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ హరిజవహర్ లాల్ ఈ ఏడాది విడుదల చేసిన తొలి జీవో ఇదే. మాజీ మంత్రి యనమల సిఫార్సులతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం యనమల సొంత గ్రామమైన ఏ.వి.నగరంలో ఉంది. దీనిని టీటీడీ పరిధిలోకి తీసుకోవాలని ఆయనే బోర్డును కోరారు. దీనిపై 2024 డిసెంబరులో టీటీడీ ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ సదరు ఆలయాన్ని సందర్శించి... ఆలయ విస్తీర్ణం, సిబ్బంది, ఆదాయ వ్యయాలు, ఆస్తులు, ఇతర అంశాలన్నింటితో బోర్డుకు నివేదిక సమర్పించింది. ఒక ట్రస్ట్ పేరుతో నిర్వహణలో ఉన్న ఆలయ నిర్వహణకు ఏటా రెండు కోట్ల అదనపు ఖర్చు అవుతుందని తెలిపింది. ఈ నివేదికను 2025 అక్టోబరు 28వ తేదీన జరిగిన బోర్డు మీటింగ్‌లో అధికారులు ప్రవేశపెట్టారు. దీనిపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఇకపై కొత్తగా ప్రైవేటు ఆలయాలను స్వీకరించరాదంటూ గతంలో వేర్వేరు సందర్భాల్లో చేసిన తీర్మానాలనూ పొందుపరుస్తూ... యనమల విజ్ఞప్తిని తోసిపుచ్చారు. ఏ.వి.నగరంలోని ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు నిరాకరించారు.

మారిన సీన్...

రెండు నెలల్లోనే సీన్ మారిపోయింది. అదే ప్రతిపాదనను గత నెల 16న జరిగిన బోర్డు సమావేశంలో ఆమోదించారు. విచిత్రమేమిటంటే... అంతకుముందు నిరాకరణకు కారణాలన్నీ ఇందులోనూ ప్రస్తావించారు. చివర్లో మాత్రం... అప్పుడు 'డిఫర్డ్'... ఇప్పుడు 'అప్రూవ్డ్'! ఇలాగే, ఇకపైనా మరింతమంది నేతలు, 'పవర్‌ఫుల్' సిఫారసులతో ఒత్తిళ్లు తెస్తే టీటీడీ ఏం చేస్తుంది? గతంలో లాగా నిర్ద్వంద్వంగా 'నో' చెప్పగలదా? అలా చెబితే యనమల ఊరిలోని గుడికి ఒక రూలు... మాకు ఒక రూలా? అని నిలదీయరా? ఏళ్లతరబడి అమలు చేస్తున్న తీర్మానాన్ని ఒక్కరి కోసం ఎందుకు పక్కన పెట్టినట్లు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం, టీటీడీ బోర్డే సమాధానం చెప్పాలి!

పాత మాటే 'కొత్త'గా!

(మొదటి పేజీ తరువాయి)

బాధితులకు ఇచ్చిన భూములను 22 (ఏ) నుంచి తొలగిస్తున్నట్టు మంత్రి గురువారం చెప్పారు. కొత్త ఏడాది తొలిరోజున ఆ ఫైలుపైనే సంతకం చేశానని చెప్పారు. వాస్తవానికి ఈ కేటగిరి భూములను పదేళ్ల నిర్దిష్ట గడువు తర్వాత నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వ ఉత్తర్వులు గత కొన్నేళ్లుగా అమల్లో ఉన్నాయి. 2014-19 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వమే ఈ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదే విషయంపై జగన్ ప్రభుత్వం కూడా పలు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత రెవెన్యూ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ గత జగన్ ప్రభుత్వంలోనూ రెవెన్యూ శాఖ బాస్‌గా ఉన్నారు. సీసీఎల్ఏగా కూడా పనిచేశారు. ఈ కేటగిరీల భూములను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధిత జాబితా నుంచి తొలగించాలని 2022-2024 కాలంలో అనేక ఉత్తర్వులు ఇచ్చారు. అలాంటి ఆదేశాలను గుదిగుచ్చి రెవెన్యూ బుక్‌లెట్‌గా ముద్రించారు. అసలు సమస్య వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడమే. రెవెన్యూ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను నాటి నుంచి నేటి వరకు కొందరు కలెక్టర్లు, జేసీలు అమలు చేయడం లేదు. దీంతో కొన్నిరకాల భూములను కాలానుగుణంగా నిషేధ విముక్తి కల్పించడం అనేది కలెక్టర్లు, అధికార పార్టీ నేతల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిపోయింది. ఇప్పటికీ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అందుకే రెవెన్యూ శాఖ పనితీరు పట్ల సంతృప్తి స్థాయి అధ్వానంగా ఉంటోంది.

1954 ముందు వాటికీ...

1954కు ముందు అసైన్ చేసిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్టు తాజాగా మంత్రి అనగాని చెప్పారు. వాస్తవానికి ఈ కేటగిరి భూములను 22(ఏ) నుంచి తొలగించాలని 2018లోనే ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అంటే.. 1954కు ముందు అసైన్‌మెంట్ అయిన భూములను వాటి రికార్డుల ఆధారంగా రైతులు వచ్చి అడగకముందే జిల్లా స్థాయిలో నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. కానీ వాస్తవం ఏంటంటే.. రైతులు వచ్చి అన్నీ రకాల ఆధారాలు ఇచ్చినా కొందరు కలెక్టర్లు పట్టించుకోవడం లేదు. ఇప్పుడు ఈ కేటగిరి భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఫైలుపై సంతకం చేశామని మంత్రి చెబుతున్నారు. నిషేధిత జాబితా నుంచి ఈ కేటగిరి భూములను తొలగించాలని 2014-19లో, మరోసారి 2022-2024 కాలంలోనే ఉత్తర్వులు, మార్గదర్శకాలు విడుదలయ్యాక, ఇప్పుడు కొత్తగా మరోసారి ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటి? లోగడ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయని కలెక్టర్లు, జేసీలు, రెవెన్యూ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాల్సింది పోయి.. మళ్లీ కొత్త కాగితంపై పాత ఉత్తర్వు చందంగా ఆదేశాలు ఇవ్వడం రెవెన్యూ శాఖ ప్రతిష్ఠను పెంచేదిగా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చర్యలేవి మంత్రిగారు?

గత జగన్ ప్రభుత్వంలో 13 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయగా, 5.75 లక్షల ఎకరాలను అక్రమంగా నిషేధిత జాబితా నుంచి తీశారని కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఈ పాపంలో వైసీపీ నేతలతో పాటు నాటి ప్రభుత్వంలోని కొందరు కలెక్టర్లు, జేసీలు, ఆర్డీవోలు, తహశీల్దార్ల పాత్ర ఉంది. ఇదే అంశంపై నాటి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆర్.పి.సిసోడియా నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబుకే ఓ నివేదిక ఇచ్చారు. ఫ్రీ హోల్డ్ అక్రమాల్లో ఎందరు ఐఏఎస్‌ల పాత్ర ఉందో ఆ నివేదికలో పేర్కొన్నారు. ఇక కిందిస్థాయి అధికారుల పాత్ర అపరిమితం. 15 నెలలు గడిచినా కూటమి ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ అక్రమాలపై ఒక్కనేతపై, ఒక్క అధికారిపై కూడా విచారణ లేదు. ఏ చర్యలూ లేవు. అక్రమాలకు వెన్నుదన్నుగా ఉన్న అధికారులపై విచారణ చేయకుండా, నిగ్గుతేల్చకుండా ఇంకెంతకాలం నాన్చుతారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఇంకెంతకాలం ఫ్రీ హోల్డ్‌ను సాగదీస్తారు?

అక్రమాలను అరికట్టే పేరిట అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్‌ను కూటమి సర్కారు నిలిపివేసింది. ఆ భూముల రిజిస్ట్రేషన్‌లు ఆపేసింది. ఈ సమస్యకు సత్వర పరిష్కారం చూపేందుకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఇప్పటికే పది నెలలవుతోంది. ఎలాంటి పురోగతి లేదు. సెప్టెంబరులో జిల్లా కలెక్టర్ల సమావేశం జరిగినప్పుడు నెలరోజుల్లో ఫ్రీ హోల్డ్ అంశాన్ని పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ఆ గడువు దాటిపోయింది. నవంబరులో నిర్వహించిన సమీక్షలో నెలరోజుల గడువు ఇచ్చారు. అదీ వెళ్లిపోయింది. చివరకు డిసెంబరు మొదటి వారంలో జరిగిన సమీక్షలో ఒక్క నెలలో సమస్యను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ఆ గడువు కూడా దాటిపోయింది. తాజాగా నిషేధిత జాబితా నుంచి 5 రకాల భూములను తొలగిస్తున్నట్టు చెప్పిన అనగాని.. మరో 4 రకాల భూముల సమస్య పరిష్కారానికి మరో రెండు నెలల సమయం పడుతుందని చెప్పారు. రైతులు ఈ సమస్య పరిష్కారం కోసం ఇంకెంతకాలం ఎదురుచూడాలో మరి!

22(ఏ) నుంచి 5 రకాల భూముల తొలగింపు: అనగాని

నూతన సంవత్సర కానుకగా నిషేధిత భూముల జాబితా 22(ఏ) నుంచి ఐదు రకాల భూములకు విముక్తి కల్పించామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నూతన సంవత్సరంలో దీనికి సంబంధించిన ఫైలుపై తొలి సంతకం చేసినట్లు చెప్పారు. గురువారం మంత్రి అనగాని సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి శాఖాపరంగా తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. ప్రస్తుతం ఐదు రకాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించామని, మరో నాలుగు రకాల భూములపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మాజీ, ప్రస్తుత సైనికోద్యోగులకు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములు, 1954కు ముందు అసైన్‌మెంట్ చేసిన భూములు, ఇంకా ప్రైవేటు పట్టా భూములను జాబితా నుంచి తొలగించినట్లు వెల్లడించారు. కొంత భూమి కోసం మొత్తం సర్వే నంబర్‌నే నిషేధిత జాబితాలో చేర్చిన ఉదంతాలపై మంత్రి స్పందించారు. ఆ భూములను సబ్ డివిజన్ చేసి అవసరం ఉన్న వాటినే నిషేధిత జాబితాలో చేర్చాలని, అవసరం లేని వాటికి విముక్తి కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. షరతుగల పట్టా, సర్వీసు ఇనాం, రీ సర్వే సమయంలో నిషేధిత జాబితాలో చేర్చిన చుక్కల భూములకు విముక్తి కల్పించే విషయంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అన్నిపత్రాలు ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, రైతులను పదేపదే ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దని అధికార యంత్రాంగానికి సూచించారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడ్డారని, వాటిపై గత ఏడాదిన్నర కాలం నుంచి సమగ్ర విచారణ చేయిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో భూ అక్రమాలకు పాల్పడిన వారందరూ ఈ ఏడాది ఫలితం అనుభవిస్తారని హెచ్చరించారు. గత ఏడాది నకిలీ మద్య నామ సంవత్సరంగా సాగిందని, నకిలీ మద్యం కేసులో ఉన్న వ్యక్తులు జైలుకెళ్లారని అన్నారు. ఈ ఏడాది భూ అక్రమార్కుల వంతు అని చెప్పారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ ఉద్యోగుల పనివిధానాన్ని మెరుగుపరిచేందుకు ఆకస్మిక తనిఖీలు చేపడుతామని తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని అదనపు ఉద్యోగులను రెవెన్యూలోకి తీసుకునేందుకు ఒక కమిటీ నియమించినట్లు మంత్రి తెలిపారు. రైతులకు శుక్రవారం నుంచి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. 21.80 లక్షల పాసుపుస్తకాలు రైతులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాల్గొంటారని తెలిపారు. నకిలీ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్లకు ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు.

రాజధాని 'అసైన్డ్' రైతులకు విముక్తి

- కొత్త ఏడాది.. కొత్త పట్టాల జారీకి సన్నాహాలు
- రిటర్నబుల్ ప్లాట్లకు 'అసైన్డ్' పదం తొలగింపు
- జీవో 187తో వాటిపై రైతులకు సర్వ హక్కులు
- ఇకపై దళారుల భూదందాలకు ప్రభుత్వం చెక్
- దశల వారీగా అన్ని సమస్యలకూ పరిష్కారం

గుంటూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన అసైన్డ్ రైతులకు సమస్యల నుంచి సంపూర్ణ విముక్తి లభించింది. సమస్యాత్మకంగా ఉన్న పాత పట్టాల స్థానంలో కొత్త ఏడాది కొత్తగా రిటర్నబుల్ ప్లాట్ల పట్టాలు ఇచ్చేందుకు సీఆర్డీఏ సిద్ధమైంది. ఇప్పటికే కౌలు బకాయిలు, సీఐడీ కేసులను పరిష్కరించిన ప్రభుత్వం.. ఇప్పుడు గతంలో రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి ఇచ్చిన పట్టాల్లో 'అసైన్డ్' అనే పదాన్ని తొలగించి కొత్తవి జారీ చేయనుంది. దీంతో దళారుల ఆగడాలకు చెక్ పడనుంది.

అసైన్డ్ పదంతో అడ్డగోలు దోపిడీ

రాజధాని అమరావతి కోసం 3,139 మంది అసైన్డ్ రైతులు 2,689.14 ఎకరాల భూములు ఇచ్చారు. వీరికి సీఆర్డీఏ ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల పట్టాలు సమస్యాత్మకంగా తయారయ్యాయి. రైతులు ఇచ్చిన భూమి వివరాలు తెలిపే చోట ఉన్న 'అసైన్డ్' అనే పదాన్ని ఆసరా చేసుకుని దళారులు వారిని ఇష్టారాజ్యంగా దోచుకున్నారు. గజానికి రూ.10 నుంచి 20వేలు తగ్గించి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో వారి మొరను ఆలకించిన సీఎం చంద్రబాబు దిద్దుబాటు చర్యలకు ఆదేశించారు. రైతులకు ఇచ్చే పట్టాల్లో 'అసైన్డ్' పదం తొలగిస్తూ పురపాలక శాఖ గతేడాది అక్టోబరులో జీవో 187 జారీ చేసింది. రైతులకు జారీచేసిన పట్టాల్లో భూ సమీకరణ చట్టంలో 9.24లోని కాలమ్ నం.7, రూల్ నం.11(4) క్లాజ్‌ను మార్చాలని సూచించింది. ఆ మేరకు రిటర్నబుల్ ప్లాట్ల పట్టాదారులకు యాజమాన్య హక్కు కల్పిస్తూ పట్టాలు జారీ చేయాలని పేర్కొంది. అయితే కొత్తగా ఇచ్చే పట్టాలకే జీవో వర్తిస్తుందని సీఆర్డీఏ చెప్పడంతో కొంత గందరగోళం నెలకొంది. దీంతో అప్పటికే పట్టాలు పొందిన 95 శాతం మంది రైతులు మరోసారి సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ వద్ద మొరపెట్టుకున్నారు.



ఈ నేపథ్యంలో పాత పట్టాల స్థానంలో దరఖాస్తు చేసుకున్న పలువురు రైతులకు కొత్త పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఒక్కో సమస్యకు పరిష్కారం

రాజధాని కోసం అసైన్డ్ రైతులు ఇచ్చిన భూములపై గత వైసీపీ సీఐడీ విచారణ తంతు నడిపించింది. చివరకు ఆ భూములను 'నాట్ ట్యాలీడ్' జాబితాలో పెట్టింది. 8, 9, 10 ఏళ్లకు సంబంధించి రైతులకు ఇవ్వాల్సిన వార్షిక కౌలును కూడా ఆపేసింది. దీంతో ఆ అసైన్డ్ రైతులు నరకం అనుభవించారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే సమస్యపై దృష్టి పెట్టింది. సీఐడీ కేసుల నుంచి రైతులకు విముక్తి కల్పించింది. మూడేళ్ల కౌలు బకాయిలను చెల్లించింది. అయితే పట్టాల్లో ఉన్న 'అసైన్డ్' అనే పదం కారణంగా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల వద్ద కూడా అవి చెల్లుబాటయ్యే పరిస్థితి లేకుండా పోయింది. తాజాగా ఇవ్వనున్న కొత్త పట్టాలతో ప్లాట్లపై రైతులకు అన్ని హక్కులు దఖలు పడనున్నాయి. ప్రభుత్వం నిర్ణయంపై అసైన్డ్ రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉపాధి చట్టాల మార్పు జాతీయ నేరం

- కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలు అనివార్యం
- ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె: తపన్‌సేన్

విశాఖపట్నం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఉపాధి కూలీల చట్టాలను మార్చి, పేదలకు ఉపాధి లేకుండా చేయడం జాతీయ నేరమని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ అన్నారు. విశాఖపట్నంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సీఐటీయూ ఆలిండియా 18వ మహాసభలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని మార్చడంతో ఉపాధికి గ్యారంటీ పోయిందని, భూస్వాముల పొలాల్లో కూలీలు పనిచేస్తేనే ఈ పథకం ద్వారా డబ్బులు చెల్లిస్తామనడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పథకం కింద కూలీలకు వంద శాతం డబ్బును కేంద్రమే ఇవ్వాల్సి ఉండగా, రాష్ట్రాలు 40 శాతం వాటా భరించాలని నిబంధన విధించిందన్నారు. ఫలితంగా రాష్ట్రాలపై భారం పెరుగుతుందని, రాష్ట్రం వద్ద డబ్బు లేకపోతే ఈ పథకం ముందుకు నడవదని అభిప్రాయపడ్డారు. 2005 నుంచి అమలులో ఉన్న చట్టాన్ని ధ్వంసం చేయడం ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేయడమేనన్నారు. ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం దేశంలో 50 శాతం ప్రజల వద్ద పది శాతం సంపద ఉంటే.. ఆరు శాతం ఉన్న కార్పొరేట్‌ల వద్ద 50 శాతం సంపద ఉందని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సమతుల్యతలో కేంద్రం ఘోరంగా విఫలమైందనడానికి ఇదే నిదర్శనమన్నారు. లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులపై దాడి చేసేలా ప్రజా వ్యతిరేక (యాంటీ పీపుల్ ఫేస్) పాలనను ప్రధాని మోదీ సాగిస్తున్నారని తపన్‌సేన్ విమర్శించారు. విశాఖలో ఐదు రోజులపాటు జరిగే అఖిల భారత మహాసభల్లో భవిష్యత్తు కార్మిక, కర్షక పోరాటాలపై అన్ని రాష్ట్రాల ప్రతినిధులు చర్చిస్తారన్నారు. గురువారం జరిగిన మహాసభలో ఉపాధి హామీ చట్టం నిర్వీర్యంపై తీర్మానం చేస్తూ, ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెకు సిద్ధమయ్యేలా ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించినట్టు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆగడానికి కార్మికుల పోరాటమే కారణమన్నారు. అణచివేయడానికే లేబర్ కోడ్‌లు తెచ్చినా కార్మికులు సమరశీలంగా పోరాడారని చెప్పారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కారదర్శి సీహెచ్ నరసింగరావు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తపన్‌సేన్. చిత్రంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కారదర్శి సీహెచ్ నరసింగరావు

ఐఐటీహెచ్ విద్యార్థికి రూ.2.5 కోట్ల ప్యాకేజీ

కంది, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ హెచ్(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్)కు చెందిన ఓ విద్యార్థి రూ.2.5 కోట్ల ప్యాకేజీతో ఉద్యోగ అవకాశం దక్కించుకున్నారు. ఐఐటీహెచ్‌కి చెందిన సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థి ఎడ్వర్డ్ నాథన్ వర్గీస్(21) ఈ ఘనత సాధించారు. 2025 డిసెంబరులో జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో నెదర్లాండ్‌కు చెందిన ఆప్టివర్ అనే సంస్థ వర్గీస్‌కు రూ.2.5 కోట్ల ప్యాకేజీతో ఉద్యోగావకాశం (ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్) ఇచ్చింది. దీంతో ఐఐటీహెచ్ చరిత్రలో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో అత్యధిక ప్యాకేజీ సాధించిన విద్యార్థిగా వర్గీస్ నిలిచారు. కాగా, 2025లో ఐఐటీహెచ్ విద్యార్థులు 24 అంతర్జాతీయ జాబ్ ఆఫర్లు సొంతం చేసుకున్నారని, 2024తో పోలిస్తే ప్యాకేజీలు 75 శాతం పెరిగాయని ఐఐటీహెచ్ అధికారులు గురువారం ప్రకటించారు.


ఎడ్వర్డ్ నాథన్ వర్గీస్

'మద్దతు' ఇవ్వని మార్కెట్

- జనవరి, ఫిబ్రవరిలోనూ పంట ఉత్పత్తుల ధరలు తక్కువే
- అగ్రి వర్సిటీ మార్కెట్ ఇంటెలిజెన్స్ సెంటర్ అంచనా

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలోనూ వివిధ పంట ఉత్పత్తుల ధరలు పెరిగే సూచనలు లేనట్టు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ మార్కెట్ ఇంటెలిజెన్స్ సెంటర్ (ఏఎంఐసీ) అంచనా వేసింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో 12 రకాల ప్రధాన పంటల ముందస్తు ధరలను ఏఎంఐసీ వెల్లడించింది. గత 10-25 ఏళ్ల ధరలను విశ్లేషించి, వివిధ మార్కెట్లను పరిశీలించి ధరలను అంచనా వేసినట్టు పేర్కొంది. వరి సాధారణ రకం క్వింటా రూ.1,915-2,235, సన్నాలు రూ.2,285-2,647, సాధారణ రకాలైన మొక్కజొన్న రూ.1,875-2,135, జొన్న రూ.2,150-2,430, కందులు రూ.5,950-6,425, మినుములు రూ.5,895-6,745, పెసలు రూ.7,875-8,570, శెనగ రూ.4,725-5,210, వేరుశనగ రూ.6,725-7,220, పత్తి విత్తనంతో రూ.6,890-7,675, మిర్చి రూ.16,425-17,395, ప్రత్యేక రకం రూ.17,285-18,390, పసుపు కాయలు రూ.11,875-12,750, కొమ్ములు రూ.12,850-13,550, బెల్లం రూ.3,425-3,815 ఉండొచ్చని అంచనా వేసింది. వాస్తవంగా వరి సాధారణ రకం రూ.2,369, ఏ గ్రేడ్ రూ.2,389, మొక్కజొన్న రూ.2,400, జొన్న రూ.3,699-3,749, కంది రూ.8 వేలు, మినుములు రూ.7,800, పెసలు రూ.8,768, వేరుశనగ రూ.7,263, పత్తి రూ.7,710-8,110, శెనగ రూ.5,875గా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించింది. మార్కెట్ ఇంటెలిజెన్స్ సెంటర్ అంచనా ధరలన్నీ ఖరీఫ్ పంటల మద్దతు ధరల కన్నా చాలా తక్కువగా ఉన్నాయి. ధరలు పెరగకపోవడానికి కారణాలను ఏఎంఐసీ వెల్లడించలేదు. అయితే పంట రకం, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి, దిగుమతి, వాతావరణ పరిస్థితి, ప్రభుత్వ మధ్యంతర జోక్యం, ఇతర కారణాలతో ధరల్లో కొద్దిగా వ్యత్యాసాలు ఉండొచ్చని రంగా వర్సిటీ వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం ప్రధాన పరిశోధకులు ఐవీవై రామారావు స్పష్టం చేశారు.

సీఈసీతో జనసేన ప్రతినిధుల భేటీ

- 'సర్', ఎన్నికల సంస్కరణలపై సలహాలు, సూచనలు అందజేసిన పార్టీ ప్రతినిధులు

న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌తో జనసేన పార్టీ ప్రతినిధులు సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్‌లో గురువారం జరిగిన ఈ భేటీలో ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి కూడా పాల్గొన్నారు. జనసేన పార్టీ తరపున ఇ.ప్రతాప్ కుమార్, ఆర్.ఎం.వి.సుమంత్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంస్కరణలపై తమ సూచనలు, సలహాలను వారు కమిషన్‌కు వివరించారు. జనసేన బృందం సూచనలను, వినతి పత్రాలను కేంద్ర ఎన్నికల సంఘం స్వీకరించింది.



రేషన్ దుకాణాల్లో గోధుమ పిండి పంపిణీని ప్రారంభిస్తున్న పౌరసరఫరాల ఎండీ ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా, తదితరులు

రేషన్ షాపుల్లో గోధుమపిండి పంపిణీ

▸▸ విజయవాడలో ప్రారంభించిన పౌరసరఫరాల సంస్థ ఎండీ

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో గోధుమపిండి పంపిణీ ప్రారంభమైంది. పౌరసరఫరాల సంస్థ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం విజయవాడలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలతోపాటు కొన్ని ముఖ్యపట్టణాలు, నగరాల్లో ప్రయోగాత్మకంగా గోధుమపిండి పంపిణీ చేపట్టారు. ఇది విజయవంతమైతే తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ఢిల్లీరావు తెలిపారు. 'కేంద్రప్రభుత్వం ప్రతినెలా 1800 టన్నుల గోధుమలను రాష్ట్రానికి కేటాయిస్తోంది. కానీ, ఇప్పటివరకు వాటిని రాష్ట్రం తీసుకోలేదు. గోధుమల్లో పోషకాలు ఎక్కువగా ఉండటం వల్ల కేంద్రం నుంచి గోధుమలను తీసుకున్నాం. వాటిని పిండిగా మార్చి కార్డుదారులకు కిలో ప్యాకెట్ల రూపంలో కేజీ రూ.20కు అందిస్తున్నాం' అని చెప్పారు. కార్డుదారులకు ఇప్పటి వరకు ఉచిత బియ్యం, అరకేజీ పంచదార ఇస్తున్నారు. దీంతోపాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో జొన్నలు, రాగులు పంపిణీ చేస్తున్నారు. పండుగ నెలలో కేజీ గోధుమ పిండిని కూడా రాయితీ ధరకు అందిస్తుండటంతో కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయంలో ఎస్పీఎఫ్ సిబ్బంది నిజాయితీ

▸▸ పోగొట్టుకున్న బంగారం గొలుసు మహిళా అధికారికి అప్పగింత



పోగొట్టుకున్న గోల్డ్ చైన్‌ను ఎస్‌వో పద్మకు అందజేస్తున్న పోలీసులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజోతి): మహిళా ఉద్యోగి పోగొట్టుకున్న బంగారం గొలుసును తిరిగి ఆమెకు అప్పగించి అమరావతి సచివాలయ భద్రతా సిబ్బంది ప్రశంసలు అందుకున్నారు. రెవెన్యూశాఖలో సెక్షన్ అధికారి(ఎస్‌వో)గా విధులు నిర్వహిస్తున్న పద్మ గురువారం ఉదయం విధులకు హాజరయ్యే సమయంలో సచివాలయం గేటు-2 వద్ద ఆమె బంగారు గొలుసు కింద పడిపోయింది. ఆ సమయంలో ఆ గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ జనార్దన్‌రావు ఆ గొలుసును సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి మల్లికార్జునకు అప్పగించారు. అనంతరం సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన అధికారులు ఆ గొలుసును ఎస్‌వో పద్మకు అప్పగించారు. నిజాయితీగా వ్యవహరించిన జనార్ధనరావును, ఎస్పీఎఫ్ సిబ్బందిని ఉద్యోగులు ప్రశంసించారు.

మంత్రిగా నేను చేయలేని పని దీపిక చేసింది!

▸▸ అంధ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికపై మాజీ మంత్రి రఘువీరా ప్రశంస



దీపిక అభినందన సభలో రఘువీరా తదితరులు

మడకశిర రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మంత్రిగా పనిచేసిన సమయంలో తాను చేయలేని పనిని భారత అంధ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక చేసిందని మాజీమంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అభినందించారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలోని రఘువీరారెడ్డి స్వగ్రామమైన నీలకంఠాపురంలో గురువారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా దీపికను ఘనంగా సన్మానించారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నపుడు మడకశిర నియోజకవర్గంలోని తంబాలహట్టి గ్రామానికి రోడ్డు వేయలేకపోయానన్నారు. తాను చేయలేని పనిని దీపిక.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధించిందని ప్రశంసించారు. ఆమె స్వగ్రామమైన అమరాపురం మండలంలోని తంబాలహట్టికి రూ.6.5 కోట్లతో రోడ్డు మంజూరు చేయించుకుందని అభినందించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో కెప్టెన్ దీపికతో కలసి క్రికెట్ ఆడారు. అభినందన సభలో చిన్ననాటి గురువుల పాదాలకు రఘువీరారెడ్డి అభిషేకం చేసి, వారి దీవెనలు అందుకున్నారు. గురువుతో బెత్తంతో కొట్టించుకుని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

మరో 3.5 కిలోల బంగారం రికవరీ

▸▸ తూమకుంట ఎస్బీఐ చోరీ కేసులో పురోగతి

హిందూపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం తూమకుంట (పారిశ్రామికవాడ) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ చోరీ కేసుకు సంబంధించి మరో 3.5 కిలోల బంగారం ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇదివరకే పోలీసులు 2 కిలోల బంగారం రికవరీ చేశారు. దీంతో మొత్తం 5.5 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నట్లయింది. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమర్ గురువారం హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో వెల్లడించారు. గతేడాది జూలై 27న తూమకుంట ఎస్బీఐ శాఖకు దుండగులు కన్నం వేసి, ఖాతాదారుల లాకర్లలోని 11.2 కిలోల బంగారం, రూ.40 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. సెలవుల అనంతరం రెండ్రోజులకు గుర్తించిన బ్యాంకు అధికారులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై అప్పట్లో కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. హరియాణ రాష్ట్రం గుర్గావ్ జిల్లా మారుతికుంజ్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ పన్వార్, రాజస్థాన్‌కు చెందిన మహ్మద్ ఇస్రార్ ఖాన్ చోరీకి పాల్పడినట్లు తేల్చారు. అనిల్‌కుమార్ పన్వార్‌ను ఆగస్టులో అరెస్టు చేసి, అతడి నుంచి 2 కిలోల బంగారం, నేరానికి ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేశారు. రాజస్థాన్‌కు చెందిన మహ్మద్ ఇస్రార్‌ఖాన్ రాజస్థాన్ జైలులో ఉండగా కస్టడీలోకి తీసుకుని, విచారించారు. అతడి స్వగ్రామమైన రాజస్థాన్ రాష్ట్రం కరోలి జిల్లా సలంపూర్ వద్ద పొలాల్లో దాచి ఉంచిన బంగారం ఆభరణాలు, కరిగించి కడ్డీలు చేసిన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన బంగారాన్ని కూడా రికవరీ చేస్తామని డీఎస్పీ మహేష్, సీఐ ఆంజనేయులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బంగారం ఆభరణాలు

గాలి జనార్దన్‌రెడ్డిపై హత్యాయత్నం!

▸▸ బళ్లారిలో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి సన్నిహితుడి కాల్పులు

▸▸ గన్‌మన్ నుంచి తుపాకీ లాక్కుని.. రెండు రౌండ్లు కాల్చిన సతీశ్‌రెడ్డి

▸▸ తప్పించుకున్న మాజీ మంత్రి

▸▸ పరస్పరం ఇరు వర్గాల కాల్పులు

▸▸ ఒకరి మృతి.. సతీశ్‌రెడ్డికి తీవ్ర గాయాలు

▸▸ బళ్లారిలో తీవ్ర ఉద్రిక్తత.. పోలీసుల మోహరింపు

బళ్లారి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. గురువారం రాత్రి బళ్లారిలో హవంబావి ప్రాంతంలోని ఆయన ఇంటి వద్దే బళ్లారి నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి సన్నిహితుడు సతీశ్‌రెడ్డి కాల్పులు జరిపాడు. అయితే జనార్దన్‌రెడ్డి తప్పించుకున్నారు. ఈ ఘటనతో బళ్లారిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గాలి జనార్దన్‌రెడ్డి, బళ్లారి రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బళ్లారిలోని ఎస్పీ సర్కిల్‌లో మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ఈనెల 3న ఏర్పాటు చేయనున్నారు. నగరవ్యాప్తంగా ఫ్లెక్సీలు కడుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం హవ్వబావి ప్రాంతంలోని జనార్దన్‌రెడ్డి ఇంటి ప్రహరీకి కూడా సతీశ్‌రెడ్డి దగ్గరుండి ఫ్లెక్సీలు కట్టిస్తున్నాడు. జనార్దన్ రెడ్డి అనుచరులు అడ్డుచెప్పారు. ప్రహరీకి వద్దని, బయట కట్టుకోవాలని సూచించారు. సతీశ్‌రెడ్డి వినకుండా కుర్చీ తెప్పించుకుని జనార్దన్‌రెడ్డి ఇంటి ముందు కాలుమీద కాలు వేసుకుని కూర్చుని.. 'ఇక్కడే ఫ్లెక్సీ కడతాను' అని పట్టుబట్టాడు. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ మొదలైంది. అదే సమయంలో గంగావతి నుంచి జనార్దన్‌రెడ్డి బళ్లారి ఇంటికి వచ్చారు. ఆయన్ను చూసి సతీశ్‌రెడ్డి తన అనుచరులను రెచ్చగొట్టాడు. ఫ్లెక్సీ కట్టేందుకు యత్నించడంతో జనార్దన్‌రెడ్డి అనుచరులు, సతీశ్‌రెడ్డి మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా పరస్పరం రాళ్ల దాడి చేసుకోవడంతో కొందరికి గాయాలయ్యాయి. గుంపును చెదరగొట్టేందుకు ఇద్దరి గన్‌మెన్ గాలిలోకి కాల్పులు జరిపారు. సతీశ్‌రెడ్డి ఓ గన్‌మన్ వద్ద తుపాకీ లాక్కుని.. జనార్దన్‌రెడ్డి వైపు రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. అయితే ఆయన తప్పించుకున్నారు. ఇదే సమయంలో ఇరువర్గాలూ కాల్పులకు దిగాయి. ఓ బుల్లెట్ తగిలి భరత్‌రెడ్డి వర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్ మరణించాడు. సతీశ్‌రెడ్డికి కూడా బుల్లెట్ గాయమైంది. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే బెంగళూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న గాలి సన్నిహితుడు, మాజీ మంత్రి శ్రీరాములు, కంప్లి ఎమ్మెల్యే సురేశ్‌బాబు, గాలి సోమశేఖర్‌రెడ్డి, వారి అనుచరులు అక్కడకు చేరుకున్నారు. అయితే ఇరు వర్గాలనూ పోలీసులు చెదరగొట్టారు. గొడవ జరిగినపుడు ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ఊరిలో లేరు. గొడవ గురించి తెలుసుకుని బళ్లారి వచ్చారు. అనుచరులతో ఎస్పీ సర్కిల్‌కు చేరుకున్నారు. తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు పెద్దఎత్తున రంగంలోకి దిగారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



బుల్లెట్‌ను చూపుతున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి

చిల్లర రౌడీలకు భయపడేది లేదు: జనార్దన్‌రెడ్డి

ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, అతడి నాన్న సూర్యనారాయణరెడ్డి, సతీశ్‌రెడ్డి లాంటి చిల్లర రౌడీలకు భయపడేది లేదనీ, ఇలాంటి వాళ్లను ఎంతోమందిని చూశానని గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. తనపై కాల్పులు జరపగా.. పక్కనే పడిపోయిన బుల్లెట్‌ను ఆయన మీడియాకు చూపారు. వాల్మీకి విగ్రహం ఏర్పాటు పేరుతో భరత్‌రెడ్డి అనవసర రాద్ధాంతం చేస్తున్నాడన్నారు. బళ్లారిలో విచ్చలవిడిగా మట్కా, పేకాట. గంజాయి విక్రయాలు, రౌడీయిజం నడిపిస్తున్నాడని.. ఎమ్మెల్యే వేధింపులు భరించలేక పలువురు పోలీసులు బదిలీ చేయించుకుని వెళ్లిపోయారని చెప్పారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీజేపీ నాయకులను.. ముఖ్యంగా తనను టార్గెట్ చేసి, హత్య చేయించాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.

తల వదిలేసి తోక పట్టుకున్నారు

(మొదటీ పేజీ తరువాయి)

కేసీఆర్ వెళ్లారు. మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడుతో శ్రీశైలం నుంచి ఏపీ రోజుకు నీటిని తరలించే సామర్థ్యం 13.50 టీఎంసీలు. ఒక నదిని తరలించే సామర్థ్యం దానికి ఉంది. తెలంగాణ ప్రాజెక్టులన్నీ పూర్తయినా రోజుకు 2 టీఎంసీలు తరలించలేం. ప్రస్తుతం 0.25 టీఎంసీలే వాడుకుంటున్నాం' అని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డిపై విచారణకు ఆదేశించాల్సి ఉందని.. ఎవరి బాగు కోసం ఈ ప్రాజెక్టు జూరాల నుంచి శ్రీశైలం పోయిందో.. వేల కోట్లు ఎవరింటికి పోయాయో తేలాల్సి ఉందని చెప్పారు. 'మూడు దశలు ఐదు స్టేజీలకు మారాయి. 22 పంపులు 37 అయ్యాయి. రూ.32,200 కోట్లతో పూర్తి కావలసిన ప్రాజెక్టు రూ.,84 వేల కోట్లు పెట్టినా పూర్తవుతుందనే గ్యారెంటీ లేదు. ఈ ప్రాజెక్టుకు జూరాల నుంచి నీటిని తరలించి ఉంటే... ఏపీ లబోదిబోమని ఏడ్చేది. జూరాల నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 35 రోజులు తరలిస్తే.. 70 టీఎంసీలతో ప్రాజెక్టు కింద నీటిని అందించే అవకాశం ఉండేది. జూరాల పూర్తిగా తెలంగాణ ప్రాజెక్టు. కర్ణాటక నుంచి కృష్ణా, బీమా జూరాల వద్దకే వస్తాయి. నీళ్ల వచ్చినవి వచ్చినట్లే జూరాల నుంచి లిఫ్టు చేసుకోవడానికి అవకాశం ఉండేది. తల (జూరాల)దగ్గరే నీళ్లను పట్టుకుంటే.. పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, మల్యాల దగ్గర చుక్క నీరు దొరికే అవకాశం ఉండేది కాదు. వచ్చింది వచ్చినట్లే తెలంగాణకు తరలిస్తే.. చంద్రబాబు, జగన్ ఎవరికి చెప్పుకొనే వారు..? మోదీ, సీఆర్ పాటిల్ దగ్గర ఏడవాల్సి వచ్చేది. ఈ రోజు నువ్వు చెంబెడు నీళ్ల దొంగతనం చేసే లోపల... వాళ్లు వంద కుండలు నీళ్ల తీసుకెళ్లే చాన్సిచ్చారు. పదేళ్ల వాళ్లకు అవకాశం ఇచ్చింది నువ్వే (కేసీఆర్). ఈరోజు మనం ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేసినా 2 టీఎంసీలు కూడా తీసుకెళ్లలేం. పాలమూరు-రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలంకు తరలించడం వల్లే నీటిలో అన్యాయం, నిధుల్లో దోపిడీ జరిగింది. ఇది అడుగుతాననే కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావడానికి వెనుకంజ వేస్తున్నారు. దీనిపై అంతర్గతంగా మాట్లాడి విచారణ జరువుదామని అధికారులకు ఆదేశాలివ్వగానే.. కేసీఆర్, హరీశ్‌రావు గోదావరి-బనకచర్ల వివాదాన్ని లేవనెత్తుతున్నారు' అని ఆరోపించారు. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీల కేటాయింపులు చేస్తే... అందులో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని కేసీఆర్, హరీశ్‌రావు సంతకాలు చేశారని రేవంత్ మండిపడ్డారు. పైగా ఈ ఒప్పందాన్ని ఏటా పొడిగించుకుంటూపోయారని తెలిపారు. తాము 555 టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలని ట్రైబ్యునల్‌ను కోరుతున్నామని చెప్పారు. బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌లో తెలంగాణ వాదనతో ఏపీ ఉక్కిరిబిక్కిరవుతోందన్నారు. తెలంగాణ సమర్థంగా వాదనలు వినిపిస్తోందని జగన్ కూడా చంద్రబాబుకు లేఖ రాశారని చెప్పారు. 'నీళ్ల వెనకాల కుచ్చిత రాజకీయం ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. 2019 ఎంపీ ఎన్నికల్లోనూ ఓడింది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో, సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోతూ వచ్చిన ఆ పార్టీ మనుగడ కష్టమవుతుందని గుర్తించే కేసీఆర్ బయటకు వచ్చి... ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు రేపాలని చూస్తున్నారు. నేను ఆంధ్రప్రదేశ్ సీఎంకు సహకారం అందిస్తున్నట్లుగా అపోహలు రేపుతున్నారు. తన పార్టీని బతికించుకోవడానికి ఒక అబద్ధాల సంఘాన్ని ఏర్పాటు చేసుకుని దాని ద్వారా ప్రచారం చేస్తున్నారు' అని దుయ్యబట్టారు. నీళ్ల విషయంలో వీరిద్దరూ చేసిన పాపాలకు ఉరితీసినా తప్పులేదన్నారు. ఇదే మధ్యప్రాచ్య దేశాలైతే చౌరస్తాలో ప్రజల చేత రాళ్లతో కొట్టించి చంపేసేవారని.. మనది ప్రజాస్వామ్య దేశం కాబట్టి ప్రజాస్వామ్యబద్ధంగానే ఎవరినైనా శిక్షించాలని, కసబ్‌ను కూడా చాలారోజులు జైల్లో బిర్యానీ పెట్టి, ఉరి తీశారని రేవంత్ వ్యాఖ్యానించారు.

హాస్టళ్లలో సోదాలు ఓ ప్రహసనం!

▸▸ తనిఖీలు చేసి నివేదికలు ఇస్తే ఏం లాభం?

▸▸ లోపాలు సరిదిద్దినప్పుడే ఫలితాలు: హైకోర్టు



అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అధికారుల తనిఖీలు ప్రహసనంగా మారుతున్నాయని హైకోర్టు పేర్కొంది. సోదాలు చేసి నివేదికలు ఇవ్వడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, లోపాలను సరిదిద్ది సమస్యలను పరిష్కరించినప్పుడే ఫలితాలు వస్తాయని స్పష్టంచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 3 వేలకు పైగా సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని, వాటన్నిటిలో ఉన్న సమస్యలను న్యాయస్థానం పరిష్కరించజాలదని.. వాటి పరిష్కారానికి తాలూకా, జిల్లా, రాష్ట్రస్థాయుల్లో యంత్రాంగం అవసరమని తెలిపింది. జీవో 46 ప్రకారం జిల్లా కలెక్టర్లు/జేసీలు పర్యవేక్షణ అధికారులు 2వారాలకోసారి హాస్టళ్లను సందర్శించి, రాత్రి వేళ్లలో అక్కడ బస చేయాల్సి ఉందని గుర్తుచేసింది. హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన పర్యవేక్షణకు సంబంధిత శాఖల అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేయాలని ఆదేశించింది. నెలకోసారి ఈ కమిటీ సమావేశమై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం హాస్టళ్లలో సదుపాయాల కల్పనను పర్యవేక్షించాలని నిర్దేశించింది. హాస్టళ్లలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలికసదుపాయాల కల్పనకు సంబంధించి నిర్దిష్ట గడువుతో సమగ్ర ప్రణాళిక రూపొందించి తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించకపోవడాన్ని సవాల్ చేస్తూ కాకినాడకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ దాఖలుచేసిన పిల్‌పై హైకోర్టు పలుమార్లు విచారణ జరిపింది. ఇటీవల విచారణ సందర్భంగా.. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల హాస్టల్లో 86మంది విద్యార్థులు కామెర్ల బారినపడడం, ఓ విద్యార్థి మరణించడం, 150మంది ఆస్పత్రిలో చేరడంపై దర్యాప్తునకు ఆదేశించింది. నివేదిక సమర్పించాలని విజయనగరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిని ఆదేశించింది. దీంతో కార్యదర్శి నివేదిక సమర్పించారు. బోరుబావి నుంచి తీసుకున్న నీటిని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో నిల్వచేసి తాగునీరుగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. 'హాస్టల్లో 611 మంది విద్యార్థులు ఉన్నారు. అదనపు స్నానపు గదులు, మరుగుదొడ్లు అవసరం. పిల్లలెవరికీ మంచాలు ఇవ్వలేదు. తరగతి గదుల్లోనే నిద్రిస్తున్నారు. ప్రత్యేక డార్మిటరీ నిర్మించాలి' అని సూచించారు. ఈ నివేదికను ధర్మాసనం ప్రస్తావించగా.. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి స్పందించారు. కురుపాం గురుకులంలో ఆర్వోప్లాంట్ ద్వారానే తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని హాస్టళ్లలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మరుగుదొడ్లు నిర్మిస్తున్నామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 320 ప్లాంట్లు మంజూరయ్యాయని చెబుతున్నప్పటికీ ప్రస్తుత అవసరాలకు ఏమాత్రం సరిపోవని ధర్మాసనంపేర్కొంది.

ఏంటీ నియామకం?

▸▸ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 'సీవోఈ' నియామకంపై తీవ్ర అభ్యంతరాలు

▸▸ రూల్స్ ప్రకారం వర్సిటీ అనుబంధ కాలేజీల ప్రొఫెసర్లకే సీవోఈగా చాన్స్

▸▸ కానీ, తిరుపతి స్విమ్స్ నుంచి ఎంపిక

▸▸ వర్సిటీ చరిత్రలోనే ఇది తొలిసారి

▸▸ శ్రీకాంత్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 'సీవోఈ' నియామకంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీవోఈ)గా డా. సీహెచ్ శ్రీకాంత్‌ను నియమిస్తూ ఆరోగ్యశాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీకి సంబంధం లేనివ్యక్తిని ఈ పోస్టులో నియమించడం ఇది తొలిసారి. దీనిని వైద్యులు తప్పుబడుతున్నారు. నిబంధనల ప్రకారం హెల్త్ వర్సిటీ అనుబంధ కాలేజీల్లో విధుల నిర్వహిస్తున్న ప్రొఫెసర్లను ఈ పోస్టులో నియమించాలి. అయితే, డా. సీహెచ్ శ్రీనివాస్ ప్రస్తుతం తిరుపతి స్విమ్స్‌లో అనాటమీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనను ఫారెన్ డిప్యుటేషన్ సర్వీసెస్ కింద రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకి తీసుకువచ్చి.. సీవోఈగా నియమించారు. దీనిపై తీవ్ర అభ్యంతరాల వ్యక్తం అవుతున్నాయి. 'సీవోఈ' పోస్టు అతి కీలకమైనది. వేల మంది వైద్య విద్యార్థుల భవిష్యతు సీవోఈ చేతుల్లోనే ఉంటుంటి. అలాంటి కీలకమైన పోస్టులో వర్సిటీ అనుబంధ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో విధులు నిర్వహించే ప్రొఫెసర్లను మాత్రమే ఇప్పటివరకూ నియమించారు. వర్సిటీ ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వం ఈ నిబంధన పాటిస్తూ వచ్చింది. అందుకు భిన్నంగా ఈసారి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందనేది ఆరోగ్యశాఖ అధికారులే సమాధానం చెప్పాలి.

రేపు కొండగట్టుకు పవన్ కల్యాణ్

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం కొండగట్టులో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు ఆయన హెలికాప్టర్‌లో జగిత్యాల చేరుకుంటారు. అక్కడి నుంచి కొండగట్టు వెళ్లి ఆంజనేయస్వామి దర్శనం చేసుకుంటారు. రూ.35 కోట్ల టీటీడీ నిధులతో చేపట్టనున్న వసతి గదుల సముదాయానికి ఆయన భూమి పూజ చేయనున్నారు. అనంతరం బృందావన్ రిసార్ట్స్‌లో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమవుతారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై పవన్ కల్యాణ్ చర్చిస్తారని జనసేన రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్‌గౌడ్ తెలిపారు.

ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా...

▸▸ త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి

▸▸ 'అప్సా' నూతన అధ్యక్షుడిగా రామకృష్ణ బాధ్యతలు



సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన రామకృష్ణను అభినందిస్తున్న బొప్పరాజు, తదితరులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం (అప్సా) అధ్యక్షుడు గొలిమి రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన అమరావతి సచివాలయంలో అప్సా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు నూతనంగా ఎన్నికైన అప్సా కార్యవర్గ సభ్యులందరూ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులు అధిక మెజార్టీతో తనను గెలిపించి మరింత బాధ్యత పెంచారన్నారు. సచివాలయ ఉద్యోగుల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అప్సా పని చేస్తుందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ రాష్ట్రం కోసం ఎంతో కష్టపడుతున్నారని, వారికి చేదోడువాదోడుగా ఉంటామన్నారు. ఉద్యోగుల హక్కులను కాపాడుకోవడంతో పాటు ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య సంబంధం పాత రోజుల్లో ఉన్న విధంగా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల వరకే పోటీ ఉంటుందని, తర్వాత అందరం ఉద్యోగుల కోసం కలిసి పనిచేస్తామని తెలిపారు. ఉద్యోగులందరూ కలసి పని చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకొని.. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉందని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం చంద్రబాబు ముందుంటారన్నారు. గురువారం సీపీఎస్ ఉద్యోగులకు గత ఐదేళ్లుగా పెండింగ్ పెట్టిన డీఏ బకాయిలను ప్రభుత్వం చెల్లించడంపై రామకృష్ణ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అపరిష్కృత సమస్యలను సీఎం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు.

అభినందనల వెల్లువ

అప్సా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణకు సచివాలయ ఉద్యోగులతోపాటు వివిధ సంఘాల నాయకులు, అధికారులు అభినందనలు తెలిపారు. అప్సా మాజీ అధ్యక్షులు, మున్సిపల్ శాఖ ఓఎస్‌డీ ఉప్పుటూరి మురళీకృష్ణ, ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీఎన్జీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు రామకృష్ణను సత్కరించారు.

అప్సా నూతన కార్యవర్గం ఇదే..

సచివాలయ సంఘం అధ్యక్షుడిగా జి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా నాపా ప్రసాద్, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మణకుమారి, సంయుక్త కార్యదర్శిగా (ఆర్గనైజింగ్) కేవీ రాజేంద్ర ప్రకాశ్, పి.సునీత (సంయుక్త మహిళా కార్యదర్శి), సంయుక్త కార్యదర్శి (స్పోర్ట్స్)గా మధుబాబు, ట్రెజరర్‌గా భాగ్యలక్ష్మి, అదనపు కార్యదర్శిగా లింగారెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

జర్మనీలో తెలుగు యువకుడి మృతి

▸▸ అగ్నిప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో.. నాలుగో అంతస్తు నుంచి దూకి మృత్యువాత



హృతిక్‌రెడ్డి (ఫైల్)

చిలుపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జర్మని రాజధాని బెర్లిన్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో తెలంగాణకు చెందిన తోకల హృతిక్‌రెడ్డి (26) మరణించాడు. జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని మల్కాపూర్‌కు చెందిన తోకల సంపత్‌రెడ్డి, కరుణ దంపతుల ఏకైక కుమారుడు హృతిక్‌రెడ్డి హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ఉన్నత విద్య కోసం రెండున్నరేళ్ల క్రితం బెర్లిన్ వెళ్లాడు. అక్కడి ఓ అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులో ఉన్న ఫ్లాట్‌లో స్నేహితులతో కలిసి నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి 10గంటల సమయంలో (జర్మనీ కాలమాన ప్రకారం) ఆ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగి భవనమంతా పొగ కమ్మేసింది. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు హృతిక్ రెడ్డి తాముఉంటున్న నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకేశాడు. ఈ క్రమంలో తలకు బలమైన గాయాలవ్వడంతో మరణించాడు. కుమారుడి మరణ వార్త తెలిసిన రోహిత్ తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.